

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 231

శనివారం 12-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మన ప్రియతమ ప్రధాన మంత్రి
శ్రీ. నరేంద్ర మోదీ గారికి
స్వాగతం.. సుస్వాగతం..!
గౌ॥ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ. బిశ్వ భూషణ్ హరిచందన్ గారు,
గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి సమక్షంలో
రూ.10,742 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు
నేడు విశాఖపట్నంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న
గౌ॥ ప్రధాన మంత్రి శ్రీ. నరేంద్ర మోదీ గారు

ఆంధ్రప్రదేశ్ ప్రగతికి అండగా నిలుస్తూ..
వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి విశాఖపట్నం విచ్చేస్తున్న

మన ప్రియతమ ప్రధాన మంత్రి

శ్రీ. నరేంద్ర మోదీ గారికి

స్వాగతం.. సుస్వాగతం..!



గౌ॥ శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి



గౌ॥ శ్రీ. నరేంద్ర మోదీ
భారత ప్రధాన మంత్రి

గౌ॥ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ. బిశ్వ భూషణ్ హరిచందన్ గారు,
గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి సమక్షంలో
రూ. **10,742** కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు
నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న
గౌ॥ ప్రధాన మంత్రి **శ్రీ. నరేంద్ర మోదీ** గారు

విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఉదయం 10 : 30 గంటలకు బహిరంగ సభ..

శంకుస్థాపనలు

రూ. **460** కోట్లతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ

రూ. **3,778** కోట్లతో రాయ్‌పూర్ - విశాఖపట్నం
ఎకనమిక్ కారిడార్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు

రూ. **566** కోట్లతో కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు రహదారి నిర్మాణ పనులు

రూ.**152** కోట్లతో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ, అప్‌గ్రేడేషన్

రూ. **2,658** కోట్లతో గెయిల్ ఆధ్వర్యంలో
శ్రీకాకుళం - అంగూల్, నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు నిర్మాణం..

ప్రారంభోత్సవాలు

రూ. **211** కోట్లతో పూర్తి చేసిన నరసన్నపేట - పాతపట్నం రహదారి
అభివృద్ధి పనులు జాతికి అంకితం..

రూ. **2,917** కోట్లతో నిర్మించిన
ఓఎన్‌జీసీ - యూ ఫీల్డ్ ఆన్‌షోర్ డీప్ వాటర్ బ్లాక్ ప్రాజెక్ట్ జాతికి అంకితం..

గమనిక: ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు.

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సేవా సరోజనం

నేటి సమాజమంతా డబ్బు చుట్టూ తిరుగుతోందనేది జగమెరిగిన సత్యం. ఇందుకు భిన్నంగా తనకున్న ఆస్తులు, కష్టార్జితాన్ని నిరుపేదలు, అనాథల అవసరాలు గుర్తించి వారికి అండగా నిలుస్తోంది నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ. ఎనిమిది పదుల వయసులో ఆమె సామాజిక సేవా దృక్పథం ఎంతోమందికి స్ఫూర్తిని కలిగిస్తోంది.



గుర్రాల సరోజని
ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయురాలు

గుర్రాల సరోజనమ్మ వయసు 84 ఏళ్లు. ప్రభుత్వ స్కూల్ టీచర్‌గా పనిచేసిన ఆమె విశ్రాంత జీవనం గడుపుతోంది. చుట్టుపక్కల అందరితో ఆత్మీయంగా ఉండే సరోజినమ్మ అంటే అందరికీ అభిమానమే. ఆమె ఉద్యోగం చేసి సంపాదించిన ఆస్తులను మానవతా దృక్పథంతో స్వచ్ఛంద సేవ కార్యక్రమాలకు కేటాయిస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

సొంతిల్లు దానం

పట్టణ నడిబొడ్డున గోశాల రోడ్డులో 180 గజాల విస్తీర్ణంలో సుమారు రూ. కోటి విలువ చేసే సొంతిల్లు ఉంది సరోజనమ్మకు. ఆ ఇంటిని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖకు విరాళంగా ఇచ్చేశారామె. ఇప్పుడు ఆ ఇంటిని నిరుద్యోగ యువతీ యువకుల ఉపాధి కోసం వివిధ వృత్తుల్లో శిక్షణ, ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించేందుకు కేంద్రంగా ఉపయోగించుకోనున్నారు. నిజామాబాద్ నగర కేంద్రంలో మల్లు స్వరాజ్యం మెమోరియల్ క్లినిక్‌కు అనుబంధంగా జనరిక్ హాల్ కోసం రూ. 2 లక్షలు విరాళం అందిస్తూ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. రెంజల్ మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం గోదావరి నది ఒడ్డున ఉన్న గోశాలకు రూ. లక్ష విరాళం ఇచ్చారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు రూ. 20 వేల విలువైన పుస్తకాలను స్థానిక గ్రంథాలయానికి అందించారామె. ప్రస్తుతం అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా, డివిజన్ శాఖ గౌరవ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు సరోజనమ్మ. ఆమె సేవా కార్యక్రమాలకు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామ్మోహన్‌రావు, ఇతర డివిజన్ ప్రతినిధులు తమ సహకారాన్ని అందిస్తున్నారు.

మంచి పనులే తోడు

ఎవరికైనా జీవితంలో చేసిన మంచి పనులే కడదాకా తోడుంటాయి. బతికి ఉన్నంత కాలం సాటివారికి నా వంతుగా ఏదైనా సాయం చేయాలనుకున్నాను. అందులో భాగంగానే నా శక్తి కొలదీ సాయం చేస్తూ వచ్చాను. చేసిన మేలు చెప్పుకో కూడదంటారు. నలుగురి మేలు కోసం చేసే ఏ పనైనా అది మనకు మంచే చేస్తుంది. ఈ కార్యక్రమాలకు ఇప్పటి వరకు ఎవరి నుంచి ఆర్థిక సహాయం తీసుకోలేదు. పొదుపు చేసినవి, నెలవారీ పెన్షన్‌గా వచ్చే డబ్బులే ఖర్చు పెడుతున్నాను. సేవ కార్యక్రమాలకు సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు.


– గుర్రాల సరోజనమ్మ

పెన్షన్ కూడా పేదలకే!

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన గుర్రాల సూర్యనారాయణ, వెంకట సుబ్బమ్మ రెండో కూతురు సరోజనమ్మ. వీరిది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. సరోజనమ్మ ఉన్నత విద్యనభ్యసించి ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం సంపాదించింది. ఆమె భర్త వెంకట్రావ్ బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీలో పని చేసేవారు. 1996లో సరోజనమ్మ రిటైర్డ్ అయ్యింది. 2013లో భర్త మరణించారు. వీరికి సంతానం లేదు. నెలవారీగా వచ్చే పెన్షన్‌లో అవసరాలకు కొంత ఉంచుకుని మిగిలిన డబ్బులను పేదల ఆర్థిక అవసరాలకు సహాయం చేస్తూ తన ఉదారతను చాటుకుంటున్నారామె. మరణానంతరం తన శరీరాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించాలని దానపత్రం సమర్పించారు.



బోధన్ పట్టణంలోని చెక్కి చెరువు ప్రాంతం వద్ద నిర్మాణంలో ఉన్న ధర్మస్థలం



తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌కు ఇచ్చిన బోధన్‌లోని గోశాల రోడ్డులో ఉన్న సరోజనమ్మ ఇల్లు.

అంతిమ సంస్కారాలకు ధర్మస్థలం

పొట్ట కూటి కోసం పల్లె నుంచి పట్నాలకు వచ్చిన నిరుపేదలు అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తుంటారు. కుటుంబంలో ఎవరైనా మరణిస్తే వారి అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు చాలాచోట్ల ఇంటి యజమానులు అనుమతించరు. ఈ విషాదకర పరిస్థితిలో ఆ కుటుంబ సభ్యులు పడే మానసిక క్షోభను ప్రత్యక్షంగా చూసిన సరోజినమ్మ మనసు కలిచివేసింది. ఇందుకు ఏదో పరిష్కార మార్గం చూపాలని సంకల్పించింది. ఇలాంటి నిరుపేదలు తమ కుటుంబ సభ్యుడి అంతిమ సంస్కారాలు కుల, మత. వర్గాలకతీతంగా వారి వారి సంప్రదాయాలకు అనుగుణంగా ఉచితంగా జరుపుకునేందుకు సౌకర్యంగా ఉండేవిధంగా ధర్మస్థలిని ఏర్పాటు చేసింది. బోధన్ పట్టణంలోని చెక్కి చెరువు పరిసరాల్లో ఉన్న శ్మశాన వాటిక ప్రహరీకి ఆనుకుని తన సొంత డబ్బులు రూ. 20 లక్షలు వెచ్చించి ధర్మ స్థలం నిర్మాణం చేపట్టింది. ఈ భవనంలో ఫ్రీజర్, కరెంట్, తాగు నీరు, మరుగుదొడ్ల ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో ఈ ధర్మ స్థలి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– గడ్డం గంగులు, సాక్షి, బోధన్

విజయగాథ

జీవితానికి పచ్చ జెండా

'ఆడవాళ్లు ఈ పని చేయలేరు' అని సమాజంలో కొందరు ఎర్ర జెండా చూప ప్రయత్నిస్తారు. పట్టాలకు అడ్డం పడుకుంటారు. ఆడవాళ్ల ఆత్మస్థయిర్యపు రైలు ముందుకు సాగకుండా విశ్వ ప్రయత్నం చేస్తారు. కాని కొందరు ధీరలు 'చేయగలం' అంటారు. తమ జీవితానికి తామే పచ్చజెండా ఊపుకోగలుగుతారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో సల్మా చేసిన పని అదే. భారతదేశపు తొలి రైలుగేట్ ఉమన్‌గా ఆమె నియమితమైనప్పుడు గేటు వేయలేక తీయలేక నాల్రోజుల్లో పారిపోతుందన్నారు. ఇవాళ్టికి పదేళ్లు గడిచాయి. రైళ్లు ఆమె చెప్పినట్టుగా వింటున్నాయి. 10 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన సల్మాను చూసి ఆ గేటు మీదుగా వెళ్లే రైళ్లన్నీ శాల్యూట్ చేస్తున్నాయి.



సల్మా

'బంధువులు ఎప్పుడూ ఏదో ఒకటి అంటూ ఉంటారు. తల్లిదండ్రులు గట్టిగా నిలబడాలి. నా తల్లిదండ్రులు నిలబడ్డారు. అందుకే ఇప్పుడు జీవితంలో స్థిరపడ్డాను' అంటుంది సల్మా. ఆమె పూర్తి పేరు మిర్జా సల్మా బేగ్. వయసు 29. భారతదేశపు తొలి మహిళా గేట్ ఉమన్‌గా రైల్వే శాఖలో 2013లో చేరింది సల్మా. ఆమె పని చేసే రైల్వే క్రాసింగ్ లక్నోకు ఆనుకుని ఉన్న మల్హార్ స్టేషన్. ఇప్పుడు ఆ దారిన పోయే రైళ్ల డ్రైవర్లకు, గార్డులకు ఆమె సుపరిచితం అయ్యింది గాని కొత్తగా ఎవరైనా ఆ రైల్వే క్రాస్ గుండా వెళుతుంటే మాత్రం ఆగి సల్మాను మెచ్చుకోలుగా చూస్తూ ఉంటారు. ఎందుకంటే రైల్వే గేట్ దగ్గర ఒక స్త్రీ, అందునా హిజాబ్ ధరించిన స్త్రీ, పని చేయడం నేటికీ అరుదు కనుక.



'మా నాన్న సలీం బేగ్ రైల్వే గేట్ మేన్‌గా పని చేసేవాడు. ఆయన అనారోగ్యం వల్ల చెవుడు వచ్చింది. రైలు గంట వినకపోతే గేట్‌మేన్‌గా పని చేయడం కష్టం. ఆయన వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని నన్ను ఉద్యోగంలో పెట్టాలనుకున్నాడు. ఎందుకంటే నాకు అన్నదమ్ములు లేరు. అమ్మకు పక్షవాతం. నాన్న సంపాదించే స్థితిలో లేడు. గేట్ మేన్ ఉద్యోగం పురుషులకు మాత్రమే అని రైల్వే శాఖ ఎప్పుడూ చెప్పలేదు. కాని ఆడవాళ్లు ఆ ఉద్యోగం కోసం అప్లై చేయరు. కష్టమైన పని. పైగా నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదం. అయితే ఆ పని నాక్కూడా కష్టమే అని నాకు తెలుసు. కాని రైల్వేలో వేరే ఉద్యోగం ఇమ్మని అడిగితే ఆ ఉద్యోగం నాకు అందడానికి చాలా రోజులే పట్టవచ్చు. అదే మా నాన్న పనే నేను చేస్తానంటే వెంటనే ఇస్తామన్నారు. అలా ఈ ఉద్యోగంలో చేరాను' అంది సల్మా.

ఆమె చేరినప్పుడు ఆమెతో పాటు లక్నోలో 11 మంది పురుష గేట్ మేన్‌లు ఉండేవారు. వారంతా 'ఈ అమ్మాయి ఈ పని చేయలేక నాలుగు రోజుల్లో పారిపోతుంది' అన్నారు. సల్మా పని చేస్తుంటే హేళన చేసేవారు. బంధువులైతే ఇంటికి వచ్చి మరీ సూటి పోటి మాటలు అనేవారు. అమ్మాయి జీవితం నాశనం చేశారని తల్లిదండ్రులను మాటలనేవారు. కాని నాలుగు నెలలు గడిచినా సల్మా బెణకలేదు. బెసకలేదు. తండ్రి సాయంతో అధికారుల సపోర్ట్‌తో పని క్షుణ్ణంగా నేర్చుకుంది. రైలు వచ్చే ముందు గేటు వేసి వెళ్లాక గేటు తీయడానికి లివర్ ఉన్న ఇనుప చక్రం తిప్పాలి. నేర్చుకుంది. సమర్థంగా చేసింది. గత పదేళ్లుగా రోజుకు 12 గంటల డ్యూటీ చేసి విజేతగా నిలిచింది. ఆమె ఉద్యోగంలో చేరినప్పుడు పత్రికలు తొలి గేట్ ఉమన్‌గా వర్ణిస్తూ పేపర్లలో రాయడంతో బంధువులు చల్లబడి 'మా అమ్మాయే' అనడం మొదలెట్టారు.

'ఆడవాళ్లు చేయలేని పనంటూ ఈ ప్రపంచంలో లేదు. ప్రయత్నించాలి అంతే. నా ఉద్యోగంలో పదేళ్లు గడిచిపోయాయి. ఇటీవలే మా అమ్మ చనిపోయింది. ఆమె నాకు ఇచ్చిన ఆసరా నేను మర్చిపోలేను' అంటుంది సల్మా.

గొప్ప గొప్ప విజయాలు ఒక సంకోచంతో నిండిన అడుగు నుంచే మొదలవుతాయి. సంకోచాన్ని ధైర్యంతో దాటాలి. ధైర్యంతోపాటు సంకల్పం తోడు రావాలి. ప్రయత్నం జత పడాలి. ఆ తర్వాత వచ్చినట్టు 'విజయం' అనే స్టేషన్ వచ్చి తీరుతుంది.

మీరూ ప్రయత్నించండి.

హెల్త్ టిప్



శరీరం మీద దద్దుర్లు దురదతో బాధిస్తుంటే.. కొబ్బరి నూనెలో కొద్దిగా అలోవెరా జెల్ వేసి పేస్టులా కలిపి దద్దుర్ల పైన రాస్తే ఉపశమనం లభిస్తుంది.

స్త్రీ శక్తి

'మా అమ్మాయికి ఆటలు రావు. వచ్చినా ఇంటి ఆవరణలో తప్ప బయట ఎక్కడా ఆడనివ్వం' అనే తండ్రులు ఇప్పుడు తమ నిర్ణయాన్ని మార్చుకుంటున్నారు. కాలంతో పాటు మారుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూతురు సాధించిన విజయాలను చూసి ఆనందంలో తేలిపోతున్నారు

కల కనాలి కదం తొక్కాలి గెలవాలి



అబ్బాయి కాదు అమ్మాయి: రెజ్లింగ్ స్టార్ రీతిక


హరియాణా రాష్ట్రం రోహ్‌తక్‌లోని సర్ ఛోటు రామ్ (సీఆర్) స్టేడియంలో ఒక దృశ్యం సర్వసాధారణంగా కనిపిస్తుంది. పొట్టితలకట్టుతో, స్పోర్ట్స్‌వేర్‌లో దృఢకాయులైన యువజనులు రెజ్లింగ్ సాధన చేస్తూ కనిపిస్తుంటారు. వాళ్లందరూ అమ్మాయిలే అని నమ్మడానికి కాస్త సమయం పట్టవచ్చు.

కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళితే...

'రెజ్లింగ్ అనేది పురుషులకు సంబంధించిన ఆట మాత్రమే' అనే భావన దేశంలోని అనేక ప్రాంతాలలాగే రోహ్‌తక్‌లోనూ ఉండేది. అడపాదడపా రెజ్లింగ్‌లో పాల్గొనే అమ్మాయిలను అందరూ ఆశ్చర్యంగా చూసేవారు. రోహ్‌తక్ పట్టణం నుంచి ఇరవైమందికి పైగా యువతులు అంతర్జాతీయ స్థాయిలో రెజ్లింగ్‌లో పతకాలు సొంతం చేసుకోవడంతో, ఈ స్ఫూర్తితో ఎంతో మంది అమ్మాయిలు రెజ్లింగ్‌లోకి రావడానికి ఇష్టపడుతున్నారు. తల్లిదండ్రులు కూడా వీరికి మద్దతు ఇస్తున్నారు.

ఇరవైరెండేళ్ల అనీల్ లక్వాని మాజీ మల్లయోధుడు. తన చెల్లెళ్లు పింకి(20), మంజుల (17)లకు దగ్గరుండీ మరీ రెజ్లింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాడు. ఒక అన్న తన చెల్లెళ్ని స్టేడియంకు తీసుకువెళ్లి రెజ్లింగ్ ప్రాక్టీస్ చేయించడం అనేది గతంలో ఊహకు కూడా అందని విషయం. గత సంవత్సరం జూనియర్ వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంది పింకి. ప్రస్తుతం ఏసియా గేమ్స్ కోసం సన్నద్ధం అవుతోంది. మంజు కూడా ఎన్నో జూనియర్ నేషనల్ టోర్నమెంట్స్‌లో పాల్గొంది.

'నా చెల్లెళ్లు తప్పకుండా నా నమ్మకాన్ని నిలబెడతారు. కొంత కాలం క్రితం మేము నంగ్లా అనే చిన్న ఊళ్లో ఉండేవాళ్లం. నాన్న దినసరి కూలి. మరో మనిషి పనిచేస్తేగానీ కుటుంబం గడవదు. దీంతో చెల్లెళ్ల కోసం రెజ్లింగ్‌కు దూరం అయ్యాను. తండ్రికి ఆసరాగా కూరగాయలు అమ్ముతున్నాను. ఊళ్లో ఉంటే చెల్లెళ్లకు మెరుగైన శిక్షణ ఇప్పించడం కుదరదు కాబట్టి రోహ్‌తక్‌కు వచ్చాం' అంటున్నాడు అనీల్.



పింకీమాలిక్



రెజ్లింగ్ సాధనలో ఇద్దరు చెల్లెళ్లు, అన్న అనీల్

స్టేడియంలో ఒక మూల రెజ్లింగ్ సాధన చేస్తున్న 30 సంవత్సరాల పింకీ మాలిక్ రెండుసార్లు కామన్‌వెల్త్ గోల్డ్ మెడలిస్ట్. గత సంవత్సరమే ఆమె వివాహం జరిగింది. అయితే 'పెళ్లి తరువాత ఆటలు బంద్' అని ఆమె అనుకోవడం లేదు. ఎప్పటిలాగే రెజ్లింగ్‌ను దీక్షగా సాధన చేస్తోంది.

'అత్తామామల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతాయేమో... అనే చిన్న అనుమానం నాలో ఉండేది. అయితే నా విషయంలో వారు ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. పైగా ప్రోత్సహిస్తుంటారు. పెద్దల ఆలోచనాధోరణి మారింది అని చెప్పడానికి ఇది సూచన' అంటుంది పింకీమాలిక్.

అంత మాత్రాన అందరూ ఒకేలా ఆలోచించడం లేదు. దీనికి ఉదాహరణ రీతిక హుడా. రీతిక స్కూల్లో హ్యాండ్‌బాల్ టీమ్‌కు ఎంపికైంది. తండ్రి ససేమిరా అన్నాడు. ఇంటి ఆవరణలో తప్ప బయట ఎక్కడా ఆడకూడదు అనేది ఆయన శాసనం. స్కూల్ వాళ్లు వచ్చి ఆయన మనసు మార్చే ప్రయత్నం చేశారు. అయితే కూతురిని వేరే స్కూల్‌కు మార్చాడు గానీ తన నిర్ణయం మార్చుకోలేదు.

అలాంటి తండ్రిలో మెల్లమెల్లగా మార్పు తీసుకువచ్చి తనకు ఇష్టమైన రెజ్లింగ్‌లోకి దిగింది రీతిక. గత సంవత్సరం బల్గేరియాలో జరిగిన జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఒకప్పుడు ఇల్లు దాటి బయటికి అడుగుపెట్టడానికి అనుమతి లేని రీతిక ఇప్పుడు తన బుల్లెట్ బండిపై రోహ్‌తక్ వీధుల్లో సగర్వంగా తిరుగుతోంది.

'కాలంతో పాటు మనలోనూ మార్పు రావాలి. అది అనివార్యం' అంటున్నాడు రీతిక తండ్రి జగ్బీర్ సింగ్.

'తమలో సహజంగా ఉండే క్రమశిక్షణ, అంకితభావం వల్ల విజయం సాధించడం మహిళలకు సులువవుతుంది. ఒక అమ్మాయి అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధిస్తే అది ఆమెకు మాత్రమే పరిమితం కావడం లేదు. ఎంతోమంది అమ్మాయిలు ఆ విజయం నుంచి స్ఫూర్తి పొందుతున్నారు. ఇదొక శుభపరిణామం' అంటున్నారు సీఆర్ స్టేడియం కోచ్ మన్‌ప్రీత్.

టైటిల్ సాధిస్తా..!

మిస్ సుప్రా నేషనల్ ప్రజ్ఞ అయ్యగారి

"ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మాయిలు ఆత్మవిశ్వాసం వదులుకోకూడదని, కలల్ని విజయాలుగా మలచుకోవాలని" అంటోంది హైదరాబాద్ వాసి ప్రజ్ఞ అయ్యగారి... అంతర్జాతీయ పోటీల్లో టైటిల్ గెలుస్తానని అదే ఆత్మవిశ్వాసంతో చెబుతోంది. కుష్టు వ్యాధి బాధితులకు బాసటగా ససాకవా లెప్రసి ఆధ్వర్యంలో జరిగిన గ్లోబల్ ఫోరమ్ ఆఫ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ పేరిట నిర్వహించిన సదస్సుకు బ్రెజిల్ సుందరి లెటికా సెజర్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా 'సాక్షి' తో పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే...

సికింద్రాబాద్‌లో మా కుటుంబం నివసిస్తోంది. హిమాయత్‌నగర్‌లోని ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేస్తున్నాను. గ్లామర్ రంగంలో రాణిస్తూనే సస్టైయినబుల్ ఫ్యాషన్‌కు సంబంధించి డిజైనర్‌గా రాణించాలనేదే నా లక్ష్యం.

నొప్పించకుండా ఒప్పించాను

గ్లామర్ రంగంలోకి ప్రవేశిస్తానని చెప్పడానికి కూడా సంకోచించాల్సినంత సంప్రదాయ కుటుంబం మాది. మా బంధుమిత్రుల్లో ఎవరూ ఈ రంగంలో అడుగుపెట్టింది లేదు. అయితే నాలో ఒకసారి ఈ ఆలోచన వచ్చి, గట్టిగా నిర్ణయించుకున్న తర్వాత... రెండేళ్లపాటు మా ఇంట్లోవాళ్లని దశలవారీగా ఒప్పిస్తూ వచ్చాను. దీనిలో భాగంగా ఎంతో మంది బ్యూటీక్వీన్‌ల విజయగాథలను వివరించాను. నాన్న త్వరగానే ఒప్పుకున్నా, అమ్మని ఒప్పించడానికి మరింత కష్టపడాల్సి వచ్చింది. ఇప్పుడు మాత్రం అందరూ హ్యాపీ.

ఒకడుగు వెనక్కు

కేవలం 17 ఏళ్ల వయసులో మిస్ వరల్డ్ అయిన మానుషి చిల్లర్ నాకు స్ఫూర్తి. గత మిస్ ఇండియాలో కాంటెస్ట్ చేసి గెలుపొందకపోయినా, ఆ తర్వాత ఆగస్టులో జరిగిన లివా మిస్ దివా సుప్రానేషనల్ గెలిచాను. తద్వారా వచ్చే జులై-ఆగస్టు మధ్య పోలండ్‌లో జరిగే మిస్ సుప్రా ఇంటర్నేషనల్‌కు పోటీపడుతున్నా (ఈ పోటీల్లో ఇప్పటికి భారత్ రెండుసార్లు మాత్రమే ఈ కిరీటం గెలుచుకుంది. ఇందులో కేజీఎఫ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి ఒకరు)




ఇటు నృత్యం అటు చెస్

హాబీల విషయానికి వస్తే.. పుస్తకాలు బాగా చదువుతాను. హాబీలకు మించింది నా భరతనాట్య అభిరుచి. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రదర్శనలు ఇచ్చాను. అలాగే చదరంగంలో కూడా ఇంటర్ స్కూల్ టోర్నమెంట్స్‌లో ఆడిన అనుభవం ఉంది. నువ్వు కలగన్నావంటే గెలుస్తావన్నట్టే అన్న ఆంగ్లోక్తిని నమ్ముతాను... అందుకే కలలు కంటున్నాను... గెలుపును నమ్ముతున్నాను'' అని చెబుతున్న ప్రజ్ఞ కలలు నెరవేరాలని కోరుకుందాం.

– ఎస్.సత్యబాబు, సాక్షి



ప్రజ్ఞ అయ్యగారి



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 231

శనివారం 12-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



4 స్వర్ణాలు, 1 రజతం

ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళలకు 5 పతకాలు - 11లో



గ్లో'బుల్' పరుగు

సెన్సెక్స్ లాభం 1,181 పాయింట్లు.. 321 పాయింట్లు పెరిగిన నిఫ్టీ - 11లో



నేడు హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలు

నేడు జరగనున్న హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 68 స్థానాలకు 412 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.

వివరాలు 6లో



'జ్ఞానవాపి'పై స్టేటస్ కో

వారణాసిలోని జ్ఞానవాపి సముదాయంలో శివలింగం లభ్యమైన ప్రాంతంలో యథాతథ స్థితిని కొనసాగించాలని సుప్రీం పేర్కొంది.

వివరాలు 6లో



వారానికి 80 గంటల పని

ట్విట్టర్ ఉద్యోగులు వారానికి 80 గంటలు పని చేయాలని, వర్క్ ఫ్రమ్ హోమ్ రద్దు చేస్తున్నామని ఎలన్ మస్క్ స్పష్టం చేశారు.

వివరాలు 6లో



నియామకాల్లో జాప్యమా..

హైకోర్టుల్లో జడ్జీల నియామకానికి చేసిన సిఫార్సులను కేంద్రం పెండింగ్‌లో పెట్టడం పట్ల సుప్రీం అసంతృప్తి వ్యక్తం చేసింది.

వివరాలు 6లో

మూడేళ్లుగా ఏపీ నంబర్ వన్

ఇదీ మన ఘనత

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కొనసాగుతున్న ప్రస్థానం

- ఐటీసీ గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవంలో సీఎం వైఎస్ జగన్
- ప్రముఖ పారిశ్రామికవేత్తల చూపు రాష్ట్రం వైపు.. పరిశ్రమలు పెట్టిన వాళ్ల అభిప్రాయం ఆధారంగానే ఈ ర్యాంకింగ్
- ఐటీసీ స్పైసెస్ ప్లాంట్ ఏర్పాటుతో 14 వేల మంది రైతులకు లబ్ధి
- 15 రకాల సేంద్రియ సుగంధ ద్రవ్యాల ప్రాసెస్, ఎగుమతి
- తద్వారా ఈ ప్రాంత రైతుల ఉత్పత్తులకు మంచి గిరాకీ
- రూ.3,450 కోట్లతో 26 జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నలకు ఇవి ఒక పెద్ద వరం



పల్నాడు జిల్లా వంకాయలపాడు వద్ద ఐటీసీ గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో ఐటీసీ చైర్మన్ సంజీవ్ పూరి తదితరులు

సాక్షి, నరసరావుపేట: ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పూర్తిగా అనుకూల వాతావరణం ఉందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. పరిశ్రమలకు సింగిల్ విండోలోనే అనుమతులు ఇస్తున్నందున ప్రముఖ పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రంపై అత్యంత ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. ఈ కారణంగా గత మూడేళ్లుగా మన రాష్ట్రం వరుసగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడు వద్ద

మిగతా 2వ పేజీలో ▶

ప్రపంచంతో ముస్లింలు పోటీ పడాలి

- నా మైనారిటీ అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు అస్సలామ్ అలైకుమ్
- మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో సీఎం
- మూడేళ్లలో మైనార్టీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు అందించాం

- వివరాలు 2లో

ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం జగన్. చిత్రంలో గవర్నర్ హరిచందన్



ప్రధాని మోదీకి ఘన స్వాగతం

- ఐఎన్ఎస్ డేగాలో మోదీకి ఆత్మీయ స్వాగతం పలికిన గవర్నర్, సీఎం
- రాత్రి ఐఎన్ఎస్ చోళ సూట్‌లో బస, పోర్టు గెస్ట్‌హౌస్‌లో సీఎం జగన్
- నేడు ఏయూ మైదానంలో రూ.10,742 కోట్ల విలువైన 7 ప్రాజెక్టులకు శంకుస్థాపన, జాతికి అంకితం

- వివరాలు 5లో

మూస ధోరణికి తెర

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- బెంగళూరులో వందేభారత్ రైలును ప్రారంభించిన మోదీ
- 108 అడుగుల ఎత్తయిన కెంపేగౌడ విగ్రహం ఆవిష్కరణ

6లో

న్యూస్‌రీల్

ఘనంగా మహిళా వర్సిటీ స్నాతకోత్సవం



తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ 19, 20వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వీసీ హోదాలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పాల్గొని విద్యార్థినులకు డిగ్రీ పట్టాలు, గోల్డ్ మెడల్స్, పుస్తక, నగదు బహుమతులను అందించారు.

వివరాలు 2లో ▸

బలపడిన అల్పపీడనం!



నైరుతి బంగాళాఖాతంలో ఈశాన్య శ్రీలంక వద్ద కొనసాగుతున్న అల్పపీడనం శుక్రవారం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రల్లో చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

వివరాలు 8లో ▸

నర్వ్ స్టిమ్యులేషన్‌తో... పక్షవాతానికి చెక్!



పక్షవాత రోగులకు శుభవార్త. నర్వ్ స్టిమ్యులేషన్ చికిత్స, మెరుగైన ఫిజియోథెరపీ ద్వారా పక్షవాతానికి చెక్ పెట్టడంలో వైద్య పరిశోధక బృందం విజయం సాధించింది. తొమ్మిది మంది రోగులు ఈ రెండు చికిత్సల ద్వారా పూర్తిగా కోలుకుని తిరిగి నడవగలిగారు.

వివరాలు 6లో ▸

ఇంజనీరింగ్‌లో 80శాతం సీట్లు భర్తీ



రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. సుమారు 80 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 23,303 సీట్లు మిగిలి ఉన్నాయి. ఐఐటీలు, ఎన్ఐటీలకు విద్యార్థులు వెళ్లిపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి.

వివరాలు 12లో ▸

విశాఖపట్నం రైల్వేజోన్‌కు ఓకే

- హెడ్‌క్వార్టర్స్‌కు రూ.106 కోట్లు మంజూరు చేసిన రైల్వే బోర్డు
- త్వరలోనే పనులు ప్రారంభిస్తాం: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్
- విశాఖలో శుక్రవారం రాత్రి స్థలాన్ని పరిశీలించిన మంత్రి



వైర్‌లెస్ కాలనీలో జోన్ హెడ్‌క్వార్టర్స్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే బోర్డు చైర్మన్, సీఈవో వీకే త్రిపాఠి

సాక్షి, విశాఖపట్నం: సుదీర్ఘంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖలో ఘనంగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తీపి కబురు అందింది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ నిర్మాణానికి రైల్వే బోర్డు నుంచి గురువారం అనుమతులు మంజూరయినట్లు రైల్వే మంత్రి అశ్వినీ కుమార్ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ విశాఖలో పర్యటిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన విశాఖ వచ్చారు. జోన్‌కు అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో రైల్వే బోర్డ్ చైర్మన్, సీఈవో వీకే త్రిపాఠీ సైతం కేంద్ర మంత్రితో విశాఖ చేరుకున్నారు. వారికి ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ రూప్ నారాయణ్, వాల్తేరు డీఆర్ఎం అనూప్ కుమార్ శ్రీవాత్సవ స్వాగతం పలికారు. అనంతరం కొత్తగా జోనల్ ప్రధాన కార్యాలయం నిర్మించనున్న వైర్‌లెస్ కాలనీని మంత్రి శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ వైర్‌లెస్ కాలనీలో ప్రతిపాదిత ఎస్‌సిఓఆర్ జోనల్ హెడ్ క్వార్టర్స్ నిర్మాణానికి రూ.106 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని, ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు.

రాజీవ్ హత్య కేసు... దోషులందరికీ విముక్తి

ఆరుగురి విడుదలకు సుప్రీంకోర్టు ఆదేశం

ఇప్పటికే విడుదలైన పెరారివళన్

30 ఏళ్లకు పైగా జైల్లో ఉన్న దోషులు

■ దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న మొత్తం ఆరుగురు దోషుల ముందస్తు విడుదలకు సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఇదే కేసులో దోషిగా 30 ఏళ్లకు పైగా శిక్ష అనుభవించిన ఎ.జి.పెరారివళన్ సుప్రీంకోర్టు ఆదేశం మేరకు గత మే 18న విడుదలైన నేపథ్యంలో మిగతా దోషులకూ అదే వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొంది. ''వారికి క్షమాభిక్ష పెట్టాలంటూ గతంలోనే తమిళనాడు ప్రభుత్వం సిఫార్సు చేసింది. దీంతోపాటు దోషుల సత్ప్రవర్తనను కూడా పరిగణనలోకి తీసుకున్నాం'' అని ధర్మాసనం తెలిపింది.

6లో





జనవరి 8న గ్రూప్‌-1 ప్రిలిమ్స్

- పాలనా కారణాలతో వచ్చే నెల 18న జరగాల్సిన పరీక్ష వాయిదా.. 9 నెలల్లో గ్రూప్‌–1 పోస్టుల నియామక ప్రక్రియ
- ఇతర పోస్టులను త్వరగా భర్తీ చేసేలా చర్యలు
- న్యాయపరమైన వివాదాలు రాకుండా ముందు జాగ్రత్తలు
- ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్

సాక్షి, అమరావతి: గ్రూప్‌–1 పోస్టుల భర్తీకి ప్రిలిమ్స్ పరీక్షను జనవరి 8న నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్ గౌతమ్ సవాంగ్ తెలిపారు. పాలనా కారణాలతో డిసెంబర్ 18న జరగాల్సిన ఈ పరీక్షను వాయిదా వేస్తున్నామన్నారు. డిసెంబర్ 17 నుంచి 20 తేదీ వరకు బ్యాంకింగ్ పరీక్షలు జరగనున్నందున అభ్యర్థుల మేలు కోసం గ్రూప్‌–1 పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు. గ్రూప్‌–1 పోస్టుల

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



బీజేపీ వాళ్లకు 'సిట్' మీద నమ్మకం లేదట.. టీఆర్ఎస్ వాళ్లకు సీబీఐ మీద లేదట సార్!!

అమరావతి అసైన్డ్ భూముల కేసులో సాక్షులకు

టీడీపీ బెదిరింపులు

వాటిని కోర్టు దృష్టికి తేవడానికి సిద్ధమవుతున్న సాక్షులు

- నాడు చంద్రబాబు, నారాయణ ఒత్తిడితోనే జీవో 41 జారీ
- దాంతోనే రూ.4వేల కోట్ల అసైన్డ్ భూమి కొల్లగొట్టిన టీడీపీ పెద్దలు
- అమరావతిలోని బడుగు వర్గాలను బెదిరించి 964 ఎకరాలు స్వాహా
- ఆ తర్వాత అసైన్డ్ భూములకూ భూసమీకరణ ప్యాకేజీ ఇస్తూ జీవో
- ఇది నిబంధనలకు విరుద్ధమని మొత్తుకున్న ఉన్నతాధికారులు.. అయినా వినని అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ
- సీఐడీ దర్యాప్తులో వాంగ్మూలం ఇచ్చిన కీలక అధికారులు



- నిబంధనలకు విరుద్ధంగా వాంగ్మూలం ప్రతులు సంపాదించిన టీడీపీ
- అప్పటి నుంచి సాక్షులపై ఒత్తిళ్లు, బెదిరింపులు

2లో

క్లుప్తంగా

ఘనంగా మహిళా వర్సిటీ స్నాతకోత్సవం



గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న పద్మజారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ 19, 20వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకల్లో వీసీ హోదాలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పాల్గొని విద్యార్థినులకు డిగ్రీ పట్టాలు, గోల్డ్ మెడల్స్, పుస్తక, నగదు బహుమతులను అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన ప్రముఖ శాస్త్రీయ కూచిపూడి నృత్యకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం పద్మజారెడ్డి హాజరవగా, గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. యూనివర్సిటీ ప్రగతి నివేదికను వీసీ ప్రొఫెసర్ దువ్వూరు జమున చదివి వినిపించారు. స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్ విభాగాల్లో 988 మంది గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు అందుకున్నారు. అలాగే 108 మంది విద్యార్థినులు గోల్డ్ మెడల్స్ పొందారు. కళాశాల ఎన్ఆర్ఐ విద్యార్థిని ఆముక్తమాల్యద సుష్మ పీహెచ్‌డీ పట్టాను గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. మస్కట్‌కు చెందిన ఆమె.. మ్యూజిక్ విభాగం(ఇంటర్నల్ రిలేషన్స్)లో 2021 జూలైలో పీహెచ్‌డీ చేశారు.

పెన్ డ్రైవ్ పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం జగన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో రెహాన

సాక్షి, అమరావతి: జర్నలిస్ట్ రెహాన రచించిన సమకాలీన రాజకీయ పరిశీలన వ్యాసాల సంకలనం 'పెన్ డ్రైవ్' పుస్తకాన్ని శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించారు. వివిధ పత్రికల్లో, ఆయా సందర్భాల్లో రాసిన వ్యాసాలను పెన్ డ్రైవ్ పేరుతో పుస్తక రూపంలో తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమెను సీఎం అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు(కమ్యూనికేషన్స్) జీవీడీ కృష్ణమోహన్, సీఎం సీపీఆర్వో పూడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు ఘన నివాళి



కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నేతలు

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను శుక్రవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణ మాట్లాడుతూ ఆ మహనీయుడి ఆశయాల సాధనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు.

'మల్లాది' బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లాది

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడిగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం లక్ష్యానికి అనుగుణంగా అణగారిన వర్గాల సామాజిక, ఆర్థికాభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు.

'రాజధాని' పేదలకు పింఛను సొమ్ము జమ

సాక్షి, అమరావతి: రాజధాని గ్రామాల్లో భూమి లేని పేదలందరికీ పింఛను సొమ్మును ప్రతి నెలా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతిలోని 29 గ్రామాల్లో భూమి లేని 19,110 మంది పేదలకు రూ.2,500 చొప్పున పింఛన్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభివాదం చేస్తున్న మహిళలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రక్ష కడుతున్న ముస్లిం మహిళ



గుంటూరులో సీఎం వైఎస్ జగన్‌ను చూసి నమస్కరిస్తున్న మహిళలు

ప్రపంచంతో ముస్లింలు పోటీ పడాలి

- నా మైనారిటీ అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ముళ్లకు అస్సలాం అలైకుమ్
- మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్
- మూడేళ్లలో ఏకంగా రూ.20 వేల కోట్లు అందించాం
- మైనారిటీల కోసం నాన్న ఒకడుగు ముందుకు వేస్తే నేను రెండు అడుగులు..
- వక్ఫ్ ఆస్తులు కాపాడేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం
- పదవుల నుంచి సంక్షేమం వరకు మైనారిటీలకు అన్నింటా న్యాయం
- గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను గమనించండి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'ప్రతి ముస్లిం ప్రపంచంతో పోటీ పడి చదవాలి.. గెలవాలి. వీళ్లు గెలవాలంటే కచ్చితంగా చదువు అనే అస్త్రం వీళ్ల చేతుల్లో ఉండాలి. అందుకే చదువుల మీద మన ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గుంటూరు నగరంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మైనారిటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మైనారిటీ సంక్షేమ దినోత్సవం, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనారిటీ సోదరులు, అక్కచెల్లెమ్మలకు మీ సోదరుడు, స్నేహితుడు, మీ కుటుంబ సభ్యుడైన మీ జగన్ ప్రేమ పూర్వక అస్సలామ్ అలైకుమ్. భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రిగా ఈ దేశంలో అనేక ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు స్థాపించిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మనం జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీస్ వెల్ఫేర్ డే (అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవం)గా కూడా జరుపుకుంటున్నాం. మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప రచయిత, పాత్రికేయుడు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా 1947 నుంచి 1958 వరకు ఆయన విశేష సేవలు అందించారు. అబుల్ కలాం జయంతిని మైనార్టీస్ డే గా 2008లో అప్పటి ముఖ్యమంత్రి, దివంగత ప్రియతమ నేత రాజశేఖరరెడ్డి (నాన్నగారు) తొలిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకటించారు' అని చెప్పారు.

మైనారిటీ సంక్షేమంలో గొప్ప మార్పు

- ముస్లింల్లో పేదలందరికీ దేశంలోనే తొలిసారిగా ఏపీలో రిజర్వేషన్లు వర్తించిన పరిస్థితులు వచ్చాయంటే అది దివంగత సీఎం వైఎస్సార్ వల్లే జరిగింది. ఆ విషయం చెప్పుకోవడానికి ఒక కొడుకుగా గర్వపడుతున్నాను.
- నాన్నగారు ముస్లిం సోదరుల పట్ల, మైనారిటీల సంక్షేమం పట్ల ఒక అడుగు వేస్తే.. ఆయన కొడుకుగా మీ జగన్ రెండు అడుగులు ముందుకు వేస్తున్నాడు. పదవులు, వారికి సంక్షేమం అందించే విషయంలో రాష్ట్రంలో 2019 నుంచి గొప్ప మార్పులు చోటుచేసుకుంటున్నాయి.
- గత ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు మంత్రి పదవి ఇవ్వడానికి కూడా మనసు రాని పరిస్థితి. ఈ రోజు ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవిలో ఒక మైనారిటీ సోదరుడు ఉన్నారు. మార్పు మీరే గమనించండి. మన పార్టీ నుంచి నలుగురు మైనారిటీలను ఎమ్మెల్యేలుగా దేవుడి దయతో గెలిపించుకోగలిగాం. మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో నలుగురిని ఎమ్మెల్సీలుగా నియమించుకున్నాం.
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా నా అక్క ఇవాళ శాసన మండలి ఉపాధ్యక్ష పదవిలో ఉంది. మైనారిటీ సోదరుడు ఆర్టీఐ చీఫ్ కమిషనర్ పదవిలో ఉన్నాడు. ఇన్ని ఉదాహరణలు ఎందుకంటే.. మనసుతో మంచి చేస్తున్నాం అని చెప్పడానికే. గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి మధ్య తేడాను గమనించాలని కోరుతున్నా.

3 ఏళ్ల 4 నెలల కాలంలో..

- రాష్ట్రంలో మనందరి ప్రభుత్వం ఏర్పడ్డాక 2019 జూన్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు అంటే 3 సంవత్సరాల 4 నెలల కాలంలో వివిధ పథకాల కింద కేవలం డీబీటీ విధానంలో బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి లంచాలు, వివక్ష లేకుండా నగదు జమ చేస్తున్నాం. వ్యవస్థలో గొప్ప మార్పు చోటుచేసుకుంది.
- ఈ మూడేళ్ల 4 నెలల కాలంలోనే డీబీటీ ద్వారా 44,13,773 మైనారిటీ కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి రూ.10,309 కోట్లు జమ చేశాం. నాన్ డీబీటీ ద్వారా మరో 16,41,622 మైనార్టీ కుటుంబీకులకు మరో రూ.10 వేల కోట్లు లబ్ధి చేకూర్చాం. 2,42,226 మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు కేటాయించాం. 1,36,888 మంది అక్కచెల్లెమ్మలకు ఇప్పటికే ఇళ్లు కూడా మంజూరు చేశాం. అవి నిర్మాణంలో ఉన్నాయి. మొత్తంగా ఒక్క ఇళ్లకు సంబంధించి మాత్రమే రూ.9,400 కోట్లు వీరి చేతిలో పెట్టగలిగాం.
- టీడీపీ హయాంలో 2014–19 వరకు ఐదేళ్లలో మైనారిటీల సంక్షేమం కోసం చేసిన ఖర్చు కేవలం రూ.2,665 కోట్లే. మన ప్రభుత్వంలో ఏకంగా రూ.20 వేల కోట్ల లబ్ధి. అప్పటికి, ఇప్పటికి ఎంత తేడా ఉందో పోల్చి చూడండి.

> **ప్రతి ముస్లిం చెల్లి, తమ్ముడు చదవాలి**
>
> వైఎస్సార్ షాదీ తోఫా పథకానికి పదో తరగతి సర్టిఫికెట్ అర్హత తీసేయమని మన సోదరుడు అడిగారు. ఈ సర్టిఫికెట్ నేను తీసేస్తే.. నా చెల్లెమ్మలు ఎవరూ చదువుకునే పరిస్థితి ఉండదు. వాళ్లు చదవాలి. ప్రతి ముస్లిం చెల్లి, ప్రతి తమ్ముడు చదవాలి. దేశంతో కాకుండా.. ప్రపంచంతో పోటీపడి గెలవాలి. వీళ్లు గెలవాలంటే కచ్చితంగా చదువు అనే అస్త్రం వీళ్ల చేతుల్లో ఉండాలి. అది లేకపోతే పోటీ ప్రపంచంలో వీళ్లు నెగ్గలేరు. ప్రతి ఒక్కరినీ చదివించాలనే ఉద్దేశంతోనే ఉర్దూను నేర్పిస్తూ మరో వైపు ఇంగ్లిష్‌లో కూడా తర్ఫీదు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నాం. చదువుకునేందుకు అన్ని విధాలా తోడుగా నిలుస్తున్నాం. తద్వారా కనీసం పదో తరగతి వరకు కచ్చితంగా చదివిస్తారు. ఆ తర్వాత పై చదువులు కూడా చదవ గలుగుతారనే నమ్మకం ఉంది. అందరూ ఇది అర్థం చేసుకోవాలి.

వక్ఫ్ ఆస్తుల రక్షణకు పటిష్ట చర్యలు

- వక్ఫ్ బోర్డు ఆస్తులను సంరక్షించాలని ప్రతి అడుగు సిన్సియర్‌గా వేస్తున్నాం. రాష్ట్రం మొత్తం మీద 65,783 ఎకరాల వక్ఫ్ భూములుండగా.. పలుచోట్ల అవి అన్యాక్రాంతమైనట్లు కనిపిస్తున్నాయి. వీటిని ఒక పద్ధతి ప్రకారం తిరిగి వక్ఫ్‌కు స్వాధీనం చేసే కార్యక్రమం మొదలుపెట్టాం.
- ఇప్పటికే అన్యాక్రాంతమైన వాటిలో 580 ఎకరాల భూమిని మన ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వాధీనం చేసుకుని వక్ఫ్‌కు తిరిగి ఇచ్చాం. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం అన్ని వివరాలను డిజిటలైజేషన్ చేస్తున్నాం. ఇప్పటివరకు 3,772 ఆస్తులకు సంబంధించి డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే పూర్తి చేసి, వాటిని కంచె వేసి రక్షించే కార్యక్రమం చేస్తున్నాం. ఈ ప్రభుత్వం మీది అన్న సంగతి గుర్తుపెట్టుకోండి.

గుంటూరు భూగర్భ డ్రైనేజీ కోసం రూ.287 కోట్లు

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా అడిగిన విధంగా గుంటూరు భూగర్భ డ్రైనేజీ కోసం రూ.287 కోట్లు ఇప్పటికే మంజూరు చేశాం. అరండల్‌పేట శంకర్ విలాస్ సెంటర్‌లో ఆర్వోబీ నిర్మాణం రూ.131 కోట్లతో త్వరలోనే ప్రారంభం అవుతుంది. గుంటూరు వెస్ట్‌లో ముస్లిం కౌన్సెలింగ్ హాల్ కమ్ లైబ్రరీ సెంటర్ కూడా మంజూరు చేస్తున్నా.

ముస్లిం ప్రముఖులకు అవార్డుల ప్రదానం

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ పురస్కారాన్ని అనంతపురానికి చెందిన ప్రొఫెసర్ కె ముజఫర్ ఆలీకి సీఎం వైఎస్ జగన్ అందజేశారు. కర్నూలుకు చెందిన సయ్యద్ అరిఫుల్లా బాషా కాద్రీకి డాక్టర్ అబ్దుల్ హక్ రాష్ట్రీయ పురస్కారం, రూ.లక్ష నగదు బహుమతిని అందించారు. హజ్రత్ షా కమాల్ పురస్కారాన్ని కడపకు చెందిన అఫ్సర్ డెక్కానికి, అల్లమల యాసీర్ కుములిన్ పురస్కారాన్ని అన్నమయ్య జిల్లాకు చెందిన షేక్ మహమ్మద్ హషీమ్‌కు, సలామన్ అతార్ జావీద్ అవార్డును కర్నూలుకు చెందిన డాక్టర్ మహమ్మద్ సిద్దీఖీకి, దుర్వేష్ కాద్రీ జాకి పురస్కారాన్ని అన్నమయ్య జిల్లాకు చెందిన డాక్టర్ పి దావూద్ ఖాన్‌కు, షాఫిల్‌ఫోర్ కాద్రీ అవార్డును కడపకు చెందిన డాక్టర్ సయ్యద్ అమ్జాద్ అలీకి, మిర్జాఫైక్ తుర్కామని అవార్డును గుంటూరుకు చెందిన డాక్టర్ సయ్యద్ మస్తాన్ వలీకి, యూసఫ్ సఫీ అవార్డును చిత్తూరుకు చెందిన డాక్టర్ పి అబ్దుల్ గఫార్‌కు అందజేశారు. వీరికి రూ.25 వేల నగదు కూడా అందజేశారు.

> **2019 నుంచి ముస్లింలకు సువర్ణ అధ్యాయం**
>
> రాష్ట్రంలో 2019 నుంచి మైనార్టీలకు సువర్ణ అధ్యాయం. రాష్ట్రంలో ఇమామ్‌లు, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ భృతిని గత ప్రభుత్వం పక్కనపెడితే, జగన్ ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించడమే కాకుండా పెంచిన గౌరవ భృతిని చెల్లిస్తోంది. ఇది మైనారిటీ వర్గాలకు రాజకీయ సాధికారత కల్పించిన ప్రభుత్వం. రెండో అధికార భాషగా ఉర్దూకు చట్టబద్ధత కల్పించడంతో పాటు అమలుకు చర్యలు చేపట్టాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ముస్లిం మైనారిటీల సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాం.
>
> – అంజాద్‌బాషా, ఉప ముఖ్యమంత్రి

మెడికల్ కళాశాల పైలాన్ ఆవిష్కరణ



పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

గుంటూరు మెడికల్ కళాశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ కళాశాలలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి .ధర్మాన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

'అసైన్డ్ గుట్టు' రట్టుపై బాబు బెంబేలు

సాక్షి, అమరావతి: ఇంటి గుట్టు రట్టు లంకకు చేటు తెచ్చిందని ఆనాడు రావణుడు నేలకొరుగుతూ వాపోయాడు. అమరావతి భూదందా గుట్టు రట్టవడం టీడీపీకి చేటు అంటూ ఇప్పుడు చంద్రబాబు చుర్రుబుర్రులాడుతున్నారు. అమరావతిలో రూ.4,000 కోట్ల అసైన్డ్ భూములు కొల్లగొట్టిన దందా బట్టబయలు కావడంతో సీఐడీ కేసులు నమోదు చేసింది. టీడీపీ నేతలు ఆ భూములు ఎలా కొల్లగొట్టారో కొందరు సాక్షులు సీఐడీకి వివరంగా చెప్పడంతో చంద్రబాబు గొంతులో వెలక్కాయ పడినట్లయింది. టీడీపీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా ఈ కేసులో సాక్షుల వాంగ్మూలం కాపీలు దక్కించుకోవడమే కాకుండా .. వాటి ఆధారంగా సాక్షులను బెదిరిస్తున్నారు.

చంద్రబాబు, నారాయణ ఒత్తిడితోనే అసైన్డ్ జీవో

అమరావతిలో అసైన్డ్ భూములు కొల్లగొట్టిన వచ్చ గద్దల కుట్ర కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు పలువురు ఉన్నతాధికారులు, ఇతర కీలక వ్యక్తులను విచారించారు. టీడీపీ ప్రభుత్వ పెద్దలు, వారి బినామీలు అమరావతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను భయభ్రాంతులకు గురి చేసి అసైన్డ్ భూములు కొల్లగొట్టిన వైనంపై ప్రధానంగా దృష్టిసారించారు. టీడీపీ ప్రభుత్వ పెద్దలు ఏకంగా 964 ఎకరాలను అసైన్డ్ భూముల చట్టానికి విరుద్ధంగా హస్తగతం చేసుకున్నారు. ఆ తరువాత అసైన్డ్ భూములకు కూడా భూసమీకరణ కింద ప్యాకేజీ ప్రకటిస్తూ చంద్రబాబు ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 17న జీవో 41 జారీ చేసింది. దాంతో ఏకంగా రూ. 4 వేల కోట్ల విలువైన 964 ఎకరాలు చంద్రబాబు బినామీలు, అస్మదీయుల గుప్పిట్లోకి చేరాయి. అసైన్డ్ భూములకు ప్యాకేజీ ప్రకటిస్తూ జీవో ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఆనాటి ఉన్నతాధికారులు ఎంతగా చెప్పినా, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ససేమిరా అన్నారు. వారిద్దరి ఒత్తిడితోనే ఉన్నతాధికారులు జీవో 41 జారీ చేశారు. ఇదే విషయాన్ని ఆ ఉన్నతాధికారులు, ఇతర కీలక వ్యక్తులు సీఐడీ దర్యాప్తులో వెల్లడించారు. ఈ మేరకు సెక్షన్ 164 కింద వాంగ్మూలాలు కూడా ఇచ్చారు. దాంతో చంద్రబాబు సాగించిన భూదందా అధికారికంగా బట్టబయలైంది. ఈ కేసు విచారణ న్యాయస్థానంలో కొనసాగుతోంది.

టీడీపీ చేతిలో వాంగ్మూలం కాపీలు.. సాక్షులపై ఒత్తిళ్లు

రోజురోజుకు వ్యవహారం ప్రతికూలంగా మారుతుండటంతో అసైన్డ్ భూముల కేసును నీరుగార్చేందుకు చంద్రబాబు అండ్ కో తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఈ కేసులో సాక్షులను లక్ష్యంగా చేసుకున్నారు. సీఐడీకి సాక్షులు సెక్షన్ 164 కింద ఇచ్చిన వాంగ్మూలం ప్రతులను నిబంధనలకు విరుద్ధంగా సంపాదించారు. వీటిలో సాక్షులు వెల్లడించిన వాస్తవాలతో చంద్రబాబు బ్యాచ్‌కు ముచ్చెమటలు పడుతున్నాయి. దాంతో సాక్షులపై ఒత్తిళ్లు, పరోక్ష బెదిరింపులకు పాల్పడుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. 'మనం మనం' ఒకటి కదా అంటూ బతిమాలుతూనే, బెదిరింపులకూ పాల్పడుతున్నట్లు సమాచారం. తమ వర్గాల ద్వారా వేర్వేరు మార్గాల్లో ఒత్తిళ్లు తీవ్రతరం చేశారు. దాంతో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాము ఇచ్చిన వాంగ్మూలం కాపీలు టీడీపీ చేతుల్లోకి పోవడంతో అసైన్డ్ భూముల కేసులో కీలక సాక్షులు ఆందోళన చెందుతున్నారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ ఎంతకైనా తెగిస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అందుకే ఈ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకురావాలని భావిస్తున్నట్టు సమాచారం.

ఇదీ మన ఘనత

▶ మొదటి పేజీ తరువాయి

ఐటీసీ సంస్థ సుమారు రూ.200 కోట్లతో ఏర్పాటు చేసిన గ్లోబల్ స్పైసెస్ (సుగంధ ద్రవ్యాలు) ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వేలాది మంది రైతులకు మేలు చేసేలా ఈ పరిశ్రమను ఏర్పాటు చేసిన ఐటీసీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'పరిశ్రమలు పెట్టే వాళ్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మూడేళ్లుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సంబంధించి మార్కులు ఇస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ వరుసగా మూడేళ్లుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్ వన్ స్థానం దక్కించుకోవడం గొప్ప మార్పునకు నిదర్శనం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

> రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి ఐటీసీ చైర్మన్ సంజీవ్ పూరి గొప్పగా చెప్పారు. ఆయన నోటి వెంట ఈ మాటలు రావడం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి అధికారికి గొప్ప క్రెడిట్. ఈ మూడేళ్లలో మనందరి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రముఖ పారిశ్రామిక వేత్తలు రాష్ట్రం వైపు చూస్తున్నారు. ఇక్కడ పరిశ్రమలు స్థాపించడానికి అనువైన వాతావరణం ఉందని అడుగులు ముందుకు వేస్తున్నారు. ఇలా వచ్చే వారందరికీ అన్ని విధాలా సహకరిస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్లుగా వరుసగా మొదటి స్థానంలో నిలిచామంటేనే మన చిత్తశుద్ధి ఏమిటో చేతల్లోనే తెలుస్తోంది.
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రెండేళ్లలోనే పూర్తి

- దాదాపు రూ.200 కోట్ల పెట్టుబడితో ఐటీసీ గ్లోబల్ స్పైసెస్ ప్లాంట్ ప్రారంభమవ్వడం ఒక అద్భుత ఘట్టం. ఏటా 20 వేల మెట్రిక్ టన్నుల దాకా ప్రాసెస్ చేసి, ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తారు. మిర్చితోపాటు అల్లం, పసుపు, ధనియాలు, యాలకులు వంటి 15 రకాల సేంద్రియ సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేస్తారు.
- ఈ ప్లాంట్ తొలి దశ పూర్తయింది. రెండో దశ కూడా మరో 15 నెలల్లో పూర్తవుతుందని చెబుతున్నారు. అది కూడా పూర్తయితే.. దేశంలోనే కాదు, ఆసియా ఖండంలోనే అతిపెద్ద సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ ప్లాంట్ మన రాష్ట్రంలోనే ఉంటుందని ఐటీసీ చైర్మన్ సంజీవ్ పూరి చెప్పారు.
- ఈ యూనిట్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 1,500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అన్నిటికన్నా ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఉన్న 14 వేల మంది రైతులకు ఇది ఒక గొప్ప వరం. వీరి ఉత్పత్తులకు గిరాకీ లభిస్తుంది. 2020 నవంబర్‌లో ఈ ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. 2022 నవంబర్.. అంటే కేవలం 24 నెలల్లోనే నిర్మాణం పూర్తి చేశారు. ఇంత వేగంగా అడుగులు పడ్డాయంటే ఇందులో రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఏ మేరకు ఉందో అందరికీ తెలుస్తోంది.

ఒక్క ఫోన్ కాల్ దూరంలో..

- ఐటీసీ సంస్థ ఈ రాష్ట్రంలో ఇంకా మెరుగైన స్థితికి ఎదగాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫు నుంచి అన్ని రకాల మద్దతు ఇచ్చే విషయంలో ఎప్పుడూ వెనుకడుగు ఉండదని యాజమాన్యానికి చెబుతున్నా.
- ఎప్పుడు ఏ సమస్య వచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటుందనే విషయాన్ని సంజీవ్ పూరి మనసులో పెట్టుకోవాలి. మీ కష్టాన్ని మా కష్టంగా భావించి.. సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తాం. ఇది మా మాట. ఇంత మంచి ప్రాజెక్టు ఏర్పాటు చేసినందుకు మీకు మరొక్కసారి ధన్యవాదాలు.

రూ.3,450 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

- రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఇంకా ఎక్కువ రావాలని ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించాం. 26 జిల్లాల్లో రైతులు స్థానికంగా పండించే పంటలన్నింటికీ ఇంకా మెరుగైన ధర రావాలి. వాల్యూ ఎడిషన్ ద్వారా అది సాధ్యమవుతుందని 26 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను రూ.3,450 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.
- తద్వారా ప్రతి జిల్లాలోని రైతులందరికీ మేలు చేయడమే కాకుండా, దాదాపు 33 వేల ఉద్యోగాలు కల్పించగలుగుతాం. ఇందులో ఫేజ్–1కు సంబంధించి రూ.1,250 కోట్ల పెట్టుబడితో 10 యూనిట్ల కోసం డిసెంబర్, జనవరిలో శంకుస్థాపన చేయనున్నాం. మరో రెండు మూడేళ్లలో మొత్తం 26 యూనిట్లు అందుబాటులోకి వస్తాయి. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నలకు ఇవి ఒక పెద్ద వరంగా మారనున్నాయి.

ఈ కార్యక్రమంలో ఐటీసీ చైర్మన్ సంజీవ్‌పూరి, స్పైసెస్ బోర్డు సెక్రటరీ సతియాన్, రాష్ట్ర మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, విడదల రజని, అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, పోతుల సునీత, ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసుమహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకర్‌రావు, కిలారి రోశయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం జగన్ తదితరులు

రైతుల ఉత్పత్తులకు వాల్యూ ఎడిషన్

- ఐటీసీ స్పైసెస్ ప్లాంట్‌కు సంబంధించిన వీళ్ల ప్రొసీజర్ పక్కాగా ఉంటుంది. సరుకు వచ్చిన వెంటనే క్లీనింగ్, గ్రేడింగ్, డీ స్టీమింగ్, గ్రైండింగ్, బ్లెండింగ్, స్టీమ్ స్టెరిలైజేషన్ చేశాక, ప్యాకింగ్ చేస్తారు. ఇలా ప్రాసెసింగ్ పూర్తి చేసుకోవడం వల్ల రైతులు పండించిన పంటకు వాల్యూ ఎడిషన్ తోడవుతుంది.
- ఎక్స్‌పోర్ట్ మార్కెట్‌లో వీటి అమ్మకం కూడా సులభమవుతుందనే ఉద్దేశంతో ఈ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సహకరిస్తున్నాం. ఇటువంటి ప్రాసెసింగ్ యూనిట్లు మన రాష్ట్రంలో రావడం వల్ల మన రైతులకు కచ్చితంగా మేలు జరుగుతుంది. మన రైతుల ఉత్పత్తులకు మెరుగైన రేటు ఇచ్చి, మన రైతులను చేయిపట్టుకుని నడిపించే కార్యక్రమంలో ఐటీసీ ముందడుగు వేస్తోంది.
- ఇటువంటి గొప్ప మార్పులు వ్యవసాయ రంగంలో వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. మన ప్రభుత్వం రాగానే ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల స్థాపనతో ఇందుకు తొలి అడుగు పడింది. రాష్ట్రంలో దాదాపు 10,668 ఆర్బీకేలు ఏర్పాటు చేశాం. ప్రతి ఆర్బీకేలో అగ్రికల్చర్ గ్రాడ్యుయేషన్ చదివిన ఒక అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను నియమించాం. విత్తనం నుంచి విక్రయం వరకు రైతును చేయి పట్టుకుని నడిపించేలా గొప్ప విప్లవం సృష్టించాం.

ప్రతి దశలో అండగా నిలిచిన ప్రభుత్వం

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్.. దేశంలోనే కాదు, ఆసియా ఖండంలోనే నంబర్ వన్. ఈ ప్లాంట్ తొలి దశ పూర్తయింది. రెండో దశ మరో 15 నెలల్లో పూర్తవుతుంది. అది కూడా పూర్తయితే, ఆసియా ఖండంలోనే అతిపెద్ద సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ ప్లాంట్ మన రాష్ట్రంలోనే ఉంటుంది. ఈ ప్లాంట్ ద్వారా 14 వేల మంది రైతులకు మేలు జరుగుతుంది. కేవలం రెండేళ్లలోనే ఈ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్నాం. ఇంత వేగంగా అడుగులు పడటానికి కారణం ప్రతి దశలోనూ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అండగా నిలవడమే.

– సంజీవ్‌పూరి, ఐటీసీ చైర్మన్

ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శవంతమైన పాలన

మా చిలకలూరిపేట నియోజకవర్గంలో ఈ యూనిట్‌ను ప్రారంభించడం శుభ పరిణామం. ఇందులో స్థానికులకు.. ప్రత్యేకించి 70% మహిళలకు అవకాశం ఇవ్వడం విశేషం. ఈ ప్రాంతానికి స్పైసెస్ పార్క్ రావడానికి కేంద్రాన్ని ఒప్పించి, సాధించిన ఘనత దివంగత నేత వైఎస్సార్‌దే. ఆయన అడుగుజాడల్లోనే జగనన్న రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది ముందుకు వస్తుండటం శుభ పరిణామం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి కావాల్సింది 40 ఏళ్ల అనుభవం కాదు. మంచి మనసు, పట్టుదల. ఇవి మా సీఎంకి పుష్కలంగా ఉన్నాయి. ఆయన ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారు.– విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

జీవన ప్రమాణాలపై 14 నుంచి ఇంటింటా సర్వే

సాక్షి, అమరావతి: ప్రజల జీవన ప్రమాణాలను గుర్తించి మౌలిక వసతుల కల్పించే లక్ష్యంతో ఈ నెల 14 నుంచి 18 వరకు ఐదు రోజులపాటు ఇంటింటా సర్వే నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 8 కీలక అంశాలపై ఐక్యరాజ్యసమితి సూచించిన అభివృద్ధి సూచికల ప్రమాణాల ప్రకారం రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాలను అంచనా వేసేందుకు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లనున్నారు. 10నుంచి 19 సంవత్సరాల మధ్య కౌమార దశలో ఉన్న మహిళలు, బాలికలలో రక్తహీనత గుర్తింపు, గర్భిణుల్లో రక్తహీనత గుర్తింపు, ఐదేళ్లలోపు వయసు పిల్లల్లో తక్కువ బరువు ఉండే వారి శాతం, అదే వయసు వారిలో ఎదుగుదల తక్కువగా ఉన్న వారిని గుర్తించడం, 1 నుంచి 8వ తరగతి చదవాల్సిన వయసు గల పిల్లలంతా రోజు బడులకు వెళ్తున్నారా, పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఇంటర్, ఇతర ఉన్నత విద్య కోసం కాలేజీలలో చేరుతున్న వారు ఎందరు, ఎక్కడెక్కడ బడుల్లో విద్యార్థుల అవసరాల మేరకు కనీస సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి, బాలికల కోసం పాఠశాలల్లో ప్రత్యేకంగా టాయిలెట్లు అందుబాటులో ఉన్నాయా అనే 8 అంశాలపై వలంటీర్లు ప్రతి ఇంటి నుంచి సమాచారం సేకరిస్తారు.

24 ప్రశ్నలతో ప్రత్యేక యాప్

నాలుగు రకాల వయసు వారి నుంచి వీటికి సంబంధించిన వివరాల సేకరణకు 24 ప్రశ్నలు రూపొందించారు. సర్వే సందర్భంగా ఆయా ప్రశ్నలకు వలంటీర్లు ఒక్కొక్కరి నుంచి వివరాలు సేకరించి, ఆ వివరాలను తమ మొబైల్‌లోని ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకుంటారు.



● తెలంగాణ

గ్రానైట్ కంపెనీల్లో సోదాల్లో రూ.1.08 కోట్లు స్వాధీనం

● ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాల్లోని పలు గ్రానైట్ కంపెనీల కార్యాలయాలు, యజమానుల ఇళ్లలో జరిపిన సోదాల్లో రూ.1.08 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పది సంవత్సరాలకు సంబంధించిన లావాదేవీల రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించింది. సోదాల సందర్భంగా పలు బినామీ బ్యాంకు ఖాతాలను గుర్తించామని ఈడీ అధికారులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్, కరీంనగర్‌లోని శ్వేత గ్రానైట్స్, శ్వేత ఏజెన్సీస్, ఎస్వీజీ ప్రైవేట్ లిమిటెడ్, పీఎస్ఆర్ గ్రానైట్స్, అరవింద్ గ్రానైట్స్, గిరిరాజ్ షిప్పింగ్ ఏజెన్సీతో పాటు వాటి అనుబంధ సంస్థల్లో సోదాలు నిర్వహించగా.. రాష్ట్ర విజిలెన్స్ శాఖ నివేదిక ప్రకారం ఈ గ్రానైట్ కంపెనీలు చేసిన ఎగుమతులకు, చెల్లించిన రాయల్టీకి మధ్య భారీగా తేడాలున్నాయని, దీని ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఈడీ అధికారులు వివరించారు. కరీంనగర్ నుంచి విశాఖ, కాకినాడ మీదుగా ఓడరేవుల ద్వారా చైనా, హాంకాంగ్‌లకు భారీగా ఎగుమతులు చేశారని.. కానీ రికార్డుల్లో మాత్రం తక్కువ మొత్తం చూపించినట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులతో పాటు, రాయల్టీ నుంచి తప్పించుకున్నారని పేర్కొన్నారు. చైనాకు ఎగుమతి చేయగా వచ్చిన నగదును గ్రానైట్ కంపెనీల యజమానులు తమ ఉద్యోగుల పేరు మీద బినామీ ఖాతాల్లో జమ చేయించారని ఈడీ అధికారులు వెల్లడించారు. ఇలా బ్యాంకు ఖాతాల్లోకి వచ్చిన డబ్బును రుణంగా తీసుకున్నట్టు చెబుతున్న యజమానులు, దానికి సంబంధించిన ధ్రువపత్రాలను చూపించలేకపోయినట్టు అధికారులు తెలిపారు.





ద్వేషం, క్రోధం, దురాశ అనేవి
స్వయం విధ్వంసక నరకానికి మూడు ద్వారాలు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, నవంబర్, 12

'సుప్రీం' నిర్ణయం సబబే

రాజీవ్‌గాంధీ హత్య కేసులో శిక్షపడి మూడు దశాబ్దాలుగా జైళ్లలో మగ్గుతున్న ఆరుగురు దోషులను విడుదల చేయాలన్న సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఆహ్వానించదగ్గది. సుదీర్ఘకాలం శిక్ష అను భవించటంతోపాటు వారి సత్ప్రవర్తన అంశం కూడా సుప్రీంకోర్టు నిర్ణయాన్ని ప్రభావితం చేసింది. రాజీవ్‌గాంధీ హత్య జరిగిన 1991 మే 21 మొదలుకొని చాలా తరచుగా ఈ కేసు జనం నోళ్లలో నానుతూనే ఉంది. ఈ ఉదంతంలో రాజీవ్‌తోపాటు ఒక ఎస్పీ స్థాయి అధికారి సహా 15 మంది మరణించారు. 1984లో ప్రధానిగా ఉంటూ ఖలిస్తాన్ ఉగ్రవాదుల తుపాకి గుళ్లకు ఇందిరాగాంధీ బలైతే, ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ సైతం మరో ఏడేళ్లకు ఎల్‌టీటీఈ మిలిటెంట్లు చేసిన అదే మాదిరి మతిమాలిన చర్యకు ప్రాణాలు కోల్పోయిన తీరు దేశ ప్రజానీకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దాదాపు 90వ దశకం అంతా రాజీవ్ హత్య కేసు దర్యాప్తు, విచారణ సాగుతూనే ఉన్నాయి. సీబీఐ ఈ కేసులో దర్యాప్తు జరిపి 41 మందిని నిందితులుగా చూపగా, టాడా కోర్టు అందులో 26 మందిని దోషులుగా నిర్ధారించి మరణశిక్ష విధించింది. తదుపరి సుప్రీంకోర్టు వారిలో 19 మందిని నిర్దోషులుగా తేల్చి విడుదల చేసింది. ముగ్గురి మరణశిక్షను యావజ్జీవ శిక్షలుగా మార్చింది. నలుగురు దోషులు–మురుగన్, శంతన్, పేరరివాళన్, నళినిలకు మరణశిక్ష ఖరారు చేసింది. ఇక అప్పటినుంచి ఈ వ్యవహారం అనేక మలుపులు తిరుగుతూ వచ్చింది. ఇందులో తమిళనాడు రాజకీయాలు కూడా కలగలిశాయి. చివరకు 2000 సంవత్సరంలో సోనియాగాంధీ స్వయంగా తమిళనాడు గవర్నర్‌కు లేఖరాసి మరణశిక్ష పడిన నళినికి క్షమాభిక్ష పెట్టాలని కోరారు. దాంతో ఆమెకు ఉరికంబం బెడద తొలగింది. అప్పటినుంచి ఆమె యావజ్జీవ ఖైదీగా ఉంటున్నారు. తమ తండ్రి హంతకులను క్షమించామని ప్రియాంక, రాహుల్ కూడా వేర్వేరు సందర్భాల్లో చెప్పారు. మరో పద్నాలుగేళ్లకు ఉరిశిక్ష అమలులో జాప్యం జరిగిందన్న కారణంతో మురుగన్, శంతన్, పేరరివాళన్‌ల ఉరిశిక్షలను సర్వోన్నత న్యాయస్థానమే యావజ్జీవ శిక్షలుగా మార్చింది.

నిర్ణయ రాహిత్యంగా నిర్ధారించాలో లేక రాజకీయ అయోమయంగా పరిగణించాలో... ఆ తర్వాత కాలమంతా రాజీవ్ హంతకుల విషయంలో డోలాయమాన స్థితి ఏర్పడింది. సర్వోన్నత న్యాయస్థానం తేల్చాక కూడా దోషులకు శిక్షలు అమలు చేయకపోవటం గమనిస్తే తమిళనాడు రాజకీయాలను ఈ వ్యవహారం ఎంతగా ప్రభావితం చేసిందో గ్రహించవచ్చు. డీఎంకే, అన్నాడీఎంకే సహా ప్రధాన ద్రవిడ పార్టీలన్నీ రాజీవ్ కేసు దోషులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నా వారితో కలిసి కూటమి కట్టడానికి అభ్యంతరం లేని కాంగ్రెస్‌కు ఇప్పుడు మాత్రం సుప్రీంకోర్టు నిర్ణయం 'తీవ్ర బాధాకరం, దురదృష్టకరం' ఎందుకైందో అర్థం కాదు. పైగా ఇది కేవలం కాంగ్రెస్ అభిప్రాయం తప్ప సోనియా ఉద్దేశం కాదట. ఈ ప్రకటన విడుదల చేసిన పార్టీ నేత జైరాం రమేశ్ సుప్రీంకోర్టు తాజా నిర్ణయాన్ని 'తీవ్ర తప్పిదం'గా విమర్శించారు. మరి యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు ఆ దోషులకు అమలు చేయాల్సిన శిక్ష గురించి ఎందుకు ఆలోచించలేక పోయారు? మరణశిక్ష విధించటం అనాగరికమని చాలా దేశాలు ఆ శిక్షలను రద్దు చేశాయి. మన దేశం సైతం ఆ మాదిరి నిర్ణయమే తీసుకోవాలని కోరుకుంటున్న ప్రజాస్వామికవాదులున్నారు. దాన్నెవరూ తప్పు బట్టరు. పార్లమెంటుపై దాడి కేసులో ఉరిశిక్ష పడిన అఫ్జల్ గురును అతని కుటుంబానికి ముందస్తుగా తెలియజేయాలన్న నిబంధనను సైతం కాలదన్ని యూపీఏ సర్కారు ఉరి అమలు చేసిన సంగతి జైరాం రమేశ్ మరిచిపోకూడదు. రాజకీయ లబ్ధి కోసం తాము ఇష్టానుసారం ఏమైనా చేయొచ్చుగానీ సుప్రీంకోర్టు మాత్రం నిర్ణయాత్మకంగా వ్యవహరించరాదనటం అర్థరహితం.

దోషుల పిటిషన్లను విచారిస్తున్న సందర్భాల్లో మీ అభిప్రాయమేమిటని సుప్రీంకోర్టు పలు మార్లు కేంద్రాన్ని అడిగింది. యూపీఏ హయాంలోనూ, ప్రస్తుత ఎన్‌డీఏ హయాంలోనూ కేంద్రం ఒకే మాదిరి వ్యవహరించింది. 2018లో అన్నా డీఎంకే ప్రభుత్వ కేబినెట్ రాజీవ్ కేసు దోషులందరినీ విడుదల చేయాలని గవర్నర్‌కు సిఫార్సు చేస్తూ తీర్మానించింది. ఆయన ఆ తీర్మానాన్ని రాష్ట్రపతికి పంపారు. ఆ విషయంలో తుది నిర్ణయం రాష్ట్రపతిదేనని నిరుడు ఫిబ్రవరిలో కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. 'అసలు మీరు ఏ నిబంధన ప్రకారం రాష్ట్రపతికి పంపార'ని గవర్నర్‌ను కోరితే ఆయన నుంచి మౌనమే సమాధానమైంది. శిక్షల తగ్గింపులో తమదే తుదినిర్ణయమంటూ కేంద్రం చేసిన వాదన సరికాదనీ, నిబంధనలు నిర్దిష్టంగా ఉన్న సందర్భాల్లో తప్ప రాష్ట్రాలకు కూడా ఆ విషయంలో సమానాధికారాలున్నాయనీ సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. చివరికి అటు రాష్ట్రపతి, ఇటు గవర్నర్ ఏ నిర్ణయమూ ప్రకటించని పరిస్థితుల్లో దోషులు దీర్ఘకాలం శిక్ష అనుభవించిన సంగతిని, వారి సత్ప్రవర్తనను పరిగణనలోకి తీసుకుని విడుదల చేసింది. తెలిసిచేసినా, తెలియకచేసినా నేరం చేసినవారు శిక్ష అనుభవించాల్సిందే. కానీ అందుకు కొన్ని నిబంధనలుంటాయి. శిక్ష ఉద్దేశం నేరగాళ్లను సంస్కరించటమే తప్ప వారిపై ప్రతీకారం తీర్చుకోవటం కాదు. రాజీవ్ విషయంలో దోషులను పట్టుకోవటం, శిక్షించటం అయింది. మరి ఇందిర హత్యానంతర మారణకాండలో సిక్కుల ఊచకోత దోషులను ఇంతవరకూ ప్రభుత్వాలు ఎందుకు శిక్షించలేకపోయాయి? న్యాయం సమానంగా ఉండటమే కాదు, అలా ఉన్నట్టు కనబడాలి కూడా. ఆ పరిస్థితి లేనప్పుడు సుప్రీంకోర్టు న్యాయబద్ధంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవటం తప్పెలా అవుతుంది?

ఆహార స్వావలంబన విధాన దిశగా...

విశ్లేషణ



దేవీందర్ శర్మ

గత యాభై ఏళ్లలో వన్యప్రాణుల జనాభా సగానికి సగం నశించింది. ఇది పర్యావరణ ప్రళయమని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లు వాతావరణ సంక్షోభం, జీవవైవిధ్య వినాశనం అని 'డబ్ల్యూడబ్ల్యూఎఫ్' నివేదిక చెబుతోంది. ఇవి మరింత ముదరడానికి ప్రపంచ ఆహార వ్యవస్థే కారణమని కూడా సూచిస్తోంది. దీన్ని బలపరిచే సాక్ష్యం, కుబేరుల జాబితాలోకి ఆహార రంగ వ్యాపారవేత్తలు చేరడం! విరోధాభాస ఏమిటంటే, ఈ సంక్షోభాలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత పరిష్కారాలను బడా కంపెనీలు సూచిస్తుండటం! ఆహార భద్రత రైతుల చేతుల్లోంచి ఆహార కంపెనీల బోర్డు రూముల్లో కూర్చునేవారి చేతుల్లోకి మారిపోతోంది. ఈ విపరిణామాలు సంభవించకూడదంటే ఆహార వ్యవస్థ సమూలంగా మారాలి.

కొన్నేళ్ల క్రితం నాటి మాట. జర్మనీలోని ఓ నేచర్ రిజర్వ్‌పై ససెక్స్ యూనివర్శిటీ (యూకే) ఓ అధ్యయనం నిర్వహించింది. దాని ప్రకారం, ఆ ప్రాంతంలోని క్రిమికీటక సంతతి గణనీయంగా పడిపోయింది. ఎంతగా అంటే... పాతికేళ్ల కాలంలో ఎగిరే కీటకాలు 75 శాతం వరకూ లేకుండా పోయాయి. ఈ పరిణామం 'పర్యావరణ ప్రళయం' లాంటిదని శాస్త్రవేత్తలు అభివర్ణించారు. ఈ ఫలితాలకు ఆశ్చర్యపోయిన కొందరు శాస్త్రవేత్తలు కొంచెం ఎక్కువ చేసి చెప్పి ఉంటారని వ్యాఖ్యానించడమే కాకుండా... ఒకవేళ అదే నిజమైతే జీవవైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని గుర్తు చేసే మేలుకొలుపు అవుతుందని కూడా వ్యాఖ్యా నించారు.



ఐదేళ్ల తరువాత... 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) విడుదల చేసిన 'లివింగ్ ప్లానెట్ రిపోర్ట్–2022' కూడా ఇలాంటి బాంబే వేసింది. యాభై ఏళ్ల కాలంలో (1970–2018) వన్యప్రాణుల జనాభాలో దాదాపు సగం నశించిపోయిందని 32 వేల జీవజాతులను విశ్లేషించిన లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ తెలిపింది. లాటిన్ అమెరికా ప్రాంతంలో అత్యధికంగా 94 శాతం జనాభా నశించి పోయింది. మంచినీటిలో బతికే వాటిల్లో 80 శాతం వాటికి నష్టం జరిగింది. ఈ నివేదికలోని ఇతర ఆందోళనకరమైన అంశాలను కాసేపు పక్కనబెడితే భూమి 'ఆరవ మహా వినాశనం' ముంగిట్లో ఉందన్న విషయం చాలాకాలంగా తెలుసు. అందుకే ఇది జీవజాతి వినాశనమనీ, మానవ నాగరకతల పునాదులపై జరుగుతున్న దాడి అనీ యూఎస్ నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్ పేర్కొనడం అతిశయోక్తి ఏమీ కాదు.

నిజానికి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నివేదిక సమాజానికి ఒక షాక్ లాంటిది. కానీ చదువుకున్నవారి చాలామంది మనఃస్థితిని బట్టి చూస్తే, ఈ నివేదిక వారిని ఇసుమంత కూడా కదిలించినట్లు కనపడదు. వీరు చెట్లను అభివృద్ధి నిరోధకాలుగా చూస్తుంటారు. రహదారులు, గనులు, పరిశ్రమల కోసం పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించడం, లేదా కావాల్సినట్టుగా మార్చుకోవడం ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు. పామాయిల్ పంటల కోసం విశాలమైన అటవీ భూములను చదును చూస్తుండటం ఈ ధోరణినే సూచిస్తుంది. అలాగే పచ్చటి అడవులను పప్పుబెల్లాల మాదిరిగా పరాయివారికి పంచేస్తూండటం చూస్తుంటేనే తెలుస్తుంది పర్యావరణానికి మనం ఏమాత్రం మర్యాద ఇస్తున్నామో!

ఏటా కోటి హెక్టార్ల నష్టం...

ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా మనం సుమారు కోటి హెక్టార్ల అటవీ భూమిని కోల్పోతున్నాం. కానీ 'సీఓపీ' చర్చల్లో దీనికి హద్దులు వేయాలన్న అంశంపై ఒక్క తీర్మానమూ జరగదు. ప్రపంచం ఎదుర్కొంటున్న రెండు అతిపెద్ద సవాళ్లు వాతావరణ సంక్షోభం, జీవ వైవిధ్య వినాశనం అని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నివేదిక స్పష్టం చేస్తోంది. ఒకదానితో ఒకటి సంబంధం ఉన్న ఈ రెండు అంశాలు మరింత ముదిరేందుకు ప్రపంచ ఆహార వ్యవస్థ కారణమని కూడా సూచిస్తోంది. ఈ హెచ్చరిక ఉన్నా, వ్యవసాయ రంగంలో మార్పులన్నీ వ్యవసాయం పెద్ద ఎత్తున సాగాలన్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సూచించిన విధంగా మాత్రమే మారుతున్నాయి.

'ద యాక్షన్ గ్రూప్ ఆన్ ఎరోషన్, టెక్నాలజీ అండ్ కాన్సంట్రేషన్ (ఈటీసీ) వంటి అంతర్జాతీయ సంస్థ తయారు చేసిన ఇంకో నివేదిక కూడా ఆహార వ్యవస్థ బిగ్ ఫుడ్, బిగ్ టెక్, బిగ్ ఫైనాన్స్‌లకు చెందిన కంపెనీల చేతుల్లోకి జారిపోతోందని విస్పష్టంగా తెలిపింది. దీనివల్ల రైతులు, జాలర్ల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉంది. నేలను విషతుల్యం చేయడం, నీళ్లను విపరీతంగా వాడేయడం, పర్యావరణాన్ని కలుషితం చేయడం, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడం... ఈ క్రమంలో లాభాలు ఆర్జించడమే ఈ బడా కంపెనీల లక్ష్యంగా కనిపిస్తోంది. కరోనా మహమ్మారి కబళించిన రెండేళ్లలోనే అత్యంత కుబేరుల జాబితాలోకి 62 మంది 'ఆహార కోటీశ్వరులు' చేరారు. ఈ కాలావధిలోనే ప్రపంచంలోనే అతిపెద్ద ట్రేడింగ్ కంపెనీ 'కార్గిల్' లాభాల వాటాలో 64 శాతం వృద్ధి నమోదైంది. కొన్ని ఇతర ఫుడ్ కంపెనీలు కూడా విపరీతంగా లాభపడ్డాయి. ఈ రెండు నివేదికలూ మన వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో బోధనాంశాలుగా ఉంచాలి. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నివేదిక చెప్పే విషయానికి వ్యవయాయ రంగంలో జరుగుతున్న వ్యవహారాలు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయి. పలు ఉదాహరణలతో ఇచ్చిన ఈటీసీ నివేదిక... వ్యవసాయం డిజిటలైజ్ అయితే బోలెడంత సమాచారం సేకరించవచ్చుననీ, ఈ సమాచారం కాస్తా మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి పెద్ద కంపెనీల క్లౌడ్ సర్వర్లలోకి చేరిపోయి కొత్తకొత్త బిజినెస్ వ్యూహాల రూప కల్పనకు సిద్ధంగా ఉంటుందనీ చెబుతుంది.

ఈ నివేదికను కొంచెం నిశితంగా పరిశీలిస్తే ఇదెలా జరుగుతోందో అర్థమవుతుంది. వాతావరణ మార్పులు, జీవవైవిధ్యంలో తరుగుదల అంశాలను చూపి బడా కంపెనీలు వాటికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత పరిష్కారాలు సూచిస్తాయి. జన్యుమార్పిడి పంటలు, హైటెక్ విత్తనాల్లాంటివన్నమాట. డిజిటల్ వ్యవసాయం వల్ల లాభాలంటూ ఊదరగొడతాయి. ఇదే క్రమంలో జీవ వైవిధ్య వనరుల పరిరక్షణ పేరు చెప్పి, కృత్రిమ ఆహారాన్ని మన ముందుంచుతాయి.

రైతులు, రైతు కూలీలు కనుమరుగు...


డిజిటల్ టెక్నాలజీల వల్ల వ్యవసాయ సామర్థ్యం పెరుగుతుందను కునేరు! డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పేరుతో ఇప్పుడున్న ఆహార వ్యవస్థ విధ్వంసం మాత్రమే జరుగనుంది. బడా కంపెనీలవన్నీ తప్పుడు పరిష్కారాలని ఈ నివేదిక ద్వారానే స్పష్టమవుతుంది. డ్రోన్లు, సెన్సర్లు, ఉపగ్రహ సమాచారం, కృత్రిమ మేధల వల్ల... రైతులు, రైతు కూలీలు క్రమేపీ మరుగున పడిపోతారు. డ్రైవర్ల అవసరం లేని ట్రాక్టర్లు, యంత్రీకరణకు అనువైన పొలాలతో బడా టెక్ కంపెనీలు బడా ఆర్థిక సంస్థల సాయంతో రైతులకు అవసరమే లేని కొత్త ప్రపంచాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయి. భవిష్యత్తులో ఆహార భద్రత అనేది రైతుల చేతుల్లోంచి ఆహార కంపెనీల బోర్డు రూముల్లో కూర్చునే కొందరి చేతుల్లోకి మారిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా విత్తనాల విక్రయాల్లో 40 శాతాన్ని కేవలం రెండు కంపెనీలు నియంత్రి స్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ కంపెనీలు పరోక్షంగా ఆహార సరఫరా వ్యవస్థ మొత్తాన్ని నియంత్రిస్తున్నట్లే లెక్క. ఏం పండించాలి, ఎప్పుడు పండించాలి వంటి అంశాలనూ బడా కంపెనీలే నిర్ణయించే పరిస్థితి వస్తుంది. అంతేకాదు... ఆహార కంపెనీల సహకారంతో చివరకు పంటల కోతలు ఎలా జరగాలి, మనం ఏం తినాలన్నది కూడా నిర్ణయిస్తాయి. ఈ విపరిణామాలన్నీ సంభవించకుండా ఉండాలంటే ప్రపంచ స్థాయిలో ఆహార వ్యవస్థ సమూలంగా మారాల్సి ఉంటుంది. సరికొత్త ఆహార వ్యవస్థకు మారడం కూడా వైవిధ్యత, ఆహార సార్వభౌమత్వం అంశాల ఆధారంగా సాగాలి. అంతేకాదు... ఇది 360 కోట్ల రైతులు, రైతుకూలీలు, మత్స్యకారుల ఆధ్వర్యంలో జరగాల్సిన మార్పు. జీవ వైవిధ్య పరిరక్షణ, కనీస ఆదాయానికి భరోసా, వాతావరణ పరంగా వీరికి న్యాయం జరగడం అప్పుడే సాధ్యమవుతుంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదీ విశిష్టత



అబ్రహామిక్ మతాలకు భిన్నంగా, హిందూయిజం ఏ ఒక్క వ్యక్తి మీదనో, ఏ ఒక్క పుస్తకం మీదనో ఆధారపడదు. దాని క్రమము, సాధికారత ఏదో ఒక పుస్తకం నుంచి కాకుండా, వందలాది పుస్తకాలు, వేలాది గురువులు, యోగులు, ఆచార్యులు, రుషుల నుంచి ప్రవహిస్తుంది. మానవ చరిత్రలో దానికి సమానమైనది లేదు.

– ప్యాట్రిక్ బ్రాక్‌మాన్, ఆంట్రప్రెన్యూర్

ఏం ఆపుతోంది?



ఆర్థికంగా బలహీన వర్గాల రిజర్వేషన్లకు సంబంధించిన తీర్పును ఆమోదించడం, లేక దాని మీద నేరపూరిత మౌనం పాటించడం ద్వారా ఎస్పీ, బీఎస్పీ, జేడీయూ, ఆర్జేడీ లాంటి బహుజన పార్టీలు నిమ్న కులాలకు ప్రాతినిధ్యం వహించే నైతిక హక్కును కోల్పోయాయి.

– ఖాలిద్ అనీస్ అన్సారీ, సోషియాలజీ ప్రొఫెసర్

దానికీ వేదికే!



జనాలు ట్విట్టర్ గురించి ట్విట్టర్‌లోనే ఫిర్యాదు చేయడం నాకు నచ్చుతుంది.

– ఎలాన్ మస్క్, ట్విట్టర్ అధినేత

తమదాకా వస్తే...



రిజర్వేషన్లను వ్యతిరేకించే వాళ్లు ఉన్నట్టుండి రిజర్వేషన్లను సమర్థించేవాళ్లు అయిపోయారు.

– సూరజ్ యెంగ్డే, దళిత్ యాక్టివిస్ట్

మనదే పైచేయి



మన క్రికెట్ జట్టు వల్ల వరుసగా నిరాశ పడుతున్నారా? అయితే చదరంగం వైపు చూడండి. అక్కడ పాకిస్తాన్ మనల్ని సవాల్ చేయలేదు.

– సాహిల్ టిక్కూ, చెస్ కామెంటేటర్

ప్లాన్ ఉందా?



65 కోట్ల మంది భారతీయులు 25 ఏళ్లలోపు వయసువారు! ఈ యువతను, చైతన్యశక్తిని ఇండియా కార్యాచరణలోకి తెచ్చుకోగలదా?

– హేమీమాన్ జాకబ్, ప్రొఫెసర్

ఈ పిట్ట ఏ రాగం పాడేను?

విశ్లేషణ



అనింద్యో చక్రవర్తి

ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనికుడే కాదు; ఒళ్లంతా అహం, అందుకుతగ్గ నోటి దురుసు ఉన్నవాడు. ఇంకో వైపు ట్విట్టర్ రాజకీయంగా తీవ్ర ప్రభావం చూపగల వేదిక! ఈ విషయంపై కొందరికి అభ్యంత రాలు ఉండవచ్చు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, టిక్‌టాక్‌లతో పోలిస్తే ట్విట్టర్ చాలా చిన్నదని వీరు చెప్పవచ్చు. కానీ, వీటితో పోలిస్తే ట్విట్టర్ ఉనికి, ఉద్దేశం పూర్తిగా వేరు. మిగిలిన సామాజిక మాధ్య మాలు జీవన శైలి అంశాల చుట్టూ తిరుగుతూంటే, ట్విట్టర్‌లో రాజకీ యాలు ఎక్కువగా ఉంటాయి. అస్తిత్వం, సిద్ధాంతాలకూ చోటు చెప్పు కోదగ్గదే. పైగా చాలా సందర్భాల్లో ట్విట్టర్ విద్వేషానికి వేదిక అవుతూంటుంది కూడా. అందుకే అందరినీ రెచ్చగొట్టేలా మాట్లాడే మస్క్‌లాంటి వారి చేతుల్లో ట్విట్టర్ చేరడం ప్రమాదకర మవుతుంది.

ఫాలోవర్లు ఎక్కువే!

ట్విట్టర్‌లో ఎలాన్ మస్క్‌కు ఉన్న ప్రాచుర్యమూ తక్కువేమీ కాదు. ఈయనకు ఏకంగా 11.5 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా (13.3 కోట్లు) తరువాత ఇంతమంది ఫాలోవర్లు ఉన్నది ఈయనకే. అయితే అందరి దృష్టిని ఆకర్షించే విషయంలో, ట్విట్టర్‌ను వాడుకునే విషయంలో మస్క్‌కు తిరుగులేదు. ఈ కథనం రాసే సమయానికి ఒబామా చేసిన పది ట్వీట్లకు సగటున 25 వేల లైక్‌లు వస్తే, మస్క్‌కు ఏకంగా 5.27 లక్షల లైకులు వచ్చాయి. పైగా మస్క్ ట్వీట్లకు స్పందించేవారు అతడి దూకుడుతత్వాన్ని, స్వేచ్ఛాయుత రాజకీయ ఆలోచనలను మెచ్చుకునేవారు కావడం గమనార్హం. 'భావ ప్రకటన స్వేచ్ఛ'కు మస్క్ ఎంత గట్టి మద్దతుదారు అంటే... అతడి పిన్డ్ ట్వీట్ (నిత్యం పేజీ పైభాగంలో కని పించేది) లోనూ 'భావ ప్రకటన స్వేచ్ఛ' లేదా 'రాజకీయంగా సరిగ్గా ఉండటం' (పొలిటికల్ కరెక్ట్‌నెస్) మధ్య ప్రకటనకర్తలు దేనికి ఓటేస్తా రని అడుగుతుంది. భావ ప్రకటన స్వేచ్ఛకు 27.5 లక్షల మంది జై అన్నారు. పోలైన ఓట్లలో ఇది 78 శాతం వరకూ ఉండటం గమనార్హం.

ప్రజాస్వామ్యానికి మేలే...నా?

మస్క్ వైఖరి, ట్విట్టర్‌లో అతడి వైఖరులను బట్టి చూస్తే ప్రజా స్వామ్యానికి మేలే జరుగు తుందని అనిపించవచ్చు. కానీ కొన్ని విషయాలను నిశితంగా పరిశీలించాలి. మస్క్ భావ ప్రకటన స్వేచ్ఛకు వ్యతిరేక అర్థం ధ్వనించేదిగా 'రాజకీయంగా సరిగ్గా' ఉండటాన్ని చూపించారు. ఇంకోలా చూస్తే ద్వేషపూరితమైన మాటలనూ భావ ప్రకటన స్వేచ్ఛలోకి చేర్చాడని చెప్పాలి. మస్క్ కొనుగోలు చేసిన గంటల్లోపు ట్విట్టర్‌లో బోలెడన్ని గుర్తుతెలియని ఖాతాల నుంచి నాజీ, జాతి వివక్ష పూరిత మీమ్‌లు మళ్లీ దర్శనమివ్వడం ఇందుకు నిద ర్శనం. మస్క్ చేతుల్లో ట్విట్టర్ ఎందుకు ప్రమాదకారో అర్థం చేసుకునేందుకు గత నాలుగు దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిణామాలనూ అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

1980ల నుంచి ఒకరకమైన ద్వైదీభావం సమాజంలో పెచ్చరిల్లింది. ఆర్థిక విధానాల విషయంలో నియో లిబరల్ ఆర్థడాక్సీ, సామాజిక అంశాల్లో లిబరల్ ప్లూరలిజమ్ పెత్తనం చలాయించాయి. అంతకు ముందు ఈ రకమైన మేళవింపును అస్సలు ఊహించలేము. ఎందుకంటే అప్పట్లో సామాజిక సమానత్వం, వామపక్ష రాజకీయాలు కలిసికట్టుగా పనిచేసేవి. ఒకదశలో ప్రజలు తాము సామాజిక అంశాల విషయంలో వామపక్షవాదులమనీ, ఆర్థిక విధానలకు వచ్చేసరికి మిత వాదులమనీ చెప్పుకోవడం సర్వ సాధారణమై పోయింది.



గత నాలుగు దశాబ్దాల్లో సమాజంలో ఒక కొత్త ఉన్నతస్థాయి వర్గ సృష్టి జరిగింది. ఈ వర్గానికి ప్రాతినిధ్యం వహించేవారు బయటకు స్వేచ్ఛా రాజకీయాలకు మద్దతిస్తున్నట్లు కనిపిస్తూనే, మార్కెట్ శాసించే విధానాల ఫలాలు అందుకునేవారు! ఈ నాలుగు దశాబ్దాల్లోనే ప్రపంచవ్యాప్తంగా అసమానతలు, నిరుద్యోగిత పెరగడం గమనార్హం. రెండో ప్రపంచ యుద్ధం తరువాతి కాలంలో ప్రపంచవ్యాప్తంగా మానవ జీవన ప్రమాణాల్లో కనిపించిన వృద్ధి ఇటీవలి కాలంలో దాదాపు స్తంభించిపోయింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది మరీ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆర్థికంగా లేదా సామాజికంగా ఎదిగేం దుకు తగిన అవకాశాలు లేనందున అమెరికాలో ఓ తెల్లవాడు, భారత్‌లో అగ్రవర్ణ పురుషుడు... తమకు అన్యాయం జరిగిందనుకోవడం న్యాయమే అనుకునే పరిస్థితి ఉంది. కులం, మతం, జాతి, జాతీయ తల ప్రస్తావన వస్తే... వీరు అది తమ సహజమైన హక్కు అనేస్తారు. పురుషుడి ఆధిపత్యం కూడా ప్రకృతిలో సహజమని చెబుతారు.

ద్వేషానికి వేదిక కాగలదు

ఇలాంటివారు సమాజంలో 'ఉన్నత స్థానం'లో ఉన్న వారిని తమ శత్రువులుగా భావించేందుకు ఎక్కువ సమయమేమీ పట్టదు. సమానత్వ రాజకీయాలు 'జనాలను' అణచి వేసేందుకు ఉద్దేశపూర్వకంగా చేసే కుట్ర అని వీరు భావిస్తూంటారు. ఈ రాజకీయాలెప్పుడూ ప్రజాస్వామ్యయుతం కాదు. అణచివేతకు గురైన ప్రజలందరినీ ఒక్కతాటి పైకి తెచ్చే అంశం ఆధారంగా ఉండేవి రాజకీయాలు. శక్తిమంతులు తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఈ సామాన్యులందరికీ వర్తించే ఒక కారణాన్ని చూపేందుకు ప్రయత్నం చేస్తూంటారు. 1930లలో జర్మనీలో జరిగింది ఇదే. యూదులను సంపన్నులు, ఉన్నతవర్గాల వారిగా చూపుతూ వారు జర్మనీ సైనికులకు వెన్నుపోటు పొడిచారనీ, అందుకే మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓడిపోయిందనీ ప్రచారం జరిగింది.

స్వీయ ప్రయోజనాల కోసం...

ఈ కాలంలోనూ అసంతృప్తికి గురైన వర్గాలు ప్రతి దేశంలోనూ ఉన్నాయి. అధికారం, సమృద్ధి తమ సహజసిద్ధమైన హక్కని వీరు భావిస్తూం టారు. వీరు సామాజిక మాధ్యమాల ద్వారా రాజకీయ స్వేచ్ఛ, స్వయంపాలన వంటి భావజాలాన్ని ప్రచారం చేసేవారి పట్ల ఆకర్షితులవుతూంటారు. రాజకీయ సమానత్వం, లింగవివక్ష లేక పోవడం, జాతి, మతాల ఆధారంగా వివక్ష లేకపోవడం వంటి విషయాలకు వీరు వ్యతిరేకం. ఇలాంటి వారందరికీ ట్విట్టర్‌లో మంచి ఆదరణ కనిపిస్తూంటుంది. అసందర్భమైన అభిప్రాయాలను, విభజన వాదాలను ప్రచారం చేసేందుకు వేదికగా ఉపయోగపడుతుందన్న మాట! డబ్బులిచ్చే వారికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఇప్పటికే ఎలాన్ మస్క్ ప్రకటించాడు. నెలకింత రుసుము చెల్లించడం ద్వారా బ్లూటిక్ పొంద వచ్చునని కూడా చెప్పాడు. ఇది తప్పుడు ప్రచారాలు చేసేవారికి మరింత ఉపయోగకారిగా మారనుంది. ట్విట్టర్ వేదికను తమ ప్రయోజనాల కోసం వాడుకునేందుకు అవకాశం కల్పిస్తుంది.

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

ధర్మసూక్ష్మం గ్రహించాలి

'ఇది నీకు న్యాయమా, ధర్మమా?' అని ప్రశ్నించటం వింటాం. ప్రశ్నలోనే రెండు ఒకటి కాదు అని అర్థమవు తోంది కదా! నిత్య వ్యవహారంలో రెండు ఒకటిగానే కనిపి స్తాయి. కానీ, అనుకోకుండా, అప్రయత్నంగా సరిగానే వాడుతాం.

చట్టం చెప్పిన నియమ నిబంధనలను పాటించటం న్యాయం. సమాజం సరైన పద్ధతిలో సాగటానికి ఏర్పాటు చేసిన చట్రం చట్టం. చట్టం తెలివితో లెక్కలు కట్టి సరైన నిర్ణయం చేయగలుగుతుంది. అదే న్యాయం అనబడుతుంది స్థూలంగా. దానికి హృదయంతో పనిలేదు. ప్రేమ, అభిమానం, ఆప్యాయత వంటి ఆర్ద్రభావనలకు తావు లేదు. నిక్కచ్చిగా ఉంటుంది వ్యవహారం. కాఠిన్యం కూడా ఉంటుంది. కొన్ని సందర్భాలలో న్యాయానికీ, ధర్మానికీ మధ్య సమన్వయం కుదరదు. ధర్మాన్ని పాటిస్తే న్యాయానికి విఘాతం కలుగుతుంది. న్యాయాన్ని అమలు పరిస్తే ధర్మ హాని అవుతుంది. వెనక గొయ్యి ముందు నుయ్యి అన్నట్టు ఉంటుంది పరిస్థితి. ఇటువంటి సమయంలో ధర్మసూక్ష్మాన్ని, న్యాయశాస్త్రంలోని లోతుపాతులనూ ఆశ్రయించాలి. దానికి శాస్త్రపరిజ్ఞానంతో పాటు అనుభవం, నైపుణ్యం అవసరం.



చిన్నప్పుడు చదివిన ఒక కథ. ఇద్దరు స్త్రీలు ఒక బిడ్డని తనదంటే తనదని వాదులాడుతూ రాజుగారి దగ్గరకు తీర్పుకి వచ్చారు. రాజు కాస్త ఆలోచించి బిడ్డని సమంగా ముక్కలు చేసి, ఇద్దరూ చెరి సగం తీసుకోమని తీర్పు చెప్పాడు. ఒకామె రాజు సరైన తీర్పు చెప్పాడు అని సంతోషంగా అన్నది. మరొకామె 'ఆ పని మాత్రం వద్దు, నా బిడ్డ ఎక్కడ ఉన్నా సుఖంగా ఉంటే చాలు' అన్నది. రాజు రెండవ స్త్రీని అసలైన తల్లి అని నిర్ధారించి బిడ్డని ఆమెకే అప్పగించి, మొదటి స్త్రీని మందలించాడు. నిజనిర్ధారణ కోసమే అటువంటి తీర్పు ఇచ్చాడు. కానీ, ఎన్నో సందర్భాలలో న్యాయ స్థానాలు ఇచ్చిన తీర్పులు మానవత్వం లేనట్టు, అధర్మమా? అనిపించేట్టు ఉంటాయి. నిశితంగా పరిశీలించకుండా తొందరపడి అటువంటి నిర్ణయాలకి రాకూడదు అని అర్థం చేసుకుంటే చాలు.

– డాక్టర్ ఎస్. అనంతలక్ష్మి

గ్రహం అనుగ్రహం శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.చవితి రా.8.05 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** మృగశిర ఉ.6.27 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ప.3.42 నుండి 5.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.07 నుండి 7.34 వరకు, **అమృతఘడియలు:** రా.9.50 నుండి 11.33 వరకు : **రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం :** ప.1.30 నుండి 3.00 వరకు: **సూర్యోదయం** 6.06 : **సూర్యాస్తమయం** 5.21.

క్లుప్తంగా

రామోజీతో చంద్రబాబు భేటీ

అబ్దుల్లాపూర్‌మెట్(హైదరాబాద్): రామోజీ రావుతో శుక్రవారం సాయంత్రం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీలోని రామోజీ కార్యాలయంలో సుమారు మూడున్నర గంటల పాటు ఇద్దరు భేటీ అయ్యారు. సాయంత్రం నాలుగు గంటలకు ఫిల్మ్‌సిటీలోకి వెళ్లిన చంద్రబాబు 7.30 గంటల తర్వాత బయటకు వచ్చారు.

ఏ పనికీ ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు

పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం సూచన

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు సందర్భంగా కొత్తగా నియమితులైన గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు కూడా డీడీవో అధికారాలు కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు మొదలుపెట్టింది. గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పించే విషయంలో గానీ, పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు, బదిలీల వ్యవహారాల్లో గానీ ఎవరు డబ్బులు వసూలు వేసినా కఠిన క్రమశిక్షణ చర్యలతోపాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పించే విషయంపై కొందరు వ్యక్తులు అసోసియేషన్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్టు కమిషనర్ కార్యాలయం దృష్టికి వచ్చినట్లు ఆ ప్రకటనలో తెలిపింది. ఎటువంటి ప్రతిపాదనల ఆమోదం కోసం పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగులెవరూ ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఎవరైనా డబ్బులు వసూలు చేసినా లేదా డబ్బులు ఇచ్చినా ఆయా వ్యక్తుల పేర్లు తమ కార్యాలయం దృష్టికి తీసుకురావాలని కోరింది.

సమష్టిగా పనిచేస్తే ఉత్తమ ఫలితాలు

గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్



భరత్ గుప్తను సన్మానిస్తున్న గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మిషా, జేఎండీ శివప్రసాద్

సాక్షి, అమరావతి: పేదల ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయడానికి గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేయాలని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను అధిగమించడానికి వీలవుతుందన్నారు. విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణ సంస్థ ఎండీగా పనిచేస్తూ సీఎం సంయుక్త కార్యదర్శిగా బదిలీపై వెళ్లిన డాక్టర్ నారాయణ భరత్ గుప్తాకు అధికారులు, ఉద్యోగులు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అజయ్ జైన్ మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడానికి భరత్ గుప్తా చాలా కృషి చేశారన్నారు. భరత్ గుప్తా మాట్లాడుతూ..అధికారులు, ఉద్యోగులు తనకు అందించిన సహకారం వల్లే విజయవంతంగా విధులు నిర్వహించగలిగానన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మి షా తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అమ్మకానికి డిసెంబర్‌లో గ్లోబల్ టెండర్లు

- 1,100 బీట్లు, సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి చర్యలు
- రాష్ట్ర పీసీసీఎఫ్ మధుసూదనరెడ్డి



బి.కొత్తకోట: రాష్ట్రంలో పట్టుబడి గోదాముల్లో నిల్వ ఉన్న 5,600 టన్నుల ఎర్రచందనం విక్రయానికి డిసెంబర్‌లో గ్లోబల్ టెండర్లు నిర్వహిస్తున్నట్లు అటవీశాఖ ముఖ్య సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్) మధుసూదనరెడ్డి చెప్పారు. అన్నమయ్యజిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.1,500 నుంచి రూ.2వేల కోట్ల వరకు ఆదాయం వస్తుందన్న అంచనా వేశామన్నారు. జిల్లాల పునర్విభజన ద్వారా 31 జిల్లా అటవీశాఖ అధికారులను నియమించామని తెలిపారు. కొత్తగా సబ్‌డివిజన్ల ఏర్పాటును పరిశీలిస్తున్నామని చెప్పారు. కొత్తగా 1,000 బీట్లు అధికారులు, 100 సెక్షన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పొరుగు రాష్ట్ర సరిహద్దుల్లో మొబైల్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఎర్రచందనం ఉన్న అటవీప్రాంత అధికారులకు ఆయుధాలిచ్చామని చెప్పారు. త్వరలో టైగర్ జోన్ ప్రాంత అధికారులకు శిక్షణ ఇచ్చి వారికి కూడా ఆయుధాలు ఇస్తామన్నారు. తమిళనాడు నుంచి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశిస్తున్న ఏనుగుల సమస్యకు పరిష్కార మార్గం కనుగొంటామన్నారు. హార్సిలీహిల్స్‌పై అరకు తరహా నిర్వహణ చేపట్టి కాఫీతోటల దిగుబడిని పెంచుతామని చెప్పారు.

ప్రభుత్వ అధికారాలపై విచారిస్తాం

గత సర్కారు నిర్ణయాలపై దర్యాప్తు చేసే అంశాన్ని పరిశీలిస్తాం

- ఏపీ హైకోర్టు ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం సవాల్
- సిట్ దర్యాప్తును నిలిపివేసిందన్న ప్రభుత్వ న్యాయవాది
- తదుపరి విచారణ 16కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ : ప్రభుత్వం మారిన తర్వాత ఏర్పడిన నూతన ప్రభుత్వం గత సర్కారు నిర్ణయాలపై దర్యాప్తు చేసే అంశంపై లోతుగా విచారిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. అమరావతి భూముల విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలపై దర్యాప్తు చేయడానికి సిట్ ఏర్పాటుచేసే అధికారం తర్వాత వచ్చిన ప్రభుత్వానికి గవర్నమెంట్‌కు లేదన్న ఏపీ హైకోర్టు ఆదేశాలు సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. అసలు ఇది సీబీఐకి రిఫర్ చేయాల్సిన అంశమని తెలిపారు. అమరావతి భూములపై పలు నోటిఫికేషన్లు ఇచ్చామని, సిట్ ఏర్పాటుచేశామని, పోలీసు నోటీసులు కూడా ఇచ్చామని, అయినా హైకోర్టు మూడు డాక్యుమెంట్లు విస్మరించి సిట్ దర్యాప్తు నిలిపివేసిందన్నారు. రాజకీయ కక్షలు ఉన్నప్పటికీ వాస్తవాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేయడం సమంజసమేనని జగన్నాథరావు కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయాన్ని సింఘ్వి ఉటంకించారు. రాష్ట్రంలో కేబినెట్ సబ్ కమిటీ లోతుగా పరిశీలించి కొన్ని సిఫార్సులు చేసిందని ఆ మేరకే సిట్ ఏర్పాటైందన్నారు. కానీ, సిట్ దర్యాప్తునకు దురుద్దేశాలు ఆపాదిస్తూ హైకోర్టు దర్యాప్తు నిలిపివేసిందన్నారు. ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి దర్యాప్తు ఆదేశాలిచ్చే అధికారం ఎందుకు ఉండదని ప్రశ్నించారు. ఒకవేళ రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై హైకోర్టుకు అనుమానముంటే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించొచ్చుగా అని తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సులనే హైకోర్టు తప్పు పట్టిందని, హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చి విచారణ కొనసాగించేలా ఆదేశాలివ్వాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. ఈ సమయంలో గత ప్రభుత్వ నిర్ణయాలపై సక్సెసర్ గవర్నమెంట్ దర్యాప్తు అనేది లార్జర్ ఇంట్రెస్ట్ అని ధర్మాసనం వ్యాఖ్యానించి బుధవారం విచారణ చేపడతామని పేర్కొంది. జాబితాలో టాప్ ఆఫ్ ద బోర్డుగా ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

అంతమంది వాదనలు వినడం మా ప్రాక్టీసు కాదు..

అనంతరం.. కొన్ని డాక్యుమెంట్లు సమర్పిస్తామని ప్రతివాది వర్ల రామయ్య తరఫు న్యాయవాది తెలిపారు. ఈ సమయంలో.. ఇది క్వశ్చన్ ఆఫ్ లాకు సంబంధించిన అంశమని, వాస్తవాలు కనిపెట్టే అథారిటీ కాదని, తామేమీ సీబీఐ కానీ, సిట్ కానీ కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆ తర్వాత.. ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తాను హైకోర్టులో ఒరిజినల్ రిట్ పిటిషనర్‌నని చెప్పారు. దీంతో.. ఎవరో ఒక న్యాయవాది వాదనలే వింటామని ధర్మాసనం స్పష్టంచేసింది. పది మంది ప్రతివాదులు ఉంటే పది మంది న్యాయవాదుల వాదనలు వినడం తమ ప్రాక్టీస్ కాదని పేర్కొంది. ప్రతివాదుల తరఫున ఎవరు వాదిస్తారో నిర్ణయించుకోవాలని సూచించింది. నవంబరు 16న తిరిగి విచారిస్తామంటూ ధర్మాసనం తెలిపింది.

ప్రధాని మోదీకి ఘన స్వాగతం



ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నమస్కరిస్తున్న విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి. పక్కన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి శుక్రవారం విశాఖలో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలతో పాటు, మరికొన్నింటిని జాతికి అంకితం చేసేందుకు విశాఖకు చేరుకున్న ప్రధానికి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో రాత్రి 7.55కు ఐఎన్ఎస్ డేగా వద్దకు ప్రధాని చేరుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్, సీఎం, స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, తూర్పు నావికాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, తదితరులు స్వాగతం పలికారు. సీఎం జగన్ పలువురు మంత్రులను ప్రధానికి పరిచయం చేశారు. అనంతరం మారుతి కూడలి నుంచి ఐఎన్ఎస్ చోళా వరకు బీజేపీ చేపట్టిన శోభాయాత్ర రోడ్ షోలో అడుగడుగునా ప్రధానికి ఆ పార్టీ శ్రేణులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఐఎన్ఎస్ చోళా సూటుకు చేరుకున్న ప్రధానితో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీకి చెందిన కోర్ కమిటీ సభ్యులు వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్టు తెలిసింది. మరోవైపు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు గెస్ట్‌హౌస్‌కు రాత్రి 8.43కు చేరుకోగా, నోవాటెల్‌లో గవర్నర్ బస చేస్తున్నారు. అంతకు ముందు ప్రధానికి స్వాగతం పలికేందుకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌కు కలెక్టర్, కమిషనర్‌తో పాటు ఎంపీలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. ప్రధానికి స్వాగతం పలికినవారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి సత్యవతి, గొడ్డేటి మాధవి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పలువురు ఎమ్మెల్యేలు, కలెక్టర్ మల్లికార్జున, సీపీ సీహెచ్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

40 నిమిషాల పాటు పీఎం ప్రసంగం!

రాష్ట్రంలో రూ.10,742 కోట్లతో చేపట్టనున్న వివిధ ప్రాజెక్టులతో పాటు ఇప్పటికే పూర్తి అయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేసేందుకు ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) గ్రౌండ్స్ ఇప్పటికే సిద్ధమైంది. శనివారం (12వ తేదీ) ఇక్కడ జరిగే బహిరంగ సభలో ప్రధానితో కలిసి గవర్నర్, ముఖ్యమంత్రులు పాల్గొననున్నారు. ప్రధాని ఐఎన్ఎస్ చోళ నుంచి ఉదయం 10.10 గంటలకు బయలుదేరి 10.30 గంటలకు ఏయూ గ్రౌండ్‌కు రోడ్డు మార్గంలో చేరుకుంటారు. గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలిసి ప్రధాని రూ.10,742 కోట్ల విలువైన 5 ప్రాజెక్టులకు శంకుస్థాపన, రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. ఈ బహిరంగ సభలో ప్రధాని 40 నిమిషాల పాటు ప్రసంగించనున్నట్లు తెలిసింది. ఇదే సభలో సీఎం వైఎస్ జగన్ కూడా మాట్లాడనున్నారు. 11.45 గంటలకు సభ ముగిసిన అనంతరం ప్రధాని మోదీ.. విశాఖ విమానాశ్రయానికి చేరుకుని 12.05 గంటలకు హైదరాబాద్ బయలుదేరనున్నారు.

బీజేపీ శోభాయమాన స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: విశాఖ పర్యటనకు వచ్చిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. శోభాయాత్ర పేరిట నిర్వహించిన రోడ్డు షోలో దారి పొడవునా మోదీ.. మోదీ.. అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు వెనక ఉన్న రోడ్డు మార్గంలోని మారుతి జంక్షన్ నుంచి నేవల్ డాక్ యార్డు వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఈ రోడ్డుషో సాగింది. రోడ్డు పక్కన బీజేపీ జెండాలు, బ్యానర్లు కట్టారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు దారి పొడవునా పెద్ద సంఖ్యలో మోదీ ముఖచిత్రం ఉన్న ప్ల కార్డులను చేతబట్టి నిలుచున్నారు. మోదీ వాహనంపై దారి వెంబడి బీజేపీ కార్యకర్తలు పూల వర్షం కురిపించారు. మోదీ.. మోదీ.. భారత మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ప్రధాని మోదీ వాహనంలోపలి నుంచి వారికి అభివాదం చేస్తూ చిరునవ్వుతో ముందుకు సాగారు. తొలుత ఈ రోడ్డు షోలో ప్రధాని ఓపెన్ టాప్ వాహనంలో పయనిస్తారని భావించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆ ఆలోచన విరమించుకున్నారు. ప్రధాని రోడ్డు షో కాన్వాయ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు అవకాశం కల్పించారు. ఆయనతో పాటు ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ మాధవ్ పాల్గొన్నారు. ఈ రోడ్డు షో వెనుక బీజేపీ నాయకులు సీఎం రమేష్, పురందేశ్వరి, సుజనా చౌదరి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

శంకుస్థాపన, జాతికి అంకితం చేయనున్న ప్రాజెక్టులు

శంకుస్థాపన ప్రాజెక్టు	వ్యయం (రూ. కోట్లలో)
విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ	152
6 లైన్ల రాయపూర్-విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్	3,778
కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు ప్రత్యేక రహదారి	566
విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ	460
శ్రీకాకుళం-అంగుల్ గెయిల్ పైపులైను	2,658
మొత్తం	7,614 కోట్లు

జాతికి అంకితం చేయనున్న ప్రాజెక్టులు
పాతపట్నం-నరసన్నపేట రెండు లైన్ల రహదారి-211
ఓఎన్‌జీసీ-యూ ఫీల్డ్ అభివృద్ధి ప్రాజెక్టు -2,917
మొత్తం 10,742 కోట్లు

ప్రజల్లోకి వెళ్లడం ద్వారానే పార్టీ బలోపేతం

- బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ నేతల సమావేశంలో ప్రధాని మోదీ
- ప్రజా ప్రయోజన సామాజిక కార్యక్రమాలే ఇందుకు మార్గం
- రాజకీయ లక్ష్యానికి నిర్ణీత సమయం అంటూ ఉండదు
- గుజరాత్‌లో ఈ ఫార్ములాతోనే పార్టీని బలంగా నిర్మించాం
- నేతల వివరాలు స్వయంగా అడిగి తెలుసుకున్న ప్రధాని

సాక్షి, అమరావతి, విశాఖపట్నం : ప్రజా ప్రయోజన సామాజిక కార్యక్రమాల ద్వారా నేతలు ప్రజల్లోకి వెళ్లడం ద్వారానే ఆంధ్రప్రదేశ్‌లోనూ బీజేపీ బలోపేతానికి అవకాశం ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పార్టీ రాష్ట్ర నాయకులకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని.. రాత్రి పార్టీ కోర్ కమిటీ నేతలతో భేటీ అయ్యారు. జాతీయ పార్టీ సంఘటనా సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధరన్‌లతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి, ఎంపీలు జీవీఎల్ నరసింహరావు సహా మొత్తం 20 మంది నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో అత్యధిక సమయం నేతల పరిచయ కార్యక్రమానికి, రాష్ట్ర పార్టీ నేతల ద్వారా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితి గురించి తెలుసుకోవడానికి కేటాయించారు. నేతలందరూ మాట్లాడడం పూర్తయ్యాక, రాష్ట్రంలో మిగిలిన పార్టీల ప్రస్తావన తేకుండా, కేవలం రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతం గురించి మాత్రమే పలు సూచనలు చేశారు. కొందరు నాయకులు అధికార వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేస్తూ మాట్లాడినప్పటికీ, తర్వాత ప్రధాని మోదీ మాట్లాడినప్పుడు రాష్ట్రంలో మిత్రపక్ష జనసేన పార్టీ ప్రస్తావన కూడా లేకుండా మాట్లాడారు. 'రాజకీయాల్లో నిర్ణీత సమయం లక్ష్యంగా పెట్టుకొని కార్యక్రమాలు చేయడం అంటూ ఉండదు. నేతలందరూ నిరంతరం ప్రజల్లో ఉండడం ద్వారానే అనుకున్న రాజకీయ లక్ష్యం సాధించే వీలుంటుంది. గుజరాత్‌లోనూ ఇదే తరహాలో పని చేయడం ద్వారా ఇప్పుడు పార్టీ బలంగా ఉంది.' అని సూచించినట్లు ఆ పార్టీ నేత ఒకరు తెలిపారు. రాత్రి 9.15 గంటల నుంచి 10.15 గంటల వరకు దాదాపు గంట పాటు రాష్ట్ర నేతలతో ప్రధాని సమావేశం కొనసాగించారు. ఇదిలా ఉండగా, ప్రధానితో సమావేశం అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ.. 'ఏపీలో బీజేపీ అభివృద్ధికి ఏం చెయ్యాలి.. ప్రజలతో ఎలా మమేకమవ్వాలో ప్రధాని వివరించారు. అందరూ సమష్టిగా పని చేయాలని సూచించారు' అని చెప్పారు.

రాష్ట్రాభివృద్ధిపై ప్రధానితో చర్చించా

- జనసేన అధినేత పవన్ కళ్యాణ్



బీచ్ రోడ్డు (విశాఖ తూర్పు): బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సమావేశానికి ముందు ప్రధాని మోదీ రాష్ట్రంలో బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నేత నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. దాదాపు 10 నిమిషాల పాటు వీరి సమావేశం కొనసాగినట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. కాగా ఎనిమిదేళ్ల తర్వాత ప్రధాని మోదీని కలిసినట్లు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలిపారు. శుక్రవారం ఇక్కడ ప్రధానితో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి, విశాఖ ప్రజల ఆకాంక్షలపై చర్చించినట్లు చెప్పారు. ఇది చాలా ప్రత్యేక పరిస్థితుల్లో జరిగిన సమావేశమని, దీని ద్వారా రాష్ట్రానికి మంచి రోజులొస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

జనవరి 8న గ్రూప్-1 ప్రిలిమ్స్

▶ మొదటి పేజీ తరువాయి

నియామక ప్రక్రియను 9 లేదా 10 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇప్పటికే జారీ చేసిన నోటిఫికేషన్లతో పాటు త్వరలో వెలువరించనున్న వాటికీ నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'సాక్షి'కి వివరించారు. ఇప్పటికే ప్రభుత్వం అనుమతులిచ్చిన అనేక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను విడుదల చేశామని గుర్తు చేశారు. వీటిలో కొన్నింటికి పరీక్షలు నిర్వహించి ఫలితాలను కూడా ప్రకటించామని తెలిపారు. సవాంగ్ ఇంకా ఏం చెప్పారంటే..

పకడ్బందీ ప్రణాళికతో ముందుకు..

గ్రూప్-1తో సహా అన్ని పోస్టుల భర్తీలో ఎక్కడా జాప్యం లేకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. న్యాయవివాదాలు, పలుమార్లు ఫలితాల వెల్లడి, మెయిన్స్ మూల్యాంకనం రెండు సార్లు నిర్వహించాల్సి రావడం వంటి కారణాలతో 2018 గ్రూప్-1 పోస్టుల భర్తీ ప్రక్రియలో జాప్యం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వ చొరవతో ఆ న్యాయ వివాదాలన్నింటినీ పరిష్కరించి ఆ పోస్టులను భర్తీ చేశాం. సెప్టెంబర్ 30న గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్ ఇచ్చాం. దీనిద్వారా 92 గ్రూప్-1 పోస్టులను భర్తీ చేస్తాం. గత గ్రూప్-1 నోటిఫికేషన్‌లో భర్తీ కాని పోస్టులు ఈ కొత్త నోటిఫికేషన్‌లో చేరతాయి. దీంతో ప్రస్తుత నోటిఫికేషన్‌లోని పోస్టుల సంఖ్య కొంత పెరిగే అవకాశముంది. కొన్ని పొరపాట్లతో అప్పటి గ్రూప్-1 పోస్టులకు వయోపరిమితి మించిపోయి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. అలాంటి వాటికి ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గ్రూప్-1 పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ నవంబర్ 2తో ముగిసినా 5 వరకు అవకాశం ఇచ్చాం. దీంతో 1.26 లక్షల దరఖాస్తులు వచ్చాయి. త్వరలో గ్రూప్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తాం. ఈ పోస్టుల భర్తీకి సీఎం అనుమతి కూడా ఇచ్చారు.

అత్యంత ప్రతిభావంతుల ఎంపిక

ఏపీపీఎస్సీ పకడ్బందీ చర్యలతో వివిధ కేడర్ పోస్టుల్లో అత్యంత ప్రతిభావంతులు ఎంపికవుతున్నారు. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా 2018 గ్రూప్-1 పోస్టులకు అత్యంత ప్రతిభావంతులు ఎంపికయ్యారు. 2018 గ్రూప్-1 మెయిన్స్ డిజిటల్ వాల్యుయేషన్‌పై న్యాయ వివాదం ఏర్పడడంతో హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్‌గా 55 రోజుల్లో మూల్యాంకనాన్ని పూర్తి చేయించాం. ఇంటర్వ్యూలను గతంలో మాదిరి ఒక్క బోర్డుతో కాకుండా మూడు బోర్డులతో నిర్వహించాం. గతంలో కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో ఒకే బోర్డుతో వీటిని నిర్వహించేవారు. ఇప్పుడు మూడు బోర్డుల్లోనూ కమిషన్ సభ్యులతోపాటు ఇద్దరు చొప్పున సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సబ్జెక్టు నిపుణులుగా యూనివర్సిటీ వీసీ/విశ్రాంత వీసీలను నియమించాం. దీంతో 11 రోజుల్లోనే ఇంటర్వ్యూలను పూర్తిచేశాం. ఐఏఎస్‌కు ఎంపికైన నలుగురు, ఐపీఎస్‌కు ఎంపికైన ఇద్దరు ఈ గ్రూప్-1 పోస్టులకు ఎంపికయ్యారు.

సాధ్యమైనంత త్వరగా పోస్టుల భర్తీ

ఈసారి గ్రూప్-1 పోస్టులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా న్యాయపరమైన అవాంతరాలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇందుకు అనుగుణంగా నిర్దిష్ట విధానాలను రూపొందించాం. సాధ్యమైనంత త్వరగా పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తాం. ప్రభుత్వం నుంచి కూడా సహకారాలు అందుతున్నాయి.

'ఎంవీఆర్ ఇన్‌ఫ్రా'లో ఐటీ శాఖ తనిఖీలు

హైదరాబాద్, చెన్నై, గోవాలోనూ తనిఖీలు

- మరో రెండు, మూడు రోజులు కొనసాగే అవకాశం

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖపట్నం కేంద్రంగా పలు ప్రభుత్వ ప్రాజెక్టులను నిర్మిస్తోన్న ఎంవీఆర్ ఇన్‌ఫ్రా సంస్థలో ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు చేశారు. పన్ను ఎగవేత ఆరోపణలపై ఈ నెల 9 నుంచి విశాఖతో పాటు మరో మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఎంవీఆర్ ఇన్‌ఫ్రా విశాఖపట్నంలో తెలుగుతల్లి ఫ్లైఓవర్‌తో పాటు పలు ప్రభుత్వ ప్రాజెక్టులు చేపట్టింది. ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై, గోవాలో కూడా ప్రాజెక్టులు చేస్తోంది. ఆదాయపు పన్నును ఎగవేసేందుకు లేని ఖర్చులు చూపిస్తూ సదరు సంస్థ రిటర్న్స్ ఫైల్ చేసిందన్న సమాచారంతో విశాఖ ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు విభాగాధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. విశాఖలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో ఉన్న కార్యాలయంలోనే కాకుండా ప్రస్తుతం పలు ప్రాజెక్టులు చేస్తోన్న హైదరాబాద్, చెన్నై, గోవాల్లో కూడా తనిఖీలు చేస్తున్నారు. పన్ను ఎగవేతకు సంబంధించిన ఆధారాలతో పాటు కీలక డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ సోదాలు మరో రెండు, మూడు రోజుల పాటు కొనసాగుతాయని తెలుస్తోంది.

• తెలంగాణ

మునుగోడులో ఈసీ విఫలం

సాక్షి, హైదరాబాద్ : మునుగోడు ఉప ఎన్నిక నిర్వహణలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ విమర్శించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఇంత పెద్దఎత్తున మునుగోడుకు డబ్బులు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశామని స్పష్టం చేశారు.

ఈడీ దాడులపై జీవో తేలేకపోయారా?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సీబీఐని అడ్డుకున్నట్టే.. ఈడీ, ఐటీ విచారణ, దాడులు జరగకుండా జీవో తీసుకురాలేకపోయారా? అని బీజేపీ నేత, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సీహెచ్ విఠల్ ఎద్దేవా చేశారు. శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ రాజ్‌తో కలిసి విఠల్ విలేకరులతో మాట్లాడుతూ ఈడీ, ఐటీ శాఖల దాడుల్లోనూ రిజర్వేషన్లు ఉంటాయా? అని ప్రశ్నించారు. బీసీ మంత్రి, బీసీ ఎంపీ అని తెలంగాణలో ఈడీ దాడులు జరగలేదని, 2013లో అందిన ఫిర్యాదులపై ఈ సంస్థలు దర్యాప్తు సాగిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

బీజేపీపై పోరుకు రండి

సాక్షి, హైదరాబాద్ : బీజేపీతో జరిగే పోరాటంలో తమతో చేతులు కలపాలని పలు పార్టీలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. మునుగోడులో బీజేపీ ఓడిపోవడానికి కమ్యూనిస్టు పార్టీ కారణమనే అక్కసుతో తమపై అవాకులు చెవాకులు పేలుతున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మండిపడ్డారు. ఆ పార్టీతో స్నేహం చేసిన పార్టీల పరిస్థితి ధృతరాష్ట్రుని కౌగిలిలో బందీ అయినట్లేనని విమర్శించారు. బీజేపీ ఎదుగుదలకు దశాబ్దాలుగా వెన్నుదన్నుగా నిలిచిన మిత్రపక్షం శివసేనను అధికారం కోసం చీల్చడం, అకాలీదళ్‌ను దూరం చేసుకోవడం వంటివి ఉదాహరణలని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఇంటర్ తరహాలో పరీక్షలు

- ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ

బాసర (ముధోల్): బాసర ట్రిపుల్ ఐటీలో ఈ విద్యా సంవత్సరం నుంచి సెమిస్టర్ పరీక్షలకు బదులు ఇంటర్మీడియట్ పరీక్షల విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్లు ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు. ఇదే అంశంపై 'సాక్షి' పత్రిక గతంలోనే కథనాలను ప్రచురించింది. తాజాగా ఆ విషయాన్నే ఇన్‌చార్జి వీసీ ప్రకటించారు. మొదటి రెండు సంవత్సరాల పీయూసీ-1, 2 చదువుతున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ట్రిపుల్ ఐటీ ఆధునీకరణకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారధి శనివారం వర్సిటీ సందర్శనకు వస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేస్తారని వివరించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల వీసీలు కూడా త్వరలో ట్రిపుల్ ఐటీని సందర్శిస్తారన్నారు.

డిసెంబర్‌లో స్నాతకోత్సవం

బాసర ట్రిపుల్ ఐటీలో స్నాతకోత్సవ కార్యక్రమాన్ని డిసెంబర్‌లో నిర్వహిస్తామని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు. ఈ1, ఈ2 విద్యకు అవసరమయ్యే 2,200 ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు సమకూర్చినట్లు వెల్లడించారు.

వారానికి 80 గంటల పని

వర్క్ ఫ్రమ్ హోమ్ రద్దు
ఆఫీసుకు రాకుంటే ఇంటికే!
ట్విటర్ ఉద్యోగులకు మస్క్ హెచ్చరిక



శాన్‌ఫ్రాన్సిస్కో: ట్విటర్ సిబ్బందికి కొత్త యజమాని ఎలాన్ మస్క్ కొత్త నిబంధనలు విధించారు. వాటిని పాటించే వాళ్లే కొనసాగాలని, కుదరని వాళ్లు వెళ్లిపోవాలని అల్టిమేటం జారీ చేశారు. 50% మంది సిబ్బందిని తొలగించిన తర్వాత మిగతా సిబ్బందితో మస్క్ సమావేశమయ్యారు. ''ఇకపై వారానికి 80 గంటలు పని చేయాలి. వర్క్ ఫ్రమ్ హోమ్ రద్దు చేస్తున్నాం. కార్యాలయంలో ఉచిత భోజనాలు కూడా ఇక ఉండవు. కష్టపడి పనిచేసి ఆదాయం తేకుంటే వచ్చే ఏడాదికే కంపెనీ దివాలా తీస్తుంది. రానున్నవన్నీ గడ్డు రోజులే. ట్విటర్‌లో కొనసాగాలనుకునే వారు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. లేకపోతే ఆఫీసుకు రావద్దు. రాజీనామా చేయండి'' అంటూ కుండబద్దలు కొట్టారు. కొందరు ఉద్యోగులు ఈ వివరాలు బయట పెట్టారు.

క్లుప్తంగా...

15న నింగిలోకి.. ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-ఎస్'

న్యూఢిల్లీ: దేశంలో మొట్టమొదటిసారిగా ప్రైవేటు రంగంలో నిర్మించిన రాకెట్ విక్రమ్-ఎస్ ఈ నెల 15న నింగిలోకి దూసుకెళ్లనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరి కోట ఇస్రో లాంచ్‌పాడ్ నుంచి ఉదయం 11.30 గంటలకు ప్రయోగించనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ తెలిపింది. ప్రారంభ్ అనే ఈ మిషన్‌లో రెండు భారతీయ, ఒక విదేశీ ఉపగ్రహం ఉంటాయని తెలిపింది.

'జ్ఞానవాపి'పై స్టేటస్ కో

న్యూఢిల్లీ: వారణాసిలోని జ్ఞానవాపి-శ్రింగార్ గౌరి సముదాయంలో శివలింగం లభ్యమైన ప్రాంత పరిరక్షణ గడువును సుప్రీంకోర్టు మరింత పొడిగించింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని పేర్కొంది. వివాదంపై దాఖలైన పిటిషన్లన్నిటినీ కలిపి విచారించాలంటూ వారణాసి జిల్లా న్యాయమూర్తిని కోరేందుకు హిందూ కక్షిదారులకు అనుమతినిచ్చింది. సర్వే కమిషనర్‌ను నియమిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ వేసిన పిటిషన్‌కు బదులిచ్చేందుకు హిందూ కక్షిదారులకు మూడు వారాల గడువు ఇచ్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహల ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. మసీదు వెలుపలి గోడ వద్ద ఉన్న దేవతా విగ్రహాలకు పూజలకు అనుమతివ్వాలంటూ మహిళా భక్తులు వేసిన పిటిషన్‌ను విచారిస్తున్న వారణాసి జిల్లా కోర్టు జడ్జి ఏకే విశ్వేశ మసీదు కాంప్లెక్స్ రెండు బేస్‌మెంట్ల తాళాలు తెరిచి సర్వే చేపట్టాలన్న హిందూ భక్తుల పిటిషన్‌పై విచారణను డిసెంబర్ 5కు వాయిదా వేశారు. విశ్వనాథుని ఆలయం-జ్ఞానవాపి మసీదు కేసులో వారణాసి జిల్లా కోర్టులోని అర్జీ విచారణార్హతను సవాల్ చేస్తూ మసీదు కమిటీ వేసిన పిటిషన్‌పై విచారణను అలహాబాద్ హైకోర్టు ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది.

విదేశీ వర్సిటీల్లో సీట్ల వివరాలివ్వండి: సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఉక్రెయిన్ నుంచి తిరిగొచ్చిన వైద్య విద్యార్థులు విదేశీ యూనివర్సిటీల్లో చేరడానికి ఎక్కడెక్కడ ఎన్ని సీట్లున్నాయో వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. రుసుముల వివరాలు కూడా ఇవ్వాలని సూచించింది. దేశీయ వర్సిటీల్లో వైద్య విద్య కొనసాగించడానికి అనుమతి ఇవ్వాలంటూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం చేపట్టింది. ఒక దేశం నుంచి మరో దేశానికి విద్యార్థుల బదిలీ కుదరదని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలిపారు. 15 విదేశీ వర్సిటీల వివరాలున్నా మొబిలిటీ, బదిలీలపై స్పష్టత లేదన్నారు. విచారణ 22కు వాయిదా పడింది.

జిమ్‌లో గుండెపోటు.. నటుడు సిద్ధాంత్ హఠాన్మరణం

ముంబై: వ్యాయామానికి వెళ్లి మరో యువ నటుడు మృత్యువాతపడ్డారు. 'కె కుసుమ్', 'కసౌటీ జిందగీ కే', 'జిద్దీ దిల్ మానే న' వంటి టీవీ సీరియళ్లతో పేరు తెచ్చుకున్న నటుడు సిద్ధాంత్ సూర్యవంశీ(46) శుక్రవారం ముంబైలోని ఓ జిమ్‌లో గుండెపోటుకు గురయ్యారు. జిమ్‌లో ఉండగా గుండెపోటుకు గురైన ఆయన్ను వెంటనే కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారని సన్నిహితులు తెలిపారు. ప్రముఖ నటులు..పునీత్ రాజ్‌కుమార్, సిద్ధార్థ్ శుక్లా, బ్రహ్మస్వరూప్ మిశ్రా, రాజు శ్రీవాస్తవ(58) తదితరులు ఇటీవలి కాలంలో వ్యాయామానికి వెళ్లి మృత్యువాత పడిన విషయం తెలిసిందే.



రాజీవ్ హత్య కేసు... దోషులందరికీ విముక్తి

ఆరుగురి విడుదలకు సుప్రీంకోర్టు ఆదేశం
- 30 ఏళ్లకు పైగా జైల్లో ఉన్న దోషులు
- ఇప్పటికే విడుదలైన పెరారివాళన్
- తప్పుడు నిర్ణయమన్న కాంగ్రెస్
- స్వాగతించిన డీఎంకే, అన్నాడీఎంకే

న్యూఢిల్లీ: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న మొత్తం ఆరుగురు దోషుల ముందస్తు విడుదలకు సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఇదే కేసులో దోషిగా 30 ఏళ్లకు పైగా శిక్ష అనుభవించిన ఎ.జి.పెరారివళన్ సుప్రీంకోర్టు ఆదేశం మేరకు గత మే 18న విడుదలవడం తెలిసిందే. మిగతా దోషులకూ అదే వర్తిస్తుందని న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, జస్టిస్ బి.వి.నాగరత్నలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ''వారికి క్షమాభిక్ష పెట్టాలంటూ గతంలోనే తమిళనాడు ప్రభుత్వం సిఫార్సు చేసింది. దీంతోపాటు దోషుల సత్ప్రవర్తనను కూడా పరిగణనలోకి తీసుకున్నాం'' అని తెలిపింది. దాంతో 30 ఏళ్లకు పైగా జైల్లో ఉన్న ఎస్.నళిని, ఆమె భర్త వి.శ్రీహరన్ అలియాస్ మురుగన్, ఆర్.పి.రవిచంద్రన్, జయకుమార్, రాబర్ట్ పయస్, శంతన్‌కు విముక్తి లభించింది. శ్రీహరన్, శంతన్, రాబర్ట్, జయకుమార్ శ్రీలంక దేశస్తులు. నళిని, రవిచంద్రన్ ముందస్తు విడుదలకు పెట్టుకున్న పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సహ దోషి పెరారివాళన్ విడుదలను కోర్టు దృష్టికి తెచ్చారు. 2021 డిసెంబర్ 27 నుంచి వారిద్దరూ పెరోల్‌పై బయటే ఉన్నారు. మిగతా నలుగురు తమిళనాడులోని వేలూరు జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ''ఇది పూర్తిగా తప్పుడు నిర్ణయం. మాకెంతమాత్రమూ అంగీకారం కాదు. కోర్టు సరైన స్ఫూర్తితో వ్యవహరించలేదు'' అని పార్టీ నేతలు రణ్‌దీప్ సుర్జేవాలా, అభిషేక్ సింఘ్వి, జైరాం రమేశ్ తదితరులన్నారు. సుప్రీం తీర్పుపై సమీక్ష కోరడమా, న్యాయపరంగా ఇతరత్రా చర్యలు చేపట్టడమా యోచిస్తున్నట్టు స్పష్టం చేశారు. దీనిపై సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు విన్పించడంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. మాజీ ప్రధానిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల విడుదలను సమర్థిస్తారో, లేక తీర్పుపై సమీక్ష కోరతారో మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. ''దోషులను సోనియా, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ క్షమించి ఉండవచ్చు. అది వారి గొప్పదనం. కానీ పార్టీగా వారి నిర్ణయాన్ని మాత్రం కాంగ్రెస్ సమర్థించబోదు. ఈ విషయంలో పార్టీ వైఖరి ముందునుంచి ఒకేలా ఉంది'' అని చెప్పారు. తమిళనాట మాత్రం కాంగ్రెస్ భాగస్వామ్య పక్షమైన అధికార డీఎంకే, విపక్ష అన్నాడీఎంకే దోషుల విడుదలను స్వాగతించాయి. ఇది చరిత్రాత్మక తీర్పని డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్ అన్నారు.



హత్యకు కొన్ని క్షణాల ముందు తీసిన ఈ ఫొటోలో రాజీవ్‌తో హంతకురాలు థాను (సర్కిల్లో ఉన్న వ్యక్తి)

ఆ రోజు ఏం జరిగింది...?

1991 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 21న రాజీవ్‌గాంధీ తమిళనాడులో చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూరులో రాత్రి వేళ సభలో పాల్గొన్నారు. రాత్రి 10:10 సమయంలో శ్రీలంకలోని జాఫ్నాకు చెందిన తెన్‌మొళి రాజారత్నం అలియాస్ థాను అనే ఎల్టీటీఈ మహిళా ఆత్మాహుతి దళ సభ్యురాలు ఆర్డీఎక్స్‌తో కూడిన బెల్టు బాంబు పెట్టుకుని రాజీవ్‌ను సమీపించింది. ఆయనకు పూలమాల వేసింది. కాళ్లకు మొక్కేందుకన్నట్టుగా కిందకు వంగింది. ఆమెను పైకి లేపేందుకు రాజీవ్ కాస్త ముందుకు వంగుతూనే తనను తాను పేల్చేసుకుంది. దాంతో రాజీవ్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో 14 మంది కూడా మరణించారు. ఎల్టీటీఈని అడ్డుకునేందుకు శ్రీలంక ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు శాంతి పరిరక్షణ దళం పేరిట అక్కడికి భారత సైన్యాన్ని పంపుతూ ప్రధానిగా రాజీవ్ తీసుకున్న నిర్ణయంపై ఆగ్రహించి సంస్థ అధిపతి వేలుపిళ్లై ప్రభాకరన్ ఈ దురాగతానికి పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది.

నళిని తల్లి హర్షం

సుప్రీం తీర్పు పట్ల నళిని తల్లి ఎస్.పద్మ హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. ''అంతులేని ఆనందమిది. నళిని, మేమంతా ఇంతకాలం అనుభవించిన బాధ అంతా ఇంతా కాదు'' అన్నారు. పెరోల్‌పై బయట ఉన్నందున తీర్పుపై స్పందించేందుకు నళిని నిరాకరించింది. ఆమె కూతురు ప్రస్తుతం లండన్లో ఉంటోంది.


శ్రీహరన్


నళిని


శంతన్


రాబర్ట్ పయస్


ఆర్‌పి రవిచంద్రన్


జయకుమార్

విచారణలో మలుపులు

- **1991 మే 21:** రాజీవ్ హత్య. ఈ కేసులో ఏడుగురి అరెస్టు. నళిని ఆ సమయంలో గర్భవతి. జైల్లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది.
- **1991 జూన్ 11:** పెరారివాళన్‌ను అరెస్టు చేసిన సిట్. టాడా చట్టం కింద కేసు.
- **1991:** బెంగళూరులో పేలుడు సూత్రధారి శివరాసన్ తలదాచుకున్న ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు. దాంతో మరో ఆరుగురితో కలిసి శివరామన్ ఆత్మహత్య.
- **1992:** రాజీవ్ హత్యలో ఎల్టీటీఈ పాత్ర ఉందని తేల్చిన సిట్. 1990లోనే జాఫ్నా అడవుల్లో ఇందుకు ఎల్టీటీఈ చీఫ్ ప్రభాకరన్ పథక రచన చేసినట్టు వెల్లడి.
- **1998:** మురుగన్, సంథాను, పెరారివళన్, నళిని సహా మొత్తం 26 దోషులకు టాడా కోర్టు మరణశిక్ష విధించింది.
- **1999:** నలుగురు నిందితుల అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. మురుగన్, శంతను, పెరారివాళన్, నళినిలకు కింది కోర్టు విధించిన మరణశిక్షను సమర్థించింది. ముగ్గురికి జీవితకాల శిక్ష విధిస్తూ మిగతా 19 మందిని వదిలేసింది. నళిని, మురుగన్, శంతను, పెరారివాళన్ క్షమాభిక్ష అభ్యర్థనను తమిళనాడు ప్రభుత్వం తోసిపుచ్చింది.
- **2001:** శంతను, మురుగన్, పెరారివాళన్ క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ తిరస్కరించారు. ముగ్గురికి విధించాల్సిన మరణశిక్షపై మద్రాస్ హైకోర్టు సెప్టెంబర్ 9న స్టే విధించింది. దాన్ని జీవితకాల శిక్షకు తగ్గించాలన్న తీర్మానానికి నాటి తమిళనాడు సీఎం జయలలిత ఆమోదం తెలిపారు.
- **2011:** రాజీవ్‌ను హత్య చేసినందుకు భారత్‌కు ఎల్టీటీఈ క్షమాపణ.
- **2014:** రాజీవ్ భార్య సోనియా గాంధీ అభ్యర్థన మేరకు నళిని మరణశిక్షను జీవితకాల శిక్షగా తగ్గించిన సుప్రీంకోర్టు.
- **2018:** మొత్తం ఏడుగురు నిందితులనూ విడుదల చేయాలని తమిళనాడు కేబినెట్ సిఫార్సు.
- **2019:** నళినికి తొలిసారి పెరోల్.
- **2021:** నళిని, రవిచంద్రన్‌లకు పెరోల్.
- **2022:** సుప్రీంకోర్ట్ తీర్పుతో మే 18న పెరారివాళన్ జైలు నుంచి విడుదలయ్యాడు.
- **2022 సెప్టెంబర్:** నళిని, రవిచంద్రన్ విడుదలకు సుప్రీంకోర్ట్ ఆదేశం.
- **నవంబర్ 2022:** మిగతా ఆరుగురు దోషులను కూడా విడుదల చేయాలని సుప్రీంకోర్ట్ తీర్పు.

మూసధోరణికి తెర

పెట్టుబడులకు నమ్మకమైన దేశంగా మారిన భారత్: మోదీ
- బెంగళూరులో వందేభారత్ రైలు ప్రారంభం, కెంపేగౌడ విగ్రహావిష్కరణ



బెంగళూరు: దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగాలంటే భౌతిక, సామాజికపరమైన మౌలిక సదుపాయాలను రెండింటినీ బలోపేతం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై తమ ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో భారత్ సాధిస్తున్న అద్భుతాలను చూసి ప్రపంచదేశాలు ఆశ్చర్యపోతున్నాయన్నారు. మేడ్ ఇన్ ఇండియా, 5జీ టెక్నాలజీ 2014కు ముందు ఊహకందని విషయాలన్నారు. శుక్రవారం బెంగళూరులో మోదీ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బహిరంగ సభలో ప్రసంగించారు. గత ప్రభుత్వాలు పాత ఆలోచనా ధోరణిని పట్టుకొని వేలాడాయని, దేశ ఆకాంక్షల్లో వేగాన్ని విలాసంగా, గొప్ప స్థాయికి చేరుకోవడాన్ని రిస్కుగా భావించాయని విమర్శించారు. ఈ అభిప్రాయాన్ని తమ ప్రభుత్వం మార్చేసిందన్నారు.

స్టార్టప్‌ల హబ్‌గా భారత్

పెట్టుబడులకు భారత్ ఒక నమ్మకమైన దేశంగా మారిందని మోదీ ఉద్ఘాటించారు. ''కరోనా ప్రభావం ఉన్నప్పటికీ మూడేళ్లలో కర్ణాటక రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఎఫ్‌డీఐ రాబట్టడంలో గతేడాది తొలి స్థానంలో నిలిచింది. ఐటీ, రక్షణ తయారీ, స్పేస్ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగాల్లో దూసుకెళ్తోందని కొనియాడారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వమే కర్ణాటక బలం అని స్టార్టప్ అంటే కేవలం ఒక కంపెనీ కాదని, కొత్తగా ఆలోచించడానికి, సాధించడానికి భావోద్వేగ అంశమని వివరించారు.

విమానాశ్రయ టెర్మినల్ ప్రారంభం

బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నగర వ్యవస్థాపకుడు నాదప్రభు కెంపేగౌడ 108 అడుగుల ఎత్తయిన కంచు విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. విగ్రహం బరువు 218 టన్నులు. ప్రఖ్యాత శిల్పి, పద్మభూషణ్ గ్రహీత రామ్‌వాంజీ సుతార్ ఈ విగ్రహాన్ని డిజైన్ చేశారు. విమానాశ్రయంలో .5,000 కోట్ల వ్యయంతో పచ్చదనానికి పెద్దపీట వేస్తూ పర్యావరణ హితంగా నిర్మించిన నూతన టెర్మినల్-2ను మోదీ ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను బెంగళూరులోని క్రాంతివీరా సంగోలీ రైల్వే స్టేషన్‌లో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు మైసూరు నుంచి బెంగళూరు మీదుగా చెన్నైకి రాకపోకలు సాగిస్తుంది. వందేభారత్ రైలుతో మైసూరు-బెంగళూరు-చెన్నై అనుసంధానం మరింత మెరుగవుతుందని, వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకుంటాయని మోదీ చెప్పారు. ప్రజల జీవనం సులభతరం అవుతుందన్నారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలను దర్శించుకొనేవారి కోసం 'భారత్ గౌరవ్ కాశీ దర్శన్' రైలును సైతం ప్రధానమంత్రి ప్రారంభించారు. 'భారత్ గౌరవ్' పథకంలో భాగంగా రైల్వే శాఖ, కర్ణాటక ప్రభుత్వం సంయుక్తంగా ఈ రైలును నిర్వహిస్తాయి. 'భారత్ గౌరవ్ కాశీ దర్శన్' రైలుతో కర్ణాటక, కాశీ సన్నిహితమవుతాయని పేర్కొంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

నేటి సవాళ్లకు గాంధీజీ బోధనలే సమాధానం: మోదీ

దిండిగల్: సంఘర్షణల నుంచి వాతావరణ సంక్షోభాల వరకూ.. నేడు మనం ఎదుర్కొంటున్న సవాళ్లకు జాతిపిత మహాత్మా గాంధీ బోధనలే సమాధానాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ దిశగా సాగడానికి మహాత్ముడిని స్ఫూర్తిగా తీసుకున్నామన్నారు. శుక్రవారం తమిళనాడులోని గాంధీగ్రామ్ రూరల్ ఇనిస్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. గాంధీగ్రామ్ రూరల్ ఇనిస్టిట్యూట్‌లో పట్టభద్రులైన నలుగురు విద్యార్థులకు ప్రధాని బంగారు పతకాలు అందజేశారు.

నేడే హిమాచల్ పోలింగ్

సిమ్లా : డబుల్ ఇంజన్ నినాదం, ప్రధాని మోదీ చరిష్మాతో చరిత్ర సృష్టించాలని బీజేపీ.. అధికార వ్యతిరేకత, ఐదేళ్లకోసారి అధికార పార్టీని మార్చే దశాబ్దాల సంప్రదాయం కొనసాగుతుందన్న విశ్వాసంతో కాంగ్రెస్ హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. తొలిసారి బరిలో దిగిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎవరి ఓట్లు చీలుస్తుందోనన్న ఆందోళన నెలకొంది. 68 స్థానాలున్న అసెంబ్లీకి శనివారం జరిగే ఎన్నికల్లో 412 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 55 లక్షలకు పైగా ఓటర్లు తేల్చనున్నారు. సీఎం జైరామ్ ఠాకూర్, దివంగత సీఎం వీరభద్ర సింగ్ కుమారుడు విక్రమాదిత్య సింగ్ వంటి ప్రముఖులు పోటీలో ఉన్నారు. బీజేపీ అభ్యర్థుల్లో 82 శాతం, కాంగ్రెస్ అభ్యర్థుల్లో 90 శాతం కోటీశ్వరులే!

మంచులో నడుస్తూ...

మొత్తం 7,884 పోలింగ్ కేంద్రాల్లో 397 కేంద్రాలు మంచుతో నిండి అత్యంత సంక్లిష్టంగా ఉంటాయి. సముద్ర మట్టానికి 15,256 అడుగుల ఎత్తులో కాజాలోని తషిగాంగ్ పోలింగ్ బూత్ దేశంలోనే అత్యంత ఎత్తులో ఉండే పోలింగ్ కేంద్రం.

నువ్వా, నేనా?

బీజేపీ తరఫున ప్రచారాన్ని ప్రధాని మోదీ తానే ముందుండి నడిపించారు. ఆఖరి నిముషంలో ఓటర్లకు బహిరంగంగా లేఖ రాసి కమలం గుర్తుకే ఓటేయాలని అభ్యర్థించారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ తరఫున ప్రచార భారమంతా పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాపైనే పడింది. గత రెండేళ్లలో తొమ్మిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన కాంగ్రెస్ హిమాచల్‌లోనైనా గెలిచి కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే వరసగా రెండోసారి గెలిచిన పార్టీగా చరిత్ర సృష్టిస్తుంది. ఈ విజయం వచ్చే ఏడాది హిందీ బెల్ట్‌లో జరిగే అత్యంత కీలకమైన తొమ్మిది రాష్ట్రాల గెలుపు అవకాశాలను పెంచుతుందన్న భావనలో పార్టీ ఉంది.



హిమాచల్, గుజరాత్‌ల్లో... భారీగా నగదు స్వాధీనం

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో భారీగా నగదు, మద్యం, ఉచిత హామీలకు సంబంధించిన వస్తువుల్ని స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం వెల్లడించింది. హిమాచల్‌లో రూ.17.18 కోట్ల నగదు, 17.5 కోట్ల మద్యం, రూ.1.2 కోట్ల డ్రగ్స్, రూ.41 లక్షల ఉచిత సామాన్లు దొరికాయి. గుజరాత్‌లో రూ.66 లక్షల నగదు, రూ.3.86 కోట్ల మద్యం, రూ.94 లక్షల విలువైన డ్రగ్స్, రూ.64.56 కోట్ల ఉచిత సామాగ్రి ఈసీ స్వాధీనం చేసుకుంది.

చిన్నప్పటి బడికి రాష్ట్రపతి



భువనేశ్వర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిన్నప్పుడు తాను చదువుకున్న పాఠశాలను సందర్శించి భావోద్వేగానికి లోనయ్యారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో కందగిరిలోని తపోబన హైస్కూల్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. ''నా చదువు సొంతూరు ఉపార్‌బెడాలో మొదలైంది. గడ్డితో కప్పిన గుడిసెలో చదువుకున్నా. చుట్టూ పేడ, చెత్తను ఊడ్చి మేమే శుభ్రం చేసేవాళ్లం.'' అన్నారు. అనంతరం 8 నుంచి 11వ తరగతి వరకు తాను చదువుకున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి భావోద్వేగానికి లోనయ్యారు. చదువుకునే రోజుల్లో తానున్న కుంతల కుమారీ ఆదివాసీ హాస్టల్‌ను సందర్శించారు. 13 మంది చిన్ననాటి మిత్రులను కలుసుకున్నారు.

న్యాయమూర్తుల నియామకంలో జాప్యమా?

- కొలీజియం సిఫార్సులు పెండింగా?
- కేంద్రం తీరుపై సుప్రీం అసంతృప్తి

న్యూఢిల్లీ: ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకానికి చేసిన సిఫార్సులను కేంద్రం పెండింగ్‌లో పెట్టడం పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కొలీజియం సిఫార్సులపైనా నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. జడ్జీలుగా చేరకుండా నిరుత్సాహపర్చేలా వ్యవహరించవద్దని సూచించింది. పేర్లను చాలాకాలం పెండింగ్‌లో పెట్టడం ద్వారా వారి అంగీకారాన్ని బలవంతంగా వెనక్కి తీసుకొనేలా చేయడం సమంజసం కాదంది. ఉన్నత న్యాయ స్థానాల్లో ఖాళీలను నిర్దేశిత గడువులోగా భర్తీ చేయడానికి టైమ్‌ఫ్రేమ్ ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వును కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ బెంగళూరు అడ్వొకేట్స్ అసోసియేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషన్‌పై స్పందించాలని ఆదేశిస్తూ కేంద్ర న్యాయ శాఖ కార్యదర్శికి నోటీసు జారీ చేసింది. కొలీజియం సిఫార్సు చేసిన 11 పేర్లు ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. కొలీజియం ఏకగ్రీవంగా సిఫార్సు చేస్తే నాలుగు వారాల్లోగా న్యాయమూర్తులుగా నియమించాలని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు గత ఏడాది ఏప్రిల్‌లో ఉత్తర్వు జారీ చేసింది.

నర్వ్ స్టిమ్యులేషన్‌తో... పక్షవాతానికి చెక్!



జెనీవా: పక్షవాత రోగులకు శుభవార్త. నర్వ్ స్టిమ్యులేషన్ చికిత్స, మెరుగైన ఫిజియోథెరపీ ద్వారా పక్షవాతానికి చెక్ పెట్టడంలో వైద్య పరిశోధక బృందం విజయం సాధించింది. తొమ్మిది మంది పక్షవాత రోగులు ఈ రెండు చికిత్సల ద్వారా పూర్తిగా కోలుకుని తిరిగి నడవగలిగారు! వీరంతా వెన్నుముక తీవ్రంగా దెబ్బతినడం వల్ల పక్షవాతం బారిన పడ్డవారే! ఈ ప్రయోగాత్మక చికిత్స ఫలితం పట్ల పరిశోధకులు, వైద్యులు ఆనందం, ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ ప్రయోగం...

'స్విస్ రీసెర్చ్ గ్రూప్ న్యూరో రీసెర్చ్' అనే పరిశోధక బృందం ఇటీవల ఓ ప్రయోగం జరిపింది. దీన్ని తొలుత ఎలుకలపై జరిపిన అనంతరం మనుషులను ఎన్నుకుంది. వీరంతా ప్రమాదాల్లో నడకకు తోడ్పడే వెన్నెముక చివరి భాగంలోని కీలక నరాల సమూహమైన లంబార్ న్యూరాన్లు దెబ్బతిన్నవారే. దాంతో నడివాల్సిందిగా మెదడు ఇచ్చే ఆదేశాలు కాళ్లను చేరవు. ఫలితం...? శాశ్వత పక్షవాతం! ఇలాంటి 9 మంది రోగులకు స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లాసెన్నేకు చెందిన క్లాడియా కేథీ అనే న్యూరో సైంటిస్ట్ బృందం ఎపిడ్యూరల్ ఎలక్ట్రికల్ స్టిమ్యులేషన్ ఇచ్చింది. తద్వారా నడకకు తోడ్పడే నరాలను ఉద్దీపింపజేసింది. ఇందుకోసం శస్త్రచికిత్స ద్వారా వెన్నుపాములో న్యూరో ట్రాన్స్‌మిటర్ అమర్చారు. దాని ద్వారా వెన్నెముక ఉత్తేజితమయ్యేలా చూశారు. దీంతోపాటు రొబొటిక్ ప్రక్రియలతో ఫిజియోథెరపీ అందిస్తూ వచ్చారు. వారిని పలు దిశల్లో కదిలించడంతోపాటు నడిపించారు. దాంతో రోగులు ఐదు నెలల్లోనే నడవడం ,వాకర్ సాయంతో మెట్లెక్కడం మొదలుపెట్టారు.

కొత్త మార్గం దొరికినట్టే...

ఎలుకలపై నిర్వహించిన అధ్యయనం ఆధారంగా ఆర్ఎన్ఏ సీక్వెన్సింగ్‌తో పాటు అక్కడి కణజాలం పనితీరుపై స్పేషియల్ ట్రాన్స్‌క్రిప్టోమెటిక్స్ టెక్నిక్ సాయంతో కేథీ బృందం అవగాహనకు వచ్చింది. ''వెన్నెముకకు గాయమయ్యాక కోలుకునేందుకు ఎస్సీ బీఎస్ఎక్స్2, హెచ్ఓఎక్స్10 అనే న్యూరాన్లతో తయారైన కణజాలం సాయపడుతుందని గుర్తించాం. బ్రెయిన్‌స్టెమ్ నుంచి అందే ఆదేశాలను అమల్లో పెట్టేందుకు వీలుగా ఈ నాడీ కణజాలం చాలా విలక్షణమైన రీతిలో అమరి ఉంది. నడకకు అవే దోహదపడ్డాయి'' అని కేథీ వివరించారు. అయితే, 'అత్యంత సంక్లిష్టమైన ఈ ప్రక్రియలో ఇది భాగం మాత్రమే. ఇంకా తెలుసుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. ఎస్సీ టు ద పవర్ ఆఫ్ బీఎస్ఎక్స్2, హెచ్ఓఎక్స్10 కణజాలం పక్షవాతం తర్వాత కోలుకుని నడకకు దోహదపడే ప్రాథమిక అంశాలన్నది మా పరిశోధనలో తేలింది. పక్షవాత చికిత్సలో కొత్త పద్ధతులకు ఈ అవగాహన మార్గాలు తెరిచినట్టే'' అంటూ ముక్తాయించారు.

రష్యా పీఛేముడ్!

ఉక్రెయిన్‌లోని ఖెర్సన్ నుంచి వెనక్కు



మైకోలైవ్: ఉక్రెయిన్‌తో పోరులో రష్యాకు అవమానకరమైన రీతిలో మరో ఎదురుదెబ్బ తగిలింది. ఎనిమిదిన్నర నెలల యుద్ధంలో స్వాధీనం చేసుకున్న ఏకైక ప్రాంతీయ రాజధాని ఖెర్సన్‌ను కూడా వదిలేసుకుంది. శుక్రవారం ఉదయం 5 గంటల సమయానికి ఖెర్సన్ నగరం సహా నీపర్ నది పశ్చిమ తీరం నుంచి తమ బలగాలను పూర్తిగా ఉపసంహరించుకున్నట్లు రష్యా రక్షణ శాఖ పేర్కొంది. మిలటరీ సామగ్రిని కూడా వెనక్కి తరలించినట్లు వెల్లడించింది. తాజా పరిణామాన్ని అధ్యక్షుడు పుతిన్ ఇబ్బందికరంగా భావించడం లేదని, ఖెర్సన్ ఇప్పటికీ తమదేనని రష్యా అధికార ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఖెర్సన్, మరో మూడు ప్రాంతాలు తమవేనంటూ నెల క్రితం రష్యా ప్రకటించుకున్న విషయం తెలిసిందే. రష్యా ఆర్మీ పూర్తి స్థాయి ఉపసంహరణకు కనీసం మరో వారం పట్టొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. రష్యా ఆర్మీ వెళ్లిపోయిన ఖెర్సన్‌లో పౌరులు ఉక్రెయిన్ జాతీయ జెండాలను ఎగురవేసి, హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఖెర్సన్ ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితి కష్టతరంగా ఉందంటూ అంతకుముందు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొనడం గమనార్హం. ఇటీవల తమ ఆర్మీ తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలపైకి రష్యా దాడులు కొనసాగుతుండటాన్ని ఆయన ప్రస్తావించారు. రష్యా బలగాలు దొంగచాటున దాడులకు పాల్పడే ప్రమాదముందని, ఖెర్సన్‌ను ల్యాండ్‌మైన్లతో మృత్యునగరంగా మార్చేశారని ఉక్రెయిన్ అధికారులు అంటున్నారు. ఖెర్సన్‌పై పట్టుసాధించిన ఉక్రెయిన్ ఆర్మీ రష్యా ఆక్రమణలోని క్రిమియా తదితర దక్షిణ ప్రాంతాలపైకి దృష్టి సారించనుంది. ఉక్రెయిన్ సైన్యానికి, సరఫరాల రవాణాకు తీరప్రాంత ఖెర్సన్ ఒబ్లాస్ట్ రాజధాని ఖెర్సన్ నగరం వ్యూహాత్మకంగా చాలా కీలకంగా మారింది.

రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

- ఏఎన్‌యూలో 3 రోజుల పాటు నిర్వహణ

ఏఎన్‌యూ : ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరగనున్న ఆరో రాష్ట్ర స్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీలను ఏపీ ప్రభుత్వ సీసీఎల్‌ఏ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు విధి నిర్వహణతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం ముఖ్యమని, క్రీడల ద్వారానే వాటిని పొందగలమని చెప్పారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, డిప్యూటీ కలెక్టర్ పీవీ సింధు ప్రసంగిస్తూ గెలుపోటముల కంటే గెలవాలనే స్ఫూర్తి, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వాణీమోహన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మచంద్రారెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, శాప్ ఎండీ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఏపీ ఎన్జీవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న సీసీఎల్‌ఏ సాయిప్రసాద్, పక్కన పీవీ సింధు తదితరులు

ఆర్టీసీ బస్సులో గంజాయి తరలింపు

- ముగ్గురి అరెస్టు
- నిందితుల్లో ఆర్టీసీ కండక్టర్

గూడెంకొత్తవీధి (అల్లూరి సీతారామ రాజు జిల్లా): ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం స్థానిక పోలీసులు అరెస్టు చేయగా.. మరో వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. డొంకరాయి నుంచి పాడేరు వెళ్లే ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఉదయం 7.30 గంటల సమయంలో గూడెంకొత్తవీధి కూడలిలో వాహన తనిఖీ చేపట్టారు. బస్సును ఆపి తనిఖీ చేయగా మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా మదీనా మసీద్ ప్రాంతానికి చెందిన ముబారక్ బేగ్‌జాఫర్ (27), అదే ప్రాంతానికి చెందిన సలీం సహాఫరీమ్ (48) గంజాయితో పట్టుబడ్డారు. ఇదే సమయంలో దుప్పిలవాడ పంచాయతీ బందవీధి గ్రామానికి చెందిన కిలో అప్పారావు పరారైనట్లు పోలీసులు తెలిపారు. కాగా, చింతపల్లి వరకు గంజాయిని చేర్చాలని ముందుగా నిందితులు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తమ దర్యాప్తులో తేలడంతో పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ అచ్చుతరాజు (61)ని అరెస్టు చేసినట్లు సీఐ అశోక్ కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి వెల్లడించారు. నిందితుల నుంచి 31 కిలోల గంజాయి, రూ.3,900, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరు పరిచామని సీఐ చెప్పారు.

ప్రకృతి సేద్యమే శ్రేయస్కరం

మైసూరు, సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ప్రకృతి నియమాలను అర్థం చేసుకొని అందుకు అనుగుణంగా వ్యవసాయం చేసుకోవటమే దేశంలోని రైతులకు, ప్రజలకు, పర్యావరణానికి మేలని జాతీయ కిసాన్ స్వరాజ్ సమ్మేళనంలో వక్తలు పిలుపునిచ్చారు. అలయన్స్ ఫర్ సస్టయినబుల్ అండ్ హోలిస్టిక్ అగ్రికల్చర్ (ఆషా) ఆధ్వర్యంలో ద్వైవార్షిక సమ్మేళనం శుక్రవారం ఇక్కడ ప్రారంభమైంది. 3 రోజుల పాటు జరగనున్న ఈ సమ్మేళనంలో దేశం నలు మూలల నుంచి తరలి వచ్చిన 1,949 మంది సేంద్రియ/ప్రకృతి వ్యవసాయదారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారు. సమ్మేళనం ప్రారంభ సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మైసూరు మహారాజా వారసుడు యదువీర్ కేసీ వడయార్ మాట్లాడుతూ.. పర్యావరణ సుస్థిరత లేకుండా వ్యవసాయం ముందుకు సాగదన్నారు. ఈ మౌలిక అంశాన్ని విధానాల రూపకల్పనలో, పాలనలో పాలకులు దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని కేరళ వ్యవసాయ మంత్రి పి.ప్రసాద్ అన్నారు. కార్బన్ న్యూట్రల్ గ్రామాలను రూపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దేశీ విత్తన పరిరక్షకురాలు ఒడిశాకు చెందిన సబర్మతి, పద్మశ్రీ పురస్కార గ్రహీత, సీనియర్ సేంద్రియ రైతు భరత్‌భూషణ్ త్యాగి, ఆషా జాతీయ కన్వీనర్ కురుగంటి కవిత ప్రసంగించారు.

పేదలకు ఇళ్లు నిర్మిస్తే పన్నుల్లో పదిశాతం రాయితీ

- ఏపీ బిల్డింగ్ రూల్స్‌ను సవరించిన ప్రభుత్వం
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో పేదలు కొనుగోలుచేసే అవకాశం ఉండేలా 45, 60 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మిస్తే.. ఆ ప్రాజెక్టుకు చెల్లించాల్సిన పన్నుల్లో పదిశాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా ఇళ్లు నిర్మిస్తే సంబంధిత గృహ నిర్మాణ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చిన దానికంటే మరో అంతస్తు అదనంగా నిర్మించుకునే వెసులుబాటు కల్పించనుంది. ఈ మేరకు ఏపీ బిల్డింగ్ రూల్స్–2017ను సవరిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

13 అడుగుల ఫైబర్ గ్లాస్‌తో మోదీ విగ్రహం



ప్రధాని మోదీ 13 అడుగుల ఫైబర్ గ్లాస్ విగ్రహాన్ని గుంటూరు జిల్లా తెనాలిలోని సూర్యశిల్పశాల నిర్వాహకులు రూపొందించారు. దీనిని బెంగళూరులో ప్రతిష్ఠించనున్నారు. తెనాలి ప్రజల సందర్శనార్థం ఈ విగ్రహాన్ని శుక్రవారం శిల్పశాల ఎదుట ఉంచగా.. ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ సందర్శించారు.

- తెనాలి

'చిన్ని'కృష్ణుడు



అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన లక్కబొమ్మల కళాకారుడు శ్రీశైలపు వినయ్ నాలుగు సెంటీమీటర్ల పొడవుతో శ్రీకృష్ణుడు ప్రతిమను తయారు చేసి అబ్బురపరిచాడు. చెక్క, లక్క, పెయింట్‌తో ఒక రోజులో 'చిన్ని' కృష్ణయ్యను తయారు చేసినట్లు వినయ్ తెలిపాడు. గతంలో గోరంత చెక్కపై దుర్గాదేవి ప్రతిమ తయారు చేసినట్లు పేర్కొన్నాడు.

- యలమంచిలి

క్లుప్తంగా

'ఉపాధి'లో సాఫ్ట్‌వేర్ సమస్యలకు చెక్!

- 17, 18 తేదీల్లో సిబ్బందితో ఎన్‌ఐసీ అధికారుల భేటీ

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం అమల్లో ఎదురవుతున్న సాఫ్ట్‌వేర్, ఇతర సాంకేతిక సమస్యల పరిష్కారంపై కేంద్ర అధికారులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా 17, 18 తేదీల్లో కేంద్ర ఎన్‌ఐసీ అధికారుల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశమై నూతన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించనున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను ప్రారంభించిన తర్వాత మొదట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాత్రమే ఈ పథకాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో అమలు చేసింది. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఆ తర్వాత ఆరేడు ఏళ్లకు కేంద్ర, గ్రామీణాభివృద్ధి శాఖ దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం అమలు కోసం ఎన్‌ఐసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి అమలు చేస్తోంది. గతేడాది నవంబర్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కూడా కేంద్రం పరిధిలోని సాఫ్ట్‌వేర్ ద్వారానే అమలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్ నుంచి కేంద్ర ప్రభుత్వ పోర్టల్ పరిధిలోకి మారాక కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో కేంద్ర అధికారులు సాఫ్ట్‌వేర్, ఇతర సాంకేతిక అంశాలపై తాడేపల్లిలోని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో అవగాహన కల్పించనున్నారు.

ఉక్కు ఉద్యోగులు విధుల బహిష్కరణ

- విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్



దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

కూర్మన్నపాలెం (గాజువాక): విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్ ప్లాంట్ ఉద్యోగ, కార్మికులు శుక్రవారం విధులు బహిష్కరించారు. కుటుంబ సభ్యులతో కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే దీక్షల్లో కూర్చున్నారు. శుక్రవారం నాటికి 638వ రోజుకు దీక్షలు చేరాయి. ప్రధాని పర్యటన నేపథ్యంలో శిబిరం వద్దకు పోలీసు బలగాలు చేరుకుని ముందస్తు చర్యగా కార్మిక సంఘాల నేతలను, మహిళలు సుమారు 50 మందిని అరెస్ట్ చేసి పెందుర్తి, సబ్బవరం తదితర పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దీక్షల్లో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

బలపడిన అల్పపీడనం!

- నేడు, రేపు పలుచోట్ల వర్షాలు

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి/వాకాడు: నైరుతి బంగాళాఖాతంలో ఈశాన్య శ్రీలంక వద్ద కొనసాగుతున్న అల్పపీడనం శుక్రవారం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో శని, ఆదివారాల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర కోస్తాంధ్రలో తేలికపాటి వానలు కురుస్తాయని, ఆదివారం పొడి వాతావరణం నెలకొంటుందని వివరించింది. కోస్తా తీరం వెంబడి గంటకు 40–45, గరిష్ఠంగా 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, శనివారం మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని సూచించింది. అల్పపీడన ప్రభావంతో తిరుపతి జిల్లా సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఎగసి పడుతున్నాయి. సముద్రం దాదాపు 10 మీటర్లు వరకు ముందుకు చొచ్చుకొచ్చింది. మరోవైపు ఈనెల 16న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది.

'అగ్నికుల్ కాస్మోస్'కు ఫ్లైట్ టెర్మినేషన్ సిస్టమ్

- అందజేసిన ఇస్రో

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దేశీయంగా అంతరిక్ష రంగంలో నూతన శకానికి నాంది పలుకుతోంది. ప్రైవేట్ సంస్థలకు చెందిన రాకెట్ ప్రయోగాలతో పాటుగా రాకెట్‌లోని విడి భాగాలను కూడా ప్రైవేట్ సంస్థలకు అందజేసి ప్రైవేట్‌గా ప్రయోగాల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా స్పేస్ టెక్నాలజీలో చెన్నై కేంద్రంగా స్టార్టప్ కంపెనీ అయిన అగ్నికుల్ కాస్మోస్ అనే సంస్థకు ఇన్–స్పేస్ మద్దతుతో ఇస్రో తొలిసారిగా ఫ్లైట్ టెర్మినేషన్ సిస్టమ్ (ఎఫ్‌టీఎస్)ను అందజేసింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, ఇన్–స్పేస్ బృందాల సమక్షంలో అగ్నికుల్ సంస్థకు చెందిన ప్రయోగ వాహనం ''అగ్నిబాన్''లో ఇంటర్ ఫేసింగ్, హ్యాండ్లింగ్ సిస్టమ్‌లను ఉపయోగించడం కోసం అధికారిక అప్పగింత కార్యక్రమం జరిగినట్లు ఇస్రో ప్రకటించింది. భారత్‌లో నిర్మిస్తోన్న ప్రైవేట్ లాంచింగ్ వెహికల్స్‌కు ప్రోత్సాహకంగా రాకెట్‌లోని కొన్ని విడిభాగాలను సరఫరా చేయడం కూడా ఇదే తొలిసారి కావడం విశేషం.



కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం ముంజులూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్



అనంతపురం జిల్లా పిన్నేపల్లెలో వృద్ధురాలికి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

మన ప్రభుత్వం



ఏలూరు జిల్లా పంగిడిగూడెంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా



నంద్యాల జిల్లా చిత్రేనిపల్లెలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆయిల్‌పామ్ రైతుల్లో ఆనందం

పుంజుకోనున్న నూనెగింజల సేకరణ ధరలు.. ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ కృషి

- దిగుమతి సుంకం పునరుద్ధరణకు కేంద్రానికి సీఎం వైఎస్ జగన్ లేఖ
- దిగుమతులపై 11 శాతం సుంకం విధిస్తూ గెజిట్ నోటిఫికేషన్
- 10 శాతం మేర పెరగనున్న నూనెగింజల ధరలు
- ప్రస్తుతం రూ.13 వేలు పలుకుతున్న ఆయిల్‌పామ్ గెలల ధర
- సుంకం విధింపుతో రూ.2 వేల వరకు పెరిగే అవకాశం



పామ్ ఆయిల్ తోటలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలితంగా ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర నూనెగింజల సేకరణ ధరలు మళ్లీ పుంజుకోనున్నాయి. రైతుల మోముల్లో చిరునవ్వులు విరబూయనున్నాయి. క్రూడ్ ఆయిల్ దిగుమతులపై సుంకాన్ని పునరుద్ధరించడంతో వారు సంతోషిస్తున్నారు. రాష్ట్రంలో వేరుశనగ, సోయాబీన్, నువ్వులు, ఆముదం, పొద్దుతిరుగుడు వంటి నూనెగింజల పంటలు రెండు సీజన్లలో కలిపి 24.70 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ప్రధానంగా 20.55 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగవుతుంది. రాష్ట్రంలో 4.52 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోంది. ఏటా 27.69 లక్షల టన్నుల నూనెగింజల దిగుబడులొస్తుండగా, వాటిలో ఆయిల్‌పామ్ దిగుబడే 15 లక్షల టన్నులకుపైగా ఉంటోంది. ఆయిల్‌పామ్ సాగువిస్తీర్ణం, దిగుబడుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ 1 స్థానంలో ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయిల్‌పామ్ రైతులకు మహర్దశ పట్టింది. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను చెల్లించడంతో పాటు తెలంగాణ కంటే మిన్నగా ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో(ఓఈఆర్) ఇచ్చేలా జీవో ఇవ్వడంతో ఆయిల్‌పామ్ సేకరణ ధరలు ఒక్కసారిగా మూడు రెట్లు పెరిగాయి. ఫలితంగా రూ.7 వేలకు మించి పలకని టన్ను ధర ఏకంగా రూ.24 వేలకు చేరింది. ఆయిల్‌పామ్ రైతులు లాభాలబాట పట్టారు. గత బకాయిలతోపాటు పెంచిన ఓఈఆర్ ఫలితంగా రూ.700 కోట్లకుపైగా లబ్ధిపొందారు.

అన్ని నూనెగింజల ధరలు పెరిగే అవకాశం

ఉక్రెయిన్ యుద్ధ ఫలితంగా ఒక్కసారిగా ఆకాశానికి ఎగబాకిన వంటనూనెల ధరలను నియంత్రించేందుకు క్రూడ్ ఆయిల్ దిగుమతులపై ఉన్న సుంకాన్ని కేంద్రం రద్దుచేసింది. దీంతో వంటనూనెల ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దేశీయంగా ఆయిల్ సీడ్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపింది. నూనెగింజల సేకరణ ధరలు అమాంతం పడిపోవడంతో పరిస్థితిని ఆయిల్‌పామ్ రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితి కుదుటపడినందున సుంకం రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆయన కేంద్రానికి లేఖ రాశారు. ప్రత్యేక ప్రతినిధి బృందం ద్వారా కేంద్ర వ్యవసాయ, వాణిజ్య, ఆర్థిక, విదేశీ వ్యవహారాల శాఖలతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మరోవైపు రాష్ట్ర, జాతీయ ఆయిల్‌పామ్ రైతుసంఘాల నేతలు కూడా తమవంతు కృషిచేశారు. ఫలితంగా క్రూడ్ ఆయిల్ దిగుమతులపై 11 శాతం సుంకాన్ని విధిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో దిగుమతులు కాస్త తగ్గనుండడంతో దేశీయంగా ఆయిల్ సీడ్ మార్కెట్ పుంజుకోనుంది. కనీసం 10 శాతం మేర సేకరణ ధరలు పెరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. రూ.24 వేలకుపైగా పలికిన టన్ను ఆయిల్ పామ్ ధర ప్రస్తుతం రూ.13 వేలు పలుకుతోంది. సుంకం రద్దు నేపథ్యంలో టన్నుకు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో మరో ప్రధాన పంట వేరుశనగ కనీస మద్దతు ధర రూ.5,850 కాగా.. ప్రస్తుతం క్వింటాల్ రూ.4,800 నుంచి రూ.5,200 పలుకుతోంది. తాజా నిర్ణయంతో రూ.వెయ్యికిపైగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదేరీతిలో మిగిలిన నూనెగింజల ధరలు కూడా పెరిగే సూచనలున్నాయి.

ముఖ్యమంత్రి కృషి ఫలితంగానే



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒత్తిడి ఫలితంగానే కేంద్రం క్రూడ్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించింది. ఫలితంగా ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర నూనెగింజల సేకరణ ధరలు పెరగనున్నాయి. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేశాం. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల నష్టపోయిన రైతులకు రూ.85 కోట్లు చెల్లించాం. తెలంగాణకు దీటుగా ఏటా ఓఈఆర్ ప్రకటిస్తూ రైతులను ఆదుకుంటున్నాం.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

సీఎంకు రుణపడి ఉంటాం



సుంకం రద్దు వల్ల రేటు పతనమవుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి లేఖ రాశారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రత్యేక బృందాన్ని కూడా పంపారు. మరోవైపు మేము కూడా కేంద్ర మంత్రులను కలిసి పరిస్థితిని వివరించాం. రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సంప్రదింపుల ఫలితంగా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించారు. సీఎంకు రుణపడి ఉంటాం.

– క్రాంతికుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, జాతీయ ఆయిల్‌పామ్ రైతుల సంఘం

రూ.700 కోట్ల లబ్ధి



గతప్రభుత్వ నిర్వాకం వల్ల నష్టపోయిన రైతులకు రూ.85 కోట్లు చెల్లించడమే కాదు.. ఏటా క్రమం తప్పకుండా ప్రకటిస్తున్న ఓఈఆర్ వల్ల మూడేళ్లలో ఆయిల్ పామ్ రైతులకు రూ.700 కోట్ల మేర లబ్ధికలిగింది. అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలతో ముడిపడి ఉన్నందున.. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు డైనమిక్ ఇంపోర్ట్ డ్యూటీ మెకానిజం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– బొబ్బ వీరరాఘవరావు, అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతుల సంఘం

పెనమలూరు తహసీల్దార్‌పై ఏసీబీ కేసు

- ఏకకాలంలో పలుచోట్ల సోదాలు
- ఆదాయానికి మించి రూ.2 కోట్ల ఆస్తి గుర్తింపు



తహసీల్దార్ భద్రు

పెనమలూరు/రెడ్డిగూడెం/ఎ.కొండూరు: కృష్ణా జిల్లా పెనమలూరు తహసీల్దార్ జి.భద్రుపై అవినీతి నిరోధకశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఫిర్యాదుతో శుక్రవారం ఏకకాలంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆయన కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఆదాయానికి మించి రూ.రెండుకోట్ల ఆస్తులు గుర్తించారు. ఏసీబీ అధికారుల కథనం మేరకు.. తహసీల్దార్ జి.భద్రు అక్రమార్జన, అక్రమాస్తులు కూడబెట్టారన్న సమాచారంతో కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ తీసుకుని ఆయన కార్యాలయంతోపాటు కానూరులోని మనోహరి అపార్టుమెంట్‌లో ఆయన నివసిస్తున్న ఫ్లాట్, గుంటుపల్లి, పోరంకి, కొండపల్లి, ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల, రెడ్డిగూడెం మండలం కుదప తండా తదితర ప్రాంతాల్లోని బంధువులు, మిత్రుల ఇళ్లలో సోదాలు చేశారు. భద్రు పేరున ఒక ఫ్లాట్, ఒక ఇల్లు, ఒక ఖాళీస్థలం, 17.35 ఎకరాల వ్యవసాయ భూమి, విలాసవంతమైన కారు, రెండు మోటారు సైకిళ్లు, బంగారం, వెండి కలిపి మొత్తం రూ.2,54,90,170 విలువైన ఆస్తులున్నట్లు గుర్తించారు. వీటిలో రూ.2 కోట్ల మేర అక్రమాస్తులని నిర్ధారించారు. కుదప తండాలో భద్రు బావమరుదులు, స్నేహితుల నివాసాల్లో ఏసీబీ సీఐలు సీహెచ్.రవిబాబు, వి.సురేష్‌బాబు తొమ్మిదిచోట్ల తనిఖీలు చేశారు. పలు రికార్డులు, ఆస్తుల వివరాలు పరిశీలించారు. కుమ్మరికుంట్లలో భద్రు సోదరుడు జి.చంటి ఇంట్లో భద్రు కుటుంబానికి సంబంధించిన విలువైన ఒరిజినల్ డాక్యుమెంట్లను గుర్తించారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు ఈ సోదాలు జరిగాయి. సుమారు రూ.30 లక్షల ఆస్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ సీఐ నాగరాజు తెలిపారు. సోదాలు పూర్తయిన తరువాత అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ నుంచి..

ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్లకు చెందిన భద్రు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి.. క్రమంగా డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొందారు. 2011లో తహసీల్దార్ అయ్యారు. మొవ్వ, తోట్లవల్లూరు, ఉయ్యూరు మండలాల్లో పనిచేశారు.

జనవరి 27 నుంచి లోకేష్ పాదయాత్ర

- కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు యాత్ర
- రూట్ మ్యాప్ కూడా సిద్ధంగా ఉందంటున్న టీడీపీ వర్గాలు

సాక్షి, అమరావతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వచ్చే ఏడాది జనవరి 27 నుంచి పాదయాత్ర చేయనున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు ఆ పార్టీ నేతలు మీడియాకు లీకు ఇచ్చారు. లోకేష్ పాదయాత్ర చేయనున్నట్లు గతంలోనే స్పష్టమైనా ఎప్పటి నుంచి చేస్తారనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. తాజాగా ముహూర్తం ఖరారైనట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నుంచి యాత్ర ప్రారంభం కానుంది. అక్కడి నుంచి పలు జిల్లాల మీదుగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర సాగుతుందని టీడీపీ నేతలు తెలిపారు. ఏడాది పాటు పాదయాత్ర ఉంటుందని చెబుతున్నారు. ఈ మేరకు పాదయాత్ర రూట్ మ్యాప్ కూడా సిద్ధమైందని అంటున్నారు.

పార్టీలోనే భిన్నాభిప్రాయాలు..

నారా లోకేష్ పాదయాత్రపై టీడీపీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనే ఆయన యాత్రకు సిద్ధమైనా కొందరు సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేయడంతో వెనక్కితగ్గారు. లోకేష్ పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయం, సమావేశాల్లో తరచూ అభాసుపాలవడం వంటి అనేక అంశాలను దృష్టిలో ఉంచుకుని సీనియర్లు ఆయన యాత్రను వ్యతిరేకించారనే వార్తలు వచ్చాయి.


చంద్రబాబు యాత్ర చేయాలి..

పార్టీని బతికించుకోవాలంటే చంద్రబాబు కనీసం బస్సు యాత్ర వంటివి చేసినా ప్రజల్లో ఎంతో కొంత స్పందన ఉంటుందనే అభిప్రాయం సీనియర్లలో వ్యక్తమైందని సమాచారం. ఈ నేపథ్యంలోనే లోకేష్ యాత్ర విషయంలో చంద్రబాబు ఎటూ తేల్చలేకపోవడంతో వాయిదా పడుతూ వచ్చిందని చెబుతున్నారు. తాజాగా చంద్రబాబుపై కుటుంబ సభ్యుల ద్వారా తీవ్ర ఒత్తిడి తెచ్చిన లోకేష్ యాత్రకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఆర్థిక వికాసం

నవరత్నాలకు తోడు భారీగా బ్యాంకు రుణాలు

- మూడేళ్లల్లో ఏకంగా రూ.48,690 కోట్ల అదనపు రుణాలు
- స్వయం ఉపాధికి బాటలు వేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి : గత మూడేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధి చేకూర్చడమే కాకుండా, మరో వైపు ఆయా వర్గాల వారి స్వయం ఉపాధి, జీవనోపాధి మెరుగు కోసం బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు మంజూరు చేయిస్తోంది. బలహీన వర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకుల ద్వారా రుణాల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ వర్గాల వారి కోసం ఈ మూడేళ్లలో ఏకంగా రూ.48,690 కోట్ల మేర బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి. చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి అవసరమైన రుణాలు ఆయా వర్గాలకు అందించేందుకు ప్రభుత్వ అధికారులు, బ్యాంకు అధికారులు తరచూ సబ్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గత మూడేళ్లలో ఎస్సీ, ఎస్టీల రుణాల మంజూరు వృద్ధి 53 శాతం, బడుగు బలహీన వర్గాల రుణాల మంజూరు వృద్ధి 32 శాతం మేర పెరిగిందని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ తాజా నివేదిక స్పష్టం చేసింది. 2019–20లో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన రుణాల మొత్తం విలువ రూ.15,791 కోట్లు కాగా, అది 2021–22 నాటికి రూ.28,577 కోట్లకు చేరింది. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన రుణాల్లో 2019–20లో ఏడు శాతం వృద్ధి నమోదైతే, ఆ తర్వాత రెండేళ్ల వరుసగా 18 శాతం, 53 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం. గత మూడేళ్లలో బలహీన వర్గాల రుణాలు రూ.90,624 కోట్ల నుంచి రూ.1,26,528 కోట్లకు చేరాయి. కోవిడ్ వేళ పేదలను ప్రభుత్వం నవరత్నాల పథకాలతో ఆదుకోవడమే కాకుండా, ఆ వర్గాలకు బ్యాంకుల ద్వారా వివిధ పథకాల కింద భారీగా రుణాలిప్పించింది. దీనివల్లే రుణమంజూరులో భారీ వృద్ధి నమోదైనట్లు బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి.

పథకాలతో చేయూత

వైఎస్సార్ బడుగు వికాసం, జగనన్న తోడు, పీఎం ముద్ర, పీఎం స్వనిధి, స్టాండప్ ఇండియా వంటి పథకాల ద్వారా బడుగులకు బ్యాంకులు భారీగా రుణాలిచ్చాయి. జగనన్న తోడు పథకం కింద చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి రెండు దశల్లో 9.05 లక్షల మందికి రుణాలిచ్చాయి. ఈ ఏడాది మూడో దశలో ఏకంగా 9 లక్షల మందికి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇప్పటికే 5.10 లక్షల మందికి మంజూరు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రుణాలకు వడ్డీ చెల్లింపుల కింద ఇప్పటికే రూ.32.51 కోట్లు బ్యాంకులకు చెల్లించడం ద్వారా 7.06 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలిగింది.

ఎస్సీ పారిశ్రామికవేత్తల్లో వికాసం



నవరత్నాల ద్వారా ఆర్థిక సహాయాన్ని నేరుగా ఎస్సీ, ఎస్టీల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది. మరోవైపు వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, సమాజంలో గౌరవ ప్రదమైన స్థానం కల్పించేందుకు సీఎం జగన్ శ్రద్ధ చూపుతున్నారు. ఇందుకోసం 'జగనన్న బడుగు వికాసం' పేరుతో పరిశ్రమలు నెలకొల్పేందుకు బ్యాంకుల ద్వారా రుణాలిస్తున్నారు. పరిశ్రమల కోసం కొనుగోలు చేసే భూమికి సైతం 50 శాతం సబ్సిడీ ఇస్తున్న ఘనత ఏపీ ప్రభుత్వానిదే.

– పెరికే వరప్రసాదరావు, జాతీయ అధ్యక్షుడు, ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్

వెన్నెముక వర్గాలుగా తీర్చిదిద్దుతున్నారు



రాష్ట్రంలో ప్రస్తుతం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నేరుగా లబ్ధి చేకూరుతోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే గొప్ప రికార్డు. గత ప్రభుత్వ హయాంలో సిఫారసులు, జన్మభూమి కమిటీల పేరుతో తమ పార్టీ అనుయాయులకే సంక్షేమ, సబ్సిడీ పథకాలు దక్కేవి. అందుకు భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకాలు అందిస్తోంది. దీంతో పాటు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు, ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుండటం గొప్ప విషయం. ప్రస్తుత ప్రభుత్వం బీసీ యువతకు ట్రక్కులు, ఇతర వాహనాలకు, స్వయం ఉపాధికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించింది. ప్రధానంగా రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్న వెనుకబడిన వర్గాలను వెన్నెముక వర్గాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది.

– డాక్టర్ ఎన్.మారేష్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ బీసీ సంఘం

అడవి బిడ్డలకు అన్ని విధాలా అండ



అడవినే నమ్ముకుని బతికే గిరిజనులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. ప్రధానంగా అడవి బిడ్డలకు అటవీ హక్కులు కల్పించి, వారి ఉపాధి మెరుగు పరిచేలా సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చొరవ అభినందనీయం. అడవుల్లో గిరిజనులు సేకరించిన అటవీ ఫలసాయానికి గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా మద్దతు ధర కల్పించి అండగా నిలిచారు. ప్రజల ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించేందుకు ఉపయోగించే ట్రక్కులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 90 శాతం సబ్సిడీతో అందించి ఉపాధి కల్పించడం గొప్ప విషయం. ఎస్టీలకు ఇంకా అనేక రూపాల్లో బ్యాంకు సబ్సిడీ రుణాలు అందించారు. ఇలా ఆదుకోవడంలో సీఎం వైఎస్ జగన్ తర్వాతే ఎవరైనా.

– కేసీ పెంచలయ్య, రాష్ట్ర కార్యదర్శి, యానాదుల సంక్షేమ సంఘం

మా కౌంటర్ పరిశీలించాకే మధ్యంతర ఉత్తర్వులివ్వాలి

సమీకరించిన భూములపై ప్రభుత్వం, సీఆర్‌డీఏలదే అధికారం.. హైకోర్టులో అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించే నిమిత్తం తీసుకొచ్చిన కొత్త సవరణ చట్టం విషయంలో తమ కౌంటర్‌ను పరిశీలించకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఓ చట్టం చట్టబద్ధతను సవాలు చేసినప్పుడు మధ్యంతర ఉత్తర్వుల జారీకి వీల్లేదని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని తెలిపారు. సీఆర్‌డీఏ చట్టానికి సవరణలు చేస్తూ తెచ్చిన చట్టాన్ని, గెజిట్‌ను సవాలు చేస్తూ అమరావతి రైతు సంఘాలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యాజ్యాల్లో ప్రజా ప్రయోజనాల్లేవని, ప్రభుత్వ చర్యల్లో ప్రజా ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ఇళ్ల స్థలాల మంజూరు ఇప్పటికిప్పుడు పూర్తయ్యే ప్రక్రియ కాదని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌కు సవరణలపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నామన్నారు. అభ్యంతరాల పరిశీలనకే నాలుగు వారాలు పడుతుందని, ఆ తరువాతే గెజిట్ నోటిఫికేషన్ జారీ, ఇళ్ల స్థలాల కేటాయింపు ఉంటాయని చెప్పారు. రైతుల నుంచి సమీకరించిన భూములపై ప్రభుత్వం, సీఆర్‌డీఏకు మాత్రమే అధికారం ఉందన్నారు.

ప్రభుత్వం కూడా 20వేల ఎకరాలు ఇచ్చింది

అనంతరం సీఆర్‌డీఏ తరఫున ఎస్‌జీపీ కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టణ ప్రాంతాల్లో భూములిస్తోందని, రాజధాని ప్రాంతం మినహాయింపు కాదన్నారు. సమీకరించిన భూమిలో 5 శాతం పేదల ఇళ్ల నిర్మాణానికి ఇవ్వొచ్చని సీఆర్‌డీఏ చట్టం చెబుతోందన్నారు. రాజధాని కోసం రైతులే కాదు.. రాష్ట్ర ప్రభుత్వం కూడా 20 వేల ఎకరాలిచ్చిందన్నారు. రాజధాని ప్రాంత ప్రణాళికలు, అభివృద్ధిలో రైతులకు ఎలాంటి పాత్ర లేదని తెలిపారు. చట్ట ప్రకారం ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉందే తప్ప, రైతుల నుంచి కాదన్నారు. సీఆర్‌డీఏ వందల ఎకరాలు పలు విద్యా, వ్యాపార సంస్థలకు కేటాయించిందని, ధరలో రాయితీ కూడా ఇచ్చిందన్నారు. ఇప్పుడు ప్రభుత్వం మరింత ఎక్కువ రాయితీతో పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే అభ్యంతరం చెప్పడం విస్మయం కలిగిస్తోందన్నారు. రాజధాని నిర్మాణాల పూరికి సీఆర్‌డీఏ వద్ద నిధుల్లేవని, ప్లాట్ల విక్రయం ద్వారా నిధులు సేకరించాల్సి ఉందన్నారు. సచివాలయం, హైకోర్టు, రాజ్‌భవన్ నిర్మాణానికి కేంద్రం నామమాత్రపు నిధులే ఇచ్చిందని, వీటితో అప్పటి ప్రభుత్వం తాత్కాలిక నిర్మాణాలే చేపట్టిందన్నారు.

స్టేను తీవ్రంగా వ్యతిరేకించిన ఏఏజీ

ఇళ్ల స్థలాల కేటాయింపుపై ముందుకెళ్లకుండా స్టేటస్ కో ఉత్తర్వులు, మాస్టర్ ప్లాన్‌ను సవరించకుండా స్టే ఇవ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరగా.. ఏఏజీ సుధాకర్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ కౌంటర్ లేకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి వీల్లేదని గట్టిగా చెప్పారు. తమ కౌంటర్‌ను పరిశీలించిన తరువాత ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చన్నారు. దీంతో ఈ నెల 21లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వం, సీఆర్‌డీఏలను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది.

సుపారీ ఇచ్చి.. అన్నను చంపించి..

• తెలంగాణ

- తమ్ముడి అఘాయిత్యం
- ఎకరం భూ వివాదమే కారణం
- అయిదుగురు హంతకుల అరెస్ట్

కామారెడ్డి క్రైం : భూ వివాదం అన్నదమ్ముల మధ్య కక్షలు రగిలించింది. ఎకరం భూమి విషయంలో అన్నపై తమ్ముడు కక్ష పెంచుకున్నాడు. హంతకులకు సుపారీ ఇచ్చి అన్నను హత్య చేయించాడు. వారం రోజుల క్రితం మాచారెడ్డి మండలం పాల్వంచ మర్రి వద్ద సంచలనం రేపిన నిమ్మ మల్లయ్య హత్య కేసును పోలీసులు ఛేదించారు. అయిదుగురిని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి విలేకరులకు వెల్లడించిన వివరాలివి. మాచారెడ్డి మండలం యెల్పుగొండ గ్రామానికి చెందిన నిమ్మ మల్లయ్య (48) వ్యవసాయం చేస్తుండేవాడు. అతనికి తమ్ముడు నర్సింలుతో చాలా రోజులుగా ఎకరం భూమికి సంబంధించి వివాదాలున్నాయి. ఈనెల 4న రాత్రి మల్లయ్య తన బంధువైన చిన్నరాములుతో కలిసి పాల్వంచమర్రి దారిలో ఉన్న వ్యవసాయ క్షేత్రం వద్ద మాట్లాడుతుండగా కొందరు వ్యక్తులు దాడి చేశారు. మల్లయ్యను దారుణంగా గొంతుకోసి హత్య చేశారు. అడ్డువచ్చిన చిన్నరాములుపై కూడా దాడి చేయడంతో అతనికి గాయాలయ్యాయి. ఘటన స్థలంలో లభించిన మద్యం సీసాలు, సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు కేసును పరిశోధించారు. అనుమానితుడైన అల్లెపు రమేష్‌ను పట్టుకుని విచారించగా మొత్తం వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో హత్యకు పథకం రచించిన ప్రధాన నిందితుడైన మృతుని తమ్ముడు నర్సింలు, సుపారీ తీసుకుని హత్య చేసిన పల్లపు రమేష్, అల్లెపు రమేష్, పల్లపు శ్రీకాంత్, యేల దేవరాజ్‌లను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.


రూ.80 వేల సుపారీకి ఒప్పందం

నిందితుడు అల్లెపు రమేశ్ గతంలో ఐదు దొంగతనాలు, అత్యాచారం, హత్యకేసుల్లో జైలుకు వెళ్లివచ్చాడు. రూ.80 వేలకు సుపారీ తీసుకుని మల్లయ్య హత్యకు ఒప్పందం చేసుకున్నాడు. రూ.30 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. అల్లెపు రమేష్ తన ఇద్దరు బావమరుదులు పల్లపు రమేష్, పల్లపు శ్రీకాంత్‌లతో కలిసి రెక్కీ నిర్వహించి మల్లయ్యపై దాడి చేశారు. కర్రలతో తలమీద ఇద్దరు కొట్టగా పల్లపు రమేష్ కత్తితో గొంతుకోశాడు. అక్కడి నుంచి వారంతా పరారయ్యారు. పల్లపు రమేష్, పల్లపు శ్రీకాంత్‌లపై చెరో ఆరు చోరీ కేసులున్నాయి. దేవరాజు పీపుల్స్‌వార్ సానుభూతి పరుడిగా పనిచేశాడు. అతనిపై కూడా పలు కేసులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రూ.26,500, ఆరు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన కత్తి, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును పరిశోధించిన డీఎస్పీ సోమనాథం, రూరల్ సీఐ శ్రీనివాస్, మాచారెడ్డి ఎస్‌ఐ సంతోష్‌కుమార్, రామారెడ్డి ఎస్‌ఐ అనిల్‌కుమార్ తదితరులను ఎస్పీ అభినందించారు.

హిరమండలం ఎత్తిపోతలకు శ్రీకారం

రూ.135.85 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం

- లంప్సమ్ ఓపెన్ విధానంలో ఏడాదిలో పూర్తిచేయాలని నిబంధన
- టెండర్ షెడ్యూలు దాఖలుకు ఈనెల 22 వరకు గడువు
- 23న సాంకేతిక బిడ్, 30న ఆర్థిక బిడ్ తెరవనున్న అధికారులు
- 30నే రివర్స్ టెండరింగ్ నిర్వహణ
- తక్కువ ధరకు కోట్‌చేసిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించనున్న జలవనరుల శాఖ
- వంశధార స్టేజ్–2 ఫేజ్–2 ఆయకట్టు రైతులకు ముందస్తు ఫలాలు... ఉద్దానం ప్రాంతానికి తాగునీరు అందించడమే లక్ష్యం



సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్రలో వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు స్టేజ్–2 ఫేజ్–2 ఆయకట్టు రైతులకు ముందస్తు పూర్తిఫలాలు అందించడం, ఉద్దానం ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా హిరమండలం ఎత్తిపోతల పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ఎత్తిపోతల పనులకు రూ.135.85 కోట్ల అంచనా వ్యయంతో లంప్సమ్ ఓపెన్ విధానంలో టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. ఏడాదిలోగా పనులు పూర్తిచేయాలని గడువు పెట్టింది. టెండర్ షెడ్యూలు దాఖలు చేయడానికి ఈ నెల 22 తుది గడువు. వంశధార ప్రాజెక్టు ఎస్ఈ 23న సాంకేతిక బిడ్‌ను తెరుస్తారు. 30న ఉదయం 11 గంటలకు ఆర్థిక బిడ్ తెరిచి, తక్కువ ధరకు కోట్‌చేసిన విలువనే అంచనా వ్యయంగా పరిగణించి అదేరోజు మధ్యాహ్నం రెండుగంటల నుంచి రివర్స్ టెండరింగ్ నిర్వహిస్తారు. తక్కువ ధరకు పనులు చేయడానికి ముందుకొచ్చిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించనున్నారు.

గొట్టా బ్యారేజ్ వద్ద మిగులు జలాల వినియోగం కోసం

వంశధార నదిలో గొట్టా బ్యారేజ్ వద్ద 105 టీఎంసీల లభ్యత ఉన్నట్లు 2007లో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తేల్చింది. ఇందులో రాష్ట్ర వాటా 52.5 టీఎంసీలు. వంశధార స్టేజ్–1, స్టేజ్–2ల ద్వారా 34.611 టీఎంసీలను మాత్రమే వినియోగించుకుంటున్నారు. ఇంకా రాష్ట్ర వాటాలో 17.439 టీఎంసీలను వాడుకోవడానికి అవకాశం ఉంది. ఆ నీటిని వాడుకోవడానికి వంశధార స్టేజ్–2 ఫేజ్–2ను జలయజ్ఞంలో భాగంగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. ఈ ప్రాజెక్టుపై ఒడిశా సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో నేరడి బ్యారేజ్ స్థానంలో కాట్రగడ్డ వద్ద సైడ్ వియర్‌ను నిర్మించి వరద కాలువ ద్వారా హిరమండలం రిజర్వాయర్ (19.5 టీఎంసీల సామర్థ్యం)కు మళ్లించి వంశధార పాత ఆయకట్టు 2,10,510 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతోపాటు కొత్తగా 45 వేల ఎకరాలకు నీళ్లందించే పనులను చేపట్టారు. సైడ్ వియర్ వల్ల 8 టీఎంసీలను మాత్రమే హిరమండలం రిజర్వాయర్‌కు తరలించవచ్చు. నేరడి బ్యారేజ్‌కు వంశధార ట్రిబ్యునల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కానీ ట్రిబ్యునల్ తీర్పుపై ఒడిశా సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో దాన్ని కేంద్రం నోటిఫై చేయలేదు. ఈ నేపథ్యంలో నేరడి బ్యారేజ్ నిర్మాణానికి ఒడిశా సర్కార్‌ను ఒప్పించడం కోసం భువనేశ్వర్ వెళ్లిన సీఎం వైఎస్ జగన్.. ఆ రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్‌తో దౌత్యం జరిపారు. ఓవైపు నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటూనే, మరోవైపు ప్రాజెక్టు ముందస్తు ఫలాలను అందించడం కోసం గొట్టా బ్యారేజ్ నుంచి రోజుకు 1,400 క్యూసెక్కుల చొప్పున వందరోజుల్లో 10 నుంచి 14 టీఎంసీలను తరలించేలా ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. దీంతో అధికారులు ఈ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు.

కరెంటుతో జాగ్రత్త!

- దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రాణాలు తీస్తున్న విద్యుత్
- వానలు, ఈదురుగాలులతో విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం
- వ్యవసాయ బావుల వద్ద సరైన వైరింగ్ లేక ప్రాణాలు కోల్పోతున్న రైతులు, కూలీలు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా నాలుగేళ్లలో 41,914 విద్యుత్ ప్రమాదాలు సంభవించగా.. మహారాష్ట్ర 10,698, ఉత్తరప్రదేశ్ 9,970, గుజరాత్ 3,767 ప్రమాదాలతో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. మన రాష్ట్రంలో అదే నాలుగేళ్లలో 2,922 ప్రమాదాలు జరిగాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో విద్యుత్ ప్రమాదాల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ వీటిని సైతం నివారించాలంటే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు. కొన్ని జాగ్రతలు పాటిస్తే పెనుప్రమాదం నుంచి బయటపడవచ్చని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

వ్యవసాయ పంపుసెట్లకు మోటార్ స్టార్టర్లు, స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ చేయించాలి. తడి చేతులతో, నీటిలో నిలబడి విద్యుత్ మోటార్లను, స్విచ్‌లను, పరికరాలను తాకకూడదు. ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేయడానికి విద్యుత్ అర్హత గల ఎలక్ట్రీషియన్‌ను పిలిపించాలి. పొలాల్లో తెగిపడిన, జారిపడి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండి.. 1912 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సంబంధిత విద్యుత్ సిబ్బందికి గానీ, గ్రామ సచివాలయాల్లో ఉన్న ఎనర్జీ సహాయకులకు గానీ ఫిర్యాదు చేయాలి. పంటను జంతువుల బారినుంచి రక్షించేందుకు పెట్టే ఫెన్సింగులకు విద్యుత్ సరఫరా చేయకూడదు. పాడైన విద్యుత్ వైర్లను ఇన్సులేషన్ టేపుతో చుట్టాలి. వాహనాలపై విద్యుత్ తీగలు తగిలితే బయట పడేందుకు హాపింగ్ (గెంతుట, దుముకుట) విధానం అనుసరించాలి. అంతేతప్ప ఒక కాలు వాహనంలోనూ, మరో కాలు నేలపైనా ఉంచకూడదు. వర్షం వచ్చిన సమయంలో విద్యుత్ స్తంభాలను తాకరాదు. నీటిలో పడిన విద్యుత్ వైర్ల జోలికి వెళ్లకూడదు. స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మూత్ర విసర్జన చేయకూడదు. విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటారుకు మధ్య ఎక్కువ దూరం ఉండకుండా చూసుకోవాలి. ఎక్కువ దూరం ఉంటే గాలులు వీచినప్పుడు వాటి మధ్య ఉండే సర్వీస్ వైరు వదులై మోటారుపై ప్రభావం చూపుతుంది. విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు కరెంటు నేరుగా సరఫరా కాకుండా మధ్యలో ఫ్యూజ్ బ్యాక్, స్టార్టర్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. మోటార్ వద్ద ఫ్యూజ్‌లు, ఇండికేటర్ బల్బులు, స్టార్టర్‌ను చెక్కపై బిగించుకోవాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇనుప డబ్బాపై బిగించకూడదు. భవనాలు, బహిరంగ ప్రదేశాల్లో విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఉన్నట్టు గుర్తిస్తే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలి.

అద్దెకివ్వండి.. ఆదాయం పొందండి!



అప్పుల ఊబి నుంచి డిస్కంలను గట్టెక్కించేందుకు కేంద్రం దిశానిర్దేశం

- విద్యుత్ పంపిణీ, సరఫరా వ్యవస్థలను అద్దెకివ్వాలని ఆదేశం
- ట్రాన్స్‌కో, డిస్కంల విద్యుత్ లైన్లను లీజుకివ్వాలని సూచన
- పెరిగిపోతున్న డిస్కంల అప్పులను పూడ్చుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గం

సాక్షి, అమరావతి : విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వం మొదలుపెట్టిన సంస్కరణల్లో భాగంగా మరో ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల అప్పులు రూ.1.32 లక్షల కోట్లకు చేరడంతో వాటి వసూలుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్న కేంద్రం.. తాజాగా రాష్ట్రాలకు ఓ మార్గాన్ని చూపింది. గతేడాది అమల్లోకి తెచ్చిన ఎలక్ట్రిసిటీరూల్స్–2021(ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ ప్లానింగ్, డెవలప్‌మెంట్ అండ్ రికవరీ ఆఫ్ ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జెస్)కు కొనసాగింపుగా మరికొన్ని నిబంధనలను ప్రవేశపెడుతూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. తద్వారా రాష్ట్రాలు తమ ఆధీనంలోని విద్యుత్ సరఫరా నెట్‌వర్క్‌ను అమ్ముకునేందుకు, ఇతరుల నుంచి కొనుక్కునేందుకు, లీజుకు ఇవ్వడానికి అవకాశం కల్పించింది. ఈ వెసులుబాట్లతో విద్యుత్ సంస్థలు ఆదాయాన్ని ఆర్జించి అప్పుల ఊబి నుంచి బయటపడతాయని కేంద్రం చెబుతోంది.

నెట్‌వర్క్ సమస్యకు చెక్

ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్(ఏపీ ట్రాన్స్‌కో)కు ప్రస్తుతం 5,532.161 సీకేఎం(సర్క్యూట్ కిలోమీటర్ల) మేర 400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌లు, 12,200.9 సీకేఎం మేర 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్‌లు, 13,568.18 సీకేఎం మేర 132 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఉన్నాయి. మొత్తంగా 400 కేవీ, 220 కేవీ,132 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు 354 ఉండగా, వాటి ద్వారా రాష్ట్రంలోని తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థలకు ఏడాదికి సగటున 70 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్పొరేషన్ యాజమాన్యంలోని అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ లైన్లను ప్రయివేటుకు ఇచ్చేందుకు వీలు కల్పిస్తూ కేంద్రం మార్గదర్శకాలు విడుదల చేసింది. డిస్కంల ఆధీనంలోని ట్రాన్స్‌మిషన్ లైన్ల లీజుకు అవకాశం కల్పించింది. దీని ప్రకారం ప్రస్తుతం ఉన్న లైన్లను అద్దె ప్రాతిపదికన ఇకపై ఎవరికైనా ఇవ్వొచ్చు. భవిష్యత్‌లో రానున్న ప్రైవేటు డిస్కంలకు నెట్‌వర్క్ సమస్యలు రాకుండా చూడటం దీని ప్రధాన ఉద్దేశం.

ఆర్థిక భారం నుంచి విముక్తి

కంపెనీలు తాము ఉత్పత్తి చేసే విద్యుత్‌ను పవర్ గ్రిడ్‌కు అనుసంధానిస్తాయి. దానిని అమ్ముకునేందుకు ట్రాన్స్ మిషన్ నెట్‌వర్క్‌ను వినియోగించుకుంటాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'పవర్ గ్రిడ్ కార్పొరేషన్' దేశమంతటా ట్రాన్స్‌మిషన్ నిర్మించి నిర్వహిస్తోంది. ప్రస్తుతం కంపెనీల ఒప్పందాల(పీపీఏ)ను ఆధారంగా చూపి ఈ అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను వినియోగించుకోవడం కోసం(లాంగ్ టర్మ్ యాక్సెస్) విద్యుత్ సంస్థలు పవర్ గ్రిడ్‌కు దరఖాస్తు పెట్టుకుంటున్నాయి. అయితే కేంద్రం లాంగ్‌టర్మ్ యాక్సెస్‌కు బదులు జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్(జీఎన్ఏ) అనే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో అవసరాలకు తగ్గట్టు ట్రాన్స్‌మిషన్ లైన్లను ఇతరులకు ఇవ్వడం, ఇతరుల నుంచి వాడుకోవడం వంటివి స్వల్ప, మధ్యకాలిక ఒప్పందాల ద్వారా చేయొచ్చు. దీనివల్ల ఆదాయం వచ్చి అప్పులు కొంత మేర తీరుతాయి. ఇకపై ట్రాన్స్‌మిషన్ లైన్లను ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో నిర్మించాలని కేంద్రం చెప్పింది. దీనివల్ల కొంతకాలం తర్వాత ఈ లైన్లు ప్రభుత్వ ఆధీనంలోకొస్తాయి. ప్రైవేటు వారి పెట్టుబడి వెనక్కి వచ్చేంత వరకూ లైన్లను వినియోగించుకునే డిస్కంలు నిర్ణీత చార్జీలు చెల్లిస్తాయి. తద్వారా ట్రాన్స్‌కో, డిస్కంలపై ఆర్థిక భారం తప్పుతుంది.

గురుస్వామి మృతి తీరనిలోటు



జగన్నాథ గురుస్వామికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: బొబ్బిలి చుట్టుపక్కల ప్రాంతాల్లో మెడికల్ గురుస్వామిగా చిరపరిచితులైన భద్రగిరి జగన్నాథస్వామి హఠాన్మరణం ఆధ్యాత్మిక వాదులందరికీ తీరనిలోటని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా జగన్నాథస్వామి మృత దేహానికి నివాళులర్పించారు. అలాగే మున్సిపల్ మాజీ చైర్మన్ ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, తదితరులు నివాళులర్పించారు.

సమష్టికృషితో ప్రగతిపథం

మెంటాడ: సిబ్బంది సమష్టి కృషితో కష్టమర్లకు అంకితభావంతో కూడిన సేవలు అందించడం వల్ల కార్పొరేషన్ బ్యాంక్ ప్రగతిపథంలో దూసుకుపోతుందని బ్యాంక్ మేనేజర్ రావివలస చంటి తెలిపారు. మండల కేంద్రంలోని కార్పొరేషన్ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బి.చిట్టిబాబు, గంగ్రేటి చంద్రిక దీప్తి, మురళీ, దేవతరాజు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధరతో సమానంగా పరిహారం

మెంటాడ: బహిరంగ మార్కెట్ ధర ప్రకారమే గిరిజనవర్సిటీకి భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలని ఏపీ రైతుసంఘం ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కుంటినవలస సచివాలయం ఎదురుగా స్థానిక రైతులతో కలిసి శుక్రవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగులో ఉన్న భూములకు పంట నష్టం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘ జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, వ్యవసాయ సంఘ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, సర్పంచ్ పెదిరెడ్ల రమేష్‌నాయుడు, యాంద్రాపు సింహాచలం, ఆర్.వెంకట్రావ్, ఎం.గణేష్, పి.సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రాచబాట

గ్రీన్‌ఫీల్డ్ హైవే సాగేదిలా.....	
పార్వతీపురం మన్యం జిల్లాలో....	
మండలం	గ్రామాలు
పాచిపెంట	ఆలూరు, కొటికిపెంట, గారెల్లవలస, మాతుమూరు, సరయవలస, గురివినాయుడపేట, మోసూరు
విజయనగరం జిల్లాలో.....	
మండలం	గ్రామాలు
రామభద్రపురం	పెదచెలగాం, రావివలస, ఎనుబారువు, కొండకెంగువ, చందాపురం
మెంటాడ	పులిగుమ్మి, పోరంలోవ, ఉద్దంగి, బుచ్చిరాజుపేట, గురమ్మవలస, జక్కువ, జయతి, అమరయ్యవలస, మెంటాడ
గజపతినగరం	కొనిస
బొండపల్లి	దేవుపల్లి, గ్రహపతి అగ్రహారం, మరువాడ, కొత్తపాలెం, గుమడాం
గంట్యాడ	పెదమజ్జిపాలెం, గింజేరు, కొండతామరపల్లి, కొర్లాం, పొల్లంకి, పెంట శ్రీరామపురం, వసంత్
జామి	తాండ్రంగి, జన్నివలస, జామి, జద్దేతివలస, గోడికొమ్ము, అలమండ, సిరికిపాలెం
లక్కవరపుకోట	భీమాలి, నిడిగట్టు
కొత్తవలస	చిన్నిపాలెం, రాయపురాజుపురం, వీరభద్రపురం, చీపురువలస, గులివిందాడ, దెందేరు, సంతపాలెం
అనకాపల్లి జిల్లాలో...	
మండలం	గ్రామాలు
సబ్బవరం	మొగలిపురం, గుల్లిపల్లి, సబ్బవరం



జామి మండలం అలమండ గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే

- రాయ్‌పూర్–విశాఖ మధ్య 6 లైన్ల జాతీయ రహదారి నిర్మాణం
- నేడు ప్రధాని మోదీ, సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన
- ఇటు విశాఖనగరం అటు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానం
- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అభివృద్ధికి వీచిక
- ఇరు జిల్లాల్లో పారిశ్రామిక ప్రగతికి, చౌక రవాణాకు దోహదం
- 2024 సంవత్సరంలోగా ఎన్‌హెచ్ నిర్మాణం పూర్తి చేయాలనేది లక్ష్యం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే... ఇటు రాష్ట్ర పరిపాలనా రాజధాని కానున్న విశాఖనగరాన్ని అటు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌ను అనుసంధానం చేసే జాతీయ రహదారి. ఒడిశా మీదుగా పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలను కలుపుతూ సాకారం కానుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విశాఖలో జరిగే కార్యక్రమంలో దీనికి శంకుస్థాపన చేయనున్నారు.

రెండు ఓడరేవులతో విశాఖ నగరం జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్గో కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది. దీన్ని మరింత విస్తృతం చేసి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేయాలనే ఉద్దేశంతో రాయ్‌పూర్–విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం నాంది పలికింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) తలపెట్టింది. మూడు రాష్ట్రాలను అనుసంధానిస్తూ 464 కిమీ పొడవున నిర్మాణం కానుంది. విశాఖసహా మన మూడు జిల్లాల్లోనే రూ.3,215.81 కోట్ల అంచనా వ్యయంతో దాదాపు వంద కిలోమీటర్ల పొడవున నిర్మాణ పనులు చేపడుతున్నారు. అందులో పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోనే దాదాపు 90 కిలోమీటర్ల పొడవున నిర్మాణమవుతోంది. అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం నుంచి పాచిపెంట మండలం వరకూ వరకూ వంద కిలోమీటర్ల పొడవున నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ ప్రక్రియ దాదాపుగా కొలిక్కి వచ్చింది. ప్రైవేట్ భూమికి సంబంధించి రైతులకు నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ కూడా వేగవంతమైంది. దీంతో ప్రభుత్వ భూమి సహా 502.557 హెక్టార్ల భూమిని అధికారులు నిర్మాణ సంస్థకు ఇప్పటికే స్వాధీనం చేశారు. మరోవైపు ఇరు జిల్లాల్లోనూ ఐదు చోట్ల ఇంటర్ చేంజింగ్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి భూసేకరణ కూడా అధికారులు దాదాపుగా పూర్తి చేశారు. 2024 సంవత్సరం నాటికి ఈ ఎక్స్‌ప్రెస్ హేవేను పూర్తి చేయాలనేది లక్ష్యం.



జామి మండలం జేడీవలసలో వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం వంతెన నిర్మాణ పనులు

విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

- రక్తహీనతను అధిగమించాలి
- జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ



మాట్లాడుతున్న సమన్వయ అధికారి రామకృష్ణ

విజయనగరం అర్బన్: విద్యతో పాటు ఆరోగ్యానికి బాల్యం నుంచి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా సామాజిక, పరివర్తన సమాచార వ్యవస్థ సమన్వయ అధికారి జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని నేషనల్ స్కూల్‌లో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, జంక ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, రక్తహీనత, పౌష్టికాహారం, మంచి అలవాట్లు, ఉన్నత లక్ష్యాలు తదితర అంశాలపై వివరించారు. రక్తహీనత ఉన్న విద్యార్థులు వేగంగా అలసటకు గురికావడం, నీరసం వంటి లక్షణాలు కలిగి ఉంటారన్నారు. రాష్ట్రంలో బాల్యంలోనే గర్భం దాల్చిన వారిలో 59 శాతం మంది మహిళలు కేవలం రక్తహీనతతో మరణిస్తున్నారని వివరించారు. జంక్ ఫుడ్ గురించి మాట్లాడుతూ పానీపూరీ, పిజ్జా, బర్గర్ వాటిలో టేస్టింగ్ సాల్ట్ పదార్థం వాడుతున్నారని దానివల్ల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎస్ దీపక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్



రికార్డులు తనిఖీ చేస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్

గజపతినగరం: రికార్డుల నిర్వహణ పక్కాగా, పారదర్శకంగా ఉండాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమాజిక తనిఖీలను పరిశీలించారు. 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల్లో పొందుపరిచిన అంశాల్లో చిన్నచిన్న లోటుపాట్లు గుర్తించి సిబ్బందిపై మండిపడ్డారు. రికార్డుల్లో పొందుపరిచిన ప్రతీ అంశం అర్థమయ్యేలా ఉండాల సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కిశోర్‌కుమార్, సీనియర్ పరిపాలన అధికారి పప్పు సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మహిళా మార్ట్‌లు

- మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయడమే లక్ష్యం
- డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి



మాట్లాడుతున్న పీడీ కల్యాణ చక్రవర్తి

బొబ్బిలి: జిల్లాలోని ఎస్.కోట, గరివిడి ప్రాంతాల్లో త్వరలో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. జిల్లాలో సుమారు 45 వేల మంది డ్వాక్రా సభ్యులు ఉన్నారని, వారికి రూ.900 కోట్ల బ్యాంకులింకేజీ రుణాలిచ్చామన్నారు. రుణాల రికవరీ కూడా 91.2 శాతం ఉండం విశేషమన్నారు. రూ.200 కోట్ల స్త్రీ నిధి రుణాలు కూడా మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.70 కోట్ల రుణాలు మంజూరు చేశామని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల కింద మహిళలకు ప్రభుత్వం రూ.1600 కోట్ల ఆర్థిక ప్రయోజనాన్ని కల్పించిందన్నారు. జిల్లాలో తొలి విడతగా 300 మంది మహిళలను పారిశ్రామమిక, వ్యాపార వేత్తలుగా చేయడమే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. మహిళా మార్టుల నిర్మాణానికి రూ.60లక్షల నిధులు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. మహిళలను ఆర్థికంగా సుస్థిరం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు సూచించారు. ఇక్కడి ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీ, ఖాతా నంబర్లు చెప్పమన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేయకూడదన్నారు.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,181	61,795
నిఫ్టీ ▲	321	18,350

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్‌	10,229	▲	115
డోజోన్స్‌	33,509	▽	207
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,318	▽	57
డాక్స్‌	14,225	▲	79
షాంఘై	3,087	▲	51
నికాయ్‌	28,263	▲	817

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో — ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	52,281	▲	767
బంగారం (99.5 స్వచ్ఛత)	52,072	▲	764
వెండి (కిలో)	61,254	▲	54

ఎం అండ్‌ ఎం లాభం జూమ్‌

- క్యూ2లో రూ. 2,773 కోట్లు
- మొత్తం ఆదాయం హైజంప్‌

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్‌ మహీంద్రా(ఎం అండ్‌ ఎం) ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్‌(క్యూ2)లో నికర లాభం 44% జంప్‌చేసి రూ. 2,773 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ.1,929 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 21,470 కోట్ల నుంచి రూ.29,870 కోట్లకు ఎగసింది. ఆటోమోటివ్‌ విభాగం టర్నోవర్‌ రూ.8,245 కోట్ల నుంచి రూ.15,231 కోట్లకు దూసుకెళ్లగా.. వ్యవసాయ పరికరాల బిజినెస్‌ రూ. 6,723 కోట్ల నుంచి రూ.7,506 కోట్లకు బలపడింది. ఇది సరికొత్త రికార్డుకాగా.. ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ ఆదాయం స్వల్ప వృద్ధితో రూ.2,974 కోట్లకు చేరింది.

ఎస్‌యూవీల జోరు: ప్రస్తుత సమీక్షా కాలంలో ఎం అండ్‌ ఎం స్టాండెలోన్‌ నికర లాభం 46% జంప్‌చేసి రూ. 2,090 కోట్లను తాకగా.. మొత్తం ఆదాయం 57% వృద్ధితో రూ. 20,839 కోట్లకు చేరింది. ఈ కాలంలో వాహన విక్రయాలు 75% దూసుకెళ్లి 1,74,098 యూనిట్లను తాకగా, ట్రాక్టర్ల అమ్మకాలు 5% బలపడి 92,590కు చేరాయి. ఎక్స్‌యూవీ 700, స్కార్పియో–ఎన్‌ వాహనాలకు భారీ డిమాండ్‌ వలకల వీటి ఉత్పత్తిని పెంచుతున్నట్లు కంపెనీ ఈడీ రాజేష్‌ జెజూరికర్‌ చెప్పారు. ఈ ఏడాది చివరికల్లా ఎస్‌యూవీ తయారీ సామర్థ్యాన్ని నెలకు 39,000 యూనిట్లకు, తదుపరి వచ్చే ఏడాది చివరికల్లా 49,000 యూనిట్లకు పెంచనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం 2.6 లక్షల యూనిట్లకు బుకింగ్స్‌ ఉన్నట్లు తెలియజేశారు. 2027కల్లా ఎస్‌యూవీల అమ్మకాలలో 20–30 శాతం ఎలక్ట్రిక్‌ వాహనాలు ఆక్రమించవచ్చని అంచనా వేశారు.

ఫలితాల నేపథ్యంలో ఎంఅండ్‌ఎం షేరు 0.8% నీరసించి రూ. 1,287 వద్ద ముగిసింది.

పారిశ్రామిక రంగానికి 'సెప్టెంబర్‌' ఊరట

- ఐఐపీ 3.1 శాతం వృద్ధి
- తయారీ, మైనింగ్, విద్యుత్‌ చేయూత



న్యూఢిల్లీ: పారిశ్రామిక రంగం సెప్టెంబర్‌లో కొంత సానుకూల ఫలితాన్ని సాధించింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) సమీక్షా నెల్లో 3.1 శాతం (2021 ఇదే నెలతో పోల్చి) పెరిగింది. తయారీ, మైనింగ్, విద్యుత్‌ రంగాలు సెప్టెంబర్‌లో మంచి ఫలితాలను అందించినట్లు గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ పేర్కొంది. ఆగస్టులో ఐఐపీలో అసలు వృద్ధిలేకపోగా 0.7% క్షీణతను నమోదుచేసుకుంది. జూలైలో వృద్ధి కేవలం 2.2%. అయితే 2021 సెప్టెంబర్‌లో పారిశ్రామిక వృద్ధి 4.4 శాతంకన్నా, తాజా వృద్ధి రేటు తక్కువగానే ఉండడం గమనార్హం.

■ **తయారీ:** మొత్తం ఐఐపీలో దాదాపు దాదాపు 70 శాతం వెయిటేజ్‌ కలిగిన తయారీ రంగం సమీక్షా నెల్లో 1.8 శాతం పురోగమించింది. 2021 ఇదే నెల్లో వృద్ధి 4.3 శాతం.

■ **విద్యుత్‌:** ఈ రంగం వృద్ధి రేటు 11.6%గా ఉంది. 2021 ఇదే నెల్లో ఈ రేటు కేవలం 0.9%.

■ **మైనింగ్‌:** వృద్ధి 8.6% నుంచి 4.6%కి తగ్గింది.

■ **క్యాపిటల్‌ గూడ్స్‌:** ఉత్పత్తి 10.3 శాతం పెరిగింది. 2021 ఇదే నెల్లో ఈ రేటు 3.3 శాతం.

■ **కన్జూమర్‌ డ్యూరబుల్స్‌:** 4.5% క్షీణించింది. గతేడాది ఈ నెల్లో 1.6% వృద్ధి జరిగింది.

ఆరు నెలల్లో 7 శాతం పురోగతి

కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (2022–23, ఏప్రిల్‌–సెప్టెంబర్‌) ఐఐపీ వృద్ధి రేటు 7 శాతంగా నమోదైంది.

ఎల్‌ఐసీ లాభం అదరహో

క్యూ2లో రూ. 15,952 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్‌ ఇన్సూరెన్స్‌ కార్పొరేషన్‌(ఎల్‌ఐసీ) ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్‌(క్యూ2)లో నికర లాభం 11 రెట్లు దూసుకెళ్లి రూ. 15,952 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 1,434 కోట్లు ఆర్జించింది. ఇందుకు భారీగా పెరిగిన పెట్టుబడుల విక్రయ లాభాలు దోహదం చేశాయి. ఈ కాలంలో మొత్తం ప్రీమియం ఆదాయం 27 శాతం పురోగమించి రూ. 1,32,632 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 1,04,914 కోట్లు మాత్రమే నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 18,72,044 కోట్ల నుంచి రూ. 22,29,489 కోట్లకు జంప్‌చేసింది. వ్యాపార వృద్ధిని ప్రతిఫలించే తొలి ఏడాది ప్రీమియం రూ. 8,198 కోట్ల నుంచి రూ. 9,125 కోట్లకు బలపడింది. రెన్యువల్‌ ప్రీమియం స్వల్ప వృద్ధితో రూ. 56,156 కోట్లకు చేరగా.. సింగిల్‌ ప్రీమియం 62 శాతం అధికమై రూ. 66,901 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌ఐసీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1 శాతం బలపడి రూ. 627 వద్ద ముగిసింది.

హిందాల్కో మిశ్రమ ఫలితాలు

- నికర లాభం రూ.2205 కోట్లు
- ఆదాయం రూ.56,176 కోట్లు



న్యూఢిల్లీ: హిందాల్కో ఇండస్ట్రీస్‌ సెప్టెంబర్‌ త్రైమాసికానికి మిశ్రమ ఫలితాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్‌ లాభం 35 శాతం తగ్గిపోయి రూ.2,205 కోట్లకు పరిమితం కాగా, ఆదాయం మాత్రం 18 శాతం పెరిగి రూ.56,176 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.3,417 కోట్లు, ఆదాయం రూ.47,665 కోట్ల చొప్పున ఉండడం గమనించాలి. మెరుగైన అమ్మకాలు ఆదాయంలో వృద్ధికి తోడ్పడినట్టు కంపెనీ తెలిపింది. రూ.5,743 కోట్ల ఎబిట్డా (పన్నులు, వడ్డీకి ముందస్తు) నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 29 శాతం తక్కువ. ''తయారీ వ్యయాలు పెరగడం, అననుకూల ఆర్థిక పరిస్థితులు ప్రభావం చూపించాయి. కాపర్‌ వ్యాపారంలో మెరుగైన నిర్వహణ పనితీరు, విక్రయాలు బలంగా ఉండడంతో ఈ ప్రభావాన్ని కొంత వరకు అధిగమించగలిగాం''అని హిందాల్కో ఎండీ సతీష్‌ పాయ్‌ తెలిపారు. గత కొన్నేళ్లుగా కంపెనీ వ్యాపారం మరింత బలోపేతంగా, సమగ్రంగా మార్పు చెందడం సవాళ్ల వాతావరణంలోనూ బలమైన ఫలితాలు సాధించేందుకు అనుకూలించినట్టు వివరించారు.

భారీగా తగ్గిన జీవీకే పవర్‌ లాభం

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: జీవీకే పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ సెప్టెంబర్‌ త్రైమాసికం కన్సాలిడేటెడ్‌ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.2,395 కోట్ల నుంచి రూ.154 కోట్లకు పడిపోయింది. వ్యయాలు రూ.182 కోట్ల నుంచి రూ.840 కోట్లకు పెరిగాయి. టర్నోవర్‌ రూ.94 కోట్ల నుంచి రూ.1,012 కోట్లకు చేరింది. క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో జీవీకే పవర్‌ షేరు ధర శుక్రవారం 1.43% పెరిగి రూ.2.84 వద్ద స్థిరపడింది.

జీఎంఆర్‌ పవర్‌ లాభం రూ.1,083 కోట్లు



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ఈపీసీ కంపెనీ జీఎంఆర్‌ పవర్, అర్బన్‌ ఇన్‌ఫ్రా సెప్టెంబర్‌ త్రైమాసికం కన్సాలిడేటెడ్‌ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నాలుగురెట్లు అధికమై రూ.1,083 కోట్లకు చేరింది. టర్నోవర్‌ రూ.1,086 కోట్ల నుంచి రూ.1,627 కోట్లకు ఎగసింది. క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో జీఎంఆర్‌ పవర్‌ షేరు ధర శుక్రవారం 0.85 శాతం పెరిగి రూ.23.85 వద్ద స్థిరపడింది.

గ్లో'బుల్‌' పరుగు..!

- యూఎస్‌లో ద్రవ్యోల్బణం దిగివచ్చిన నేపథ్యం
- ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు
- కలిసొచ్చిన రూపాయి ర్యాలీ
- సెన్సెక్స్‌ లాభం 1,181 పాయింట్లు
- 321 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- రూ.284.46 లక్షల కోట్ల సంపద సృష్టి



ముంబై: ఆర్థిక అగ్రరాజ్యం అమెరికాలో ద్రవ్యోల్బణం దిగిరావడంతో దలాల్‌ స్ట్రీట్‌లో బుల్‌ పరుగులు తీసింది. రూపాయి అనూహ్య రికవరీ, విదేశీ కొనుగోళ్ల ర్యాలీకి మద్దతునిచ్చాయని ట్రేడర్లు తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, మెటల్, రియల్టీ షేర్లు రాణించడంతో బెంచ్‌మార్క్‌ సూచీలు రెండుశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్‌ 1,181 పాయింట్లు పెరిగి 61,795 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 321 పాయింట్లు బలపడి 18,350 వద్ద నిలిచింది. గతేడాది అక్టోబర్‌ 18 తర్వాత ఇరు సూచీలకిది గరిష్ట ముగింపు స్థాయి కావడం విశేషం. నాస్‌డాక్‌ ఇండెక్స్‌ ఏడున్నర శాతం ర్యాలీ చేయడంతో ఐటీ షేర్లకు భారీ గిరాకీ నెలకొంది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,958 కోట్ల షేర్లను, దేశీయ ఇన్వెస్టర్లు రూ.616 కోట్ల షేర్లను కొన్నారు. సెన్సెక్స్‌ మూడు శాతం ర్యాలీతో స్టాక్‌ మార్కెట్లో రూ.2.87 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.284.46 లక్షల కోట్లకు చేరింది. ట్రేడింగ్‌ నాలుగురోజులే జరిగిన ఈ వారంలో సెన్సెక్స్‌ 1,097 పాయింట్లు, నిఫ్టీ 233 పాయింట్లు చొప్పున ర్యాలీ చేశాయి.

లాభాలు ఇందుకే

అమెరికా అక్టోబర్‌ రిటైల్‌ ద్రవ్యోల్బణం అంచనాల కన్నా తక్కువగా నమోదవడంతో ఇకపై ఫెడ్‌ రిజర్వ్‌ కీలక వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే ఆశలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. ఎఫ్‌ఐఐలు ఈ నవంబర్‌ ఎనిమిది ట్రేడింగ్‌ సెషన్లలో రూ.12వేల కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఫారెక్స్‌ మార్కెట్లో రూపాయి బలపడటంతో ఇన్వెస్టర్లకు మరింత ఉత్సాహాన్నిచ్చింది.

అయిదోరోజూ రూపీ పరుగు

రూపాయి పరుగు అయిదోరోజూ కొనసాగింది. డాలర్‌ మారకంలో 62 పైసలు బలపడి 80.78 స్థాయి వద్ద స్థిరపడింది. యూఎస్‌ ద్రవ్యోల్బణం భారీగా దిగిరావడం, డాలర్‌ ఇండెక్స్‌ బలహీనత దేశీయ కరెన్సీ ర్యాలీకి మద్దతుగా నిలిచినట్లు ఫారెక్స్‌ ట్రేడర్లు తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- డిఫెన్స్‌ ఏరోస్పేస్‌ రంగానికి చెందిన డీసీఎక్స్‌ సిస్టమ్స్‌ షేరు లిస్టింగ్‌ రోజే భారీ లాభాలను పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.207)తో పోలిస్తే 38 శాతం ప్రీమియంతో రూ.286 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 55% ర్యాలీ చేసి రూ.320 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 49శాతం లాభంతో రూ.309 వద్ద స్థిరపడింది.
- హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్లు వరుసగా 6%, ఐదుశాతం చొప్పున లాభపడ్డాయి.
- సెప్టెంబర్‌ త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకటన తర్వాత జొమాటో షేరు 14 శాతం లాభపడి రూ.72.80 వద్ద స్థిరపడింది. బీఎస్‌ఈలో మొత్తం 3.19 కోట్ల షేర్లు చేతులు మారాయి.

ఫ్యూచర్‌ రిటైల్‌ రేసులో అంబానీ, అదానీ

బిడ్డింగ్‌లో మొత్తం 13 కంపెనీలు

న్యూఢిల్లీ: రుణభారంతో దివాలా చర్యలు ఎదుర్కొంటున్న ఫ్యూచర్‌ రిటైల్‌ను కొనుగోలు చేసేందుకు పారిశ్రామిక దిగ్గజాలు ముకేశ్‌ అంబానీ, గౌతమ్‌ అదానీ గ్రూప్‌లు సహా 13 కంపెనీలు పోటీపడుతున్నాయి. ఇందుకోసం ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు (ఈవోఐ) దాఖలు చేసిన కంపెనీల్లో ముకేశ్‌ అంబానీకి చెందిన రిలయన్స్‌ రిటైల్‌ వెంచర్స్‌ (ఆర్‌ఆర్‌వీఎల్‌), అదానీ ఎయిర్‌పోర్ట్‌ హోల్డింగ్స్‌.. ఫ్లెమింగో గ్రూప్‌ జాయింట్‌ వెంచర్‌ సంస్థ ఏప్రిల్‌ మూన్‌ రిటైల్‌ కూడా ఉన్నాయి. వీటితో పాటు క్యాప్రి గ్లోబల్‌ హోల్డింగ్స్, యునైటెడ్‌ బయోటెక్, ఎస్‌ఎన్‌వీకే హాస్పిటాలిటీ మొదలైన సంస్థలు ఉన్నట్లు స్టాక్‌ ఎక్స్చేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఫ్యూచర్‌ రిటైల్‌ తెలిపింది. దివాలా ప్రక్రియ కింద కంపెనీ నుంచి రూ. 21,060 కోట్ల మేర బకాయిలు రాబట్టుకునేందుకు ఎస్‌బీఐ, బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా సహా 31 బ్యాంకులు ప్రయత్నిస్తున్నాయి.

కివీస్‌ టూర్‌కు కోచ్‌గా లక్ష్మణ్‌

న్యూజిలాండ్‌లో పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం పర్యటించే భారత జట్టుకు మాజీ ఆటగాడు, జాతీయ క్రికెట్‌ అకాడమీ హెడ్‌ వీవీఎస్‌ లక్ష్మణ్‌ కోచ్‌గా వ్యవహరిస్తాడు. హెడ్‌ కోచ్‌ రాహుల్‌ ద్రవిడ్‌ టి20 వరల్డ్‌ కప్‌ తర్వాత విశ్రాంతి కోరడంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. నవంబర్‌ 18నుంచి జరిగే ఈ పర్యటనలో భారత్, కివీస్‌ మధ్య 3 వన్డేలు, 3 టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. లక్ష్మణ్‌తో పాటు హృషికేశ్‌ కనిత్కర్, సాయిరాజ్‌ బహుతులే కూడా కోచింగ్‌ బృందంలో భాగంగా ఉంటారు. ఈ ఏడాది ఆరంభంలో ఐర్లాండ్, జింబాబ్వే టూర్‌లలో కూడా భారత జట్టు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించిన వీవీఎస్, అండర్‌–19 ప్రపంచ కప్‌లో కూడా భారత యువ జట్టుకు మార్గనిర్దేశనం చేశాడు. సీనియర్‌ ఆటగాళ్లు రోహిత్‌ శర్మ, విరాట్‌ కోహ్లి కూడా విశ్రాంతి తీసుకోవడంతో వన్డేలకు శిఖర్‌ ధావన్, టి20లకు హార్దిక్‌ పాండ్యా కెప్టెన్లుగా వ్యవహరిస్తారు.



కిం కర్తవ్యం?

ఏడాది వ్యవధిలో జరిగిన గత టి20 ప్రపంచకప్‌కు, ఈ సారి టి20 ప్రపంచకప్‌ మధ్య భారత జట్టు ప్రదర్శనలో తేడా ఏముంది... నాడు గ్రూప్‌ దశలో వెనుదిరగ్గా, ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సెమీస్‌ వరకు రాగలిగింది. నాకౌట్‌కు చేరామనే విషయం, పాక్‌పై గెలవడం తప్ప ఓవరాల్‌గా ఆటలో పెద్దగా మార్పేమీ కనిపించలేదు. ఈ రెండు వరల్డ్‌కప్‌ల మధ్య 35 అంతర్జాతీయ టి20లు ఆడిన టీమిండియా ఏకంగా 26 గెలిచి జోరుగా ఆస్ట్రేలియా గడ్డపై అడుగు పెట్టింది. కానీ తుది ఫలితం మాత్రం నిరాశాజనకం. ఈ నేపథ్యంలో వచ్చే వరల్డ్‌కప్‌లో జట్టు రూపురేఖల్లో ఏదైనా మార్పు ఉండవచ్చా, రెండేళ్ల కోసం ఏమైనా కొత్త ప్రయోగాలు ఉంటాయా అనేది ఇప్పుడు చర్చనీయాంశం.



- టి20కి సీనియర్లు దూరమయ్యే అవకాశం
- కుర్రాళ్ల జట్టుతో 2024లో బరిలోకి
- దూకుడే తారకమంత్రంగా ప్రణాళికలు

అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక మెగా ఈవెంట్‌ ముగిసిన తర్వాత అన్ని జట్లలో సహజంగానే కొందరి కెరీర్‌లు ముగుస్తాయి. మంచి విజయాలతో సంతృప్తిగా ముగించేవారు ఒక వైపు...నిరాశగా ఇక సాధించేందుకు ఏమీ లేదని భావనతో మరి కొందరు ఆటకు దూరమవుతారు. ఈ రకంగా చూస్తే టోర్నీలో ఆడిన భారత ప్రస్తుత జట్టు ఎలా ఉండబోతోంది. ముున్ముందు కుర్రాళ్లకు ఎలాంటి అవకాశం దక్కుతుంది. ఆటగాళ్ల టి20 ఫార్మాట్‌ రిటైర్మెంట్‌పై ఇప్పుడే మాట్లాడటం సరి కాదంటూ హెడ్‌ కోచ్‌ రాహుల్‌ ద్రవిడ్‌ దాటవేసినా... వాస్తవం చూస్తే ఈ ఫార్మాట్‌లో పలు మార్పులు మాత్రం ఖాయం.

ఇద్దరు స్టార్లూ కష్టమే...

కోహ్లి, రోహిత్‌ స్టార్లు కావచ్చు గాక...కానీ రెండేళ్ల తర్వాత జరిగే టి20 వరల్డ్‌ కప్‌ వరకు వారు కొనసాగడం సందేహమే. బీసీసీఐ మరీ కఠినంగా వ్యవహరించకపోవచ్చు గానీ వాస్తవం చూస్తే పరిస్థితి భిన్నంగా ఉంది. 2024 సమయానికి రోహిత్‌కు 37, కోహ్లికి 36 ఏళ్లు ఉంటాయి. రోహిత్‌ ఇప్పటికే ఫిట్‌నెస్‌పరంగా చాలా వెనుకబడి ఉన్నాడు. కెప్టెన్‌గా ఈ సారి దక్కిన అవకాశం ఉపయోగించుకోలేకపోయాడు. పైగా ఆటగాడిగా కూడా విఫలమయ్యాడు. రోహిత్‌ కెరీర్‌కు సంబంధించి వన్డే వరల్డ్‌ కప్‌ ఒక లక్ష్యంగా మిగిలింది. ఇప్పటికిప్పుడు కెప్టెన్సీ మార్పు కూడా ఉండదు కాబట్టి వచ్చే ఏడాది స్వదేశంలో జరిగే వన్డే వరల్డ్‌కప్‌లో జట్టును గెలిపిస్తే అతను దిగ్గజాల్లో ఒకడిగా నిలిచిపోతాడు. కాబట్టి పూర్తి ఫోకస్‌ వన్డేలపైనే ఉండవచ్చు. రెండేళ్ల తర్వాత మళ్లీ టి20 కెప్టెన్సీ చేయాలనే ప్రేరణ అతనికి ఏమీ కనిపించడం లేదు. కోహ్లికి ఫిట్‌నెస్‌ సమస్య లేదు కానీ అతను కూడా ఈ ఫార్మాట్‌లో చాలా సాధించేశాడు. వరల్డ్‌ కప్‌ విజేత జట్టులో భాగం కాకపోయినా అదేమీ అతని గొప్పతనాన్ని తగ్గించదు. పైగా వన్డేల్లో 'ఆల్‌టైమ్‌ గ్రేట్‌'లలో ఒకడైన కోహ్లికి స్వదేశంలో వన్డే వరల్డ్‌ కప్‌లో అసాధారణ ప్రభావం చూపించగలడు. బీసీసీఐ అంతర్గత సమాచారం ప్రకారం వీరిద్దరు ఐపీఎల్‌కు మాత్రం పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి. అధికారికంగా రిటైర్మెంట్‌ ప్రకటన చేయకపోవచ్చు గానీ యువ ఆటగాళ్లకు అవకాశం ఇచ్చేందుకు సిరీస్‌లకు దూరమవుతూ వస్తారు.

రాహుల్‌పై వేటు పడుతుందా!

తర్వాతి రెండు సిరీస్‌లలో పేర్లను పరిశీలించకపోవడంతో అశ్విన్, దినేశ్‌ కార్తీక్‌ అంతర్జాతీయ టి20 కెరీర్‌ ముగిసినట్లే అని చెప్పవచ్చు. సుదీర్ఘ విరామం తర్వాత గత వరల్డ్‌కప్‌కు ముందు అనూహ్యంగా అశ్విన్‌ పునరాగమనం చేయగా, ఐపీఎల్‌ ప్రదర్శనతో ఫినిషర్‌ కార్తీక్‌ కెరీర్‌ చివర్లో మళ్లీ దూసుకొచ్చాడు. అయితే వీరిద్దరితో కొత్తగా ప్రయత్నించేందుకు ఏమీ లేదు కాబట్టి ఫార్మాట్‌నుంచి తప్పుకోవడం ఖాయం. ఆఖరి నిమిషంలో జట్టుతో చేరిన మొహమ్మద్‌ షమీ టి20 కెరీర్‌ కూడా ఇక ముందుకు వెళ్లదు. రాహుల్‌ పరిస్థితి మాత్రం కాస్త సందేహాస్పదంగా ఉంది. అటు పూర్తిగా తప్పుకోలేడు, ఇటు గొప్పగా ఆడటం లేదు...ఇలాంటి స్థితిలో అతనిపై వేటు పడవచ్చు. అయితే దేశవాళీ, ఐపీఎల్‌లో మళ్లీ చెలరేగితే పునరాగమనం కూడా సాధ్యమే. కొత్త పేస్‌ బౌలర్లు పోటీనిస్తూ దూసుకొస్తున్న తరుణంలో భువనేశ్వర్‌ కుమార్‌ తన సాధారణ ప్రదర్శనతో ఇంకా ఎంత వరకు జట్టులో కొనసాగగలడో చూడాలి.

వచ్చేది ఎవరు?

రెండేళ్ల తర్వాత పూర్తిగా భిన్నమైన జట్టును మనం చూడవచ్చు. తొలి బంతినుంచి దూకుడు ప్రదర్శిస్తూ విధ్వంసక శైలి ఆటగాళ్లు తమ అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. పృథ్వీ షా, సంజు సామ్సన్‌ ఎలాంటి ప్రత్యర్థిపైనైనా చెలరేగగలరు. పంత్‌ దూకుడు గురించి అందరికీ తెలుసు. కివీస్‌తో సిరీస్‌కు ఎంపికైన శుబ్‌మన్‌ గిల్‌ ఇటీవల ముస్తాక్‌ అలీ ట్రోఫీలో కూడా మెరుపు సెంచరీతో సత్తా చాటారు. స్పిన్‌ ఆల్‌రౌండర్‌గా వాషింగ్టన్‌ సుందర్‌ సరిగ్గా సరిపోతాడు. పేస్‌ విభాగంలోనైతే ఉమ్రాన్‌ మొదలు మొహసిన్‌ వరకు ఎన్నో ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. బుమ్రా ఎలాగూ మళ్లీ జట్టులో చేరతాడు. మరో వైపు 32 ఏళ్ల సూర్యకుమార్‌ కెరీర్‌ ఉచ్ఛదశలో ఉన్నాడు కాబట్టి వచ్చే రెండేళ్ల ప్రణాళికలో కూడా అతను భాగం కావడం ఖాయం. భవిష్యత్తును బట్టి చూస్తే హార్దిక్‌ పాండ్యా కెప్టెన్సీకి అన్ని వైపులనుంచి మద్దతు లభించవచ్చు. ఆల్‌రౌండర్‌గా తన విలువను ప్రదర్శిస్తున్న అతను రోహిత్‌ లేని సమయంలో కెప్టెన్‌గా కూడా రాణిస్తున్నాడు. పైగా ఐపీఎల్‌లో తొలి సారే గుజరాత్‌కు విజేతగా నిలిపిన రికార్డూ ఉంది. కొత్త ప్రణాళికలు, వ్యూహాలు కూడా వంద శాతం ఫలితాలిస్తాయని ఎవరూ చెప్పలేరు. అయితే సెమీస్‌లో ఇంగ్లండ్‌ ఆట చూస్తే టి20లు ఎలా ఆడాలో తెలుస్తుంది. ఆరంభంలో వికెట్లు కాపాడుకొని చివర్లో పరుగులు రాబట్టగలమనే ఆలోచనకన్నా... ఆసాంతం ధాటిని ప్రదర్శించి కొన్ని ఓటము లు ఎదురైనా నష్టం లేదు. పవర్‌ప్లేలో పవర్‌ఫుల్‌ ఆట చూపించే ఇదే దూకుడు సరైన సమయంలో జట్టుకు సత్ఫలితాలు అందించడం మాత్రం ఖాయం.

భవిష్యత్‌ పర్యటన కార్యక్రమం (ఎఫ్‌టీపీ) ప్రకారం భారత జట్టు వచ్చే ఏడాది కేవలం 12 టి20లు మాత్రమే ఆడే అవకాశం ఉంది. 2023లో వన్డే వరల్డ్‌ కప్‌ ఉంది కాబట్టి దానికి సన్నాహకంగా అన్నట్లు 25 వన్డేల్లో టీమిండియా బరిలోకి దిగుతుంది.

–సాక్షి క్రీడావిభాగం

నెదర్లాండ్స్, సెనెగల్‌లపై కన్ను

మరో 8 రోజుల్లో
FIFA WORLD CUP Qatar2022

గ్రూప్‌ 'ఎ'లో ఆతిథ్య ఖతర్‌తో పాటు నెదర్లాండ్స్, సెనెగల్, ఈక్వెడార్‌లు పోటీ పడుతున్నప్పటికీ నాకౌట్‌ అవకాశాలు డచ్, సెనెగల్‌ జట్లకే ఉన్నాయి. ఆసియా చాంపియన్‌ ఖతర్‌ ఆ రెండు జట్లను మించి నాకౌట్‌కు చేరడం అంత సులువేమీ కాదు. అయితే ఘనమైన ఆతిథ్యంతో పాటు టోర్నీలో చక్కని ప్రదర్శనతో ఆకట్టుకోవాలనే లక్ష్యంతో ఖతర్‌ బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో ఎవరి బలాబలాలేంటో పరిశీలిద్దాం

ఖతర్‌

ప్రపంచకప్‌ అత్యుత్తమ ప్రదర్శన: ఇదే తొలిసారి
ఇతర ఘనతలు: ఆసియా కప్‌ విజేత (2019)
ఫిఫా ర్యాంకు: 50
అర్హత: ఆతిథ్య హక్కులతో నేరుగా

సాకర్‌ వరల్డ్‌కప్‌ ఆతిథ్యం కోసం ఖతర్‌ ప్రభుత్వం, పాలకులు తెరముందు, తెరవెనుక ఎంతో చేశారు. అయితే ఖతర్‌ ఫుట్‌బాల్‌ జట్టు కోసం అహర్నిశలు కృషిచేసింది మాత్రం కోచ్‌ ఫెలిక్స్‌ సాంచెజ్‌ మాత్రమే! స్పానిష్‌కు చెందిన 46 ఏళ్ల కోచ్‌ కృషి వల్లే 2019లో ఖతర్‌ ఆసియా కప్‌ సాధించింది. 2006 నుంచి ఆయన జట్టును సానబెడుతూ వచ్చారు. ఈ జట్టులో అక్రమ్‌ అఫీఫ్‌ కీలక ఆటగాడు. నిలకడైన ప్రదర్శనతో రాణిస్తున్నాడు.

నెదర్లాండ్స్‌



ప్రపంచకప్‌ అత్యుత్తమ ప్రదర్శన: మూడు సార్లు రన్నరప్‌ (1974, 1978, 2010)
ఇతర ఘనతలు: యూరోపియన్‌ చాంపియన్‌ (1988)
ఫిఫా ర్యాంకు: 8
అర్హత: యూరోపియన్‌ క్వాలిఫయింగ్‌లో తొలిస్థానం

ఈ గ్రూపులో మేటి జట్టు నెదర్లాండ్స్‌. ఈ సీజన్‌లో మంచి ఫామ్‌లో ఉంది. యూరోపియన్‌ క్వాలిఫయింగ్‌ టోర్నీలో గ్రూప్‌–జిలో అగ్ర స్థానంతో మెగా ఈవెంట్‌కు అర్హత పొందింది. మిడ్‌ఫీల్డర్‌ ఫ్రెంకీ డి జాంగ్‌ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. డిఫెండర్లలో డేలి బ్లిండ్, స్టీఫన్‌ డి రిజ్‌ ప్రత్యర్థి స్ట్రయికర్లను చక్కగా నిలువరిస్తున్నారు. దీంతో ఈ సారి ఫైనల్‌ చేరితే మాత్రం కప్‌ను చేజార్చుకునే ప్రసక్తే లేదనే లక్ష్యంతో ఉంది.

సెనెగల్‌

ప్రపంచకప్‌ అత్యుత్తమ ప్రదర్శన: క్వార్టర్స్‌ (2002)
ఇతర ఘనతలు: ఆఫ్రికన్‌ చాంపియన్స్‌ (2022)
ఫిఫా ర్యాంకు: 18
అర్హత: ప్లే–ఆఫ్స్‌లో ఈజిప్టును ఓడించి ఈ గ్రూపు నుంచి ప్రిక్వార్టర్‌ ఫైనల్‌ చేరే అర్హత ఉన్న రెండో జట్టు సెనెగల్. ఈ ఏడాది ఆఫ్రికన్‌ చాంపియన్‌గా నిలిచింది. స్టార్‌ డిఫెండర్‌ కలిడో కలిబేలి సారథ్యంలోని సెనెగల్‌ ఈసారి మెరుగైన ప్రదర్శన కనబరచాలనే పట్టుదలతో ఉంది. మిడ్‌ఫీల్డర్లలో ఇడ్రిసా గుయె, పేప్‌ గుయె, ఫార్వర్డ్‌లో బౌలయె డియా, హబిబ్‌ డైయలోలు కూడా స్థిరంగా రాణిస్తుండటం జట్టుకు కలిసొచ్చే అంశం. ప్రిక్వార్టర్స్‌ లక్ష్యంగా పెట్టుకున్న సెనెగల్‌ 20 ఏళ్ల క్రితంనాటి క్వార్టర్‌ ప్రదర్శనను మెరుగుపర్చుకోవాలనుకుంటుంది.

ఈక్వెడార్‌

ప్రపంచకప్‌ అత్యుత్తమ ప్రదర్శన: ప్రిక్వార్టర్స్‌ (2006); **ఫిఫా ర్యాంకు:** 44
ఇతర ఘనతలు: కోపా అమెరికా కప్‌లో నాలుగో స్థానం (1959, 1993)
అర్హత: దక్షిణ అమెరికా క్వాలిఫయింగ్‌లో నాలుగో స్థానం

నెదర్లాండ్స్, సెనెగల్‌లతో కనీసం డ్రాతో గట్టెక్కినా అది ఈక్వెడార్‌ గొప్ప ప్రదర్శనే అవుతుంది. సంచలనాలు నమోదైతే తప్ప నాకౌట్‌ చేరడం కష్టం. అర్జెంటీనాకు చెందిన కోచ్‌ గుస్తావో అల్ఫారోకు అక్కడి క్లబ్‌ జట్లను తీర్చిదిద్దిన అనుభవంతో 2020లో ఈక్వెడార్‌ కోచింగ్‌ బాధ్యతలు చేపట్టాడు. కెప్టెన్‌ ఎన్నెర్‌ వాలెన్సియా ఈక్వెడార్‌ తురుపుముక్క. మేజర్‌ ఈవెంట్లలో 35 గోల్స్‌తో ఈక్వెడార్‌ ఆల్‌టైమ్‌ గ్రేట్‌ ఫుట్‌బాలర్లలో ఒకడిగా నిలిచాడు.

–సాక్షి క్రీడావిభాగం

4 స్వర్ణాలు 1 రజతం

ఆసియా బాక్సింగ్‌లో భారత మహిళల జోరు



అమ్మాన్‌ (జోర్డాన్‌): ఆసియా బాక్సింగ్‌ చాంపియన్‌షిప్‌లో భారత మహిళలు ఒకే రోజు ఐదు పతకాలతో మెరిశారు. ఇందులో 4 స్వర్ణాలు కాగా మరొకటి రజతం. లవ్లీనా బొర్గొహైన్, పర్వీన్‌ హుడా, సవీటీ బూరా, అల్ఫియా పఠాన్‌ వేర్వేరు విభాగాల్లో బంగారు పతకాలు గెలుచుకోగా, తొలిసారి ఈ పోటీల బరిలోకి దిగిన మీనాక్షి రజతాన్ని అందుకుంది.

టోక్యో ఒలింపిక్స్‌ కాంస్య పతక విజేత లవ్లీనా 75 కేజీల విభాగం ఫైనల్లో రుజ్‌మెటొవా సొఖిబా (ఉజ్బెకిస్తాన్‌)ను చిత్తు చేసింది. ఒలింపిక్‌ పతకం తర్వాత వరల్డ్‌ చాంపియన్‌షిప్‌లో, కామన్వెల్త్‌ క్రీడల్లో లవ్లీనా విఫలమైంది. టోక్యోలో 69 కేజీల విభాగంలో పాల్గొన్న లవ్లీనా, పారిస్‌ ఒలింపిక్స్‌లో ఈ ఈవెంట్‌ లేకపోవడంతో 75 కేజీలకు మారింది. ఆసియా చాంపియన్‌షిప్‌లో తొలిసారి పాల్గొన్న పర్వీన్‌ 63 కేజీల కేటగిరీ ఫైనల్లో పర్వీన్‌ 5–0 తేడాతో జపాన్‌ను చెందిన కిటోమై పై ఘన విజయం సాధించింది. 81 కేజీల ఫైనల్లో సవీటీ కూడా అదే జోరుతో 5–0తో గుల్‌సయా యెర్‌జాన్‌ (కజకిస్తాన్‌)ను ఓడించి విజేతగా నిలిచింది. 81 ప్లస్‌ కేటగిరీ ఫైనల్లో అల్ఫియా కూడా సత్తా చాటింది. ఆమె ప్రత్యర్థి, స్థానిక జోర్డాన్‌కే చెందిన ఇస్లామ్‌ హుసైలి తొలి రౌండ్‌లోనే డిస్‌క్వాలిఫై కావడంతో అల్ఫియాకు స్వర్ణం దక్కింది. అయితే మీనాక్షి మాత్రం రజతంతో సంతృప్తి చెందింది. ఫైనల్లో 1–4 తేడాతో కినోషియా రింకా (జపాన్‌) చేతిలో ఓటమిపాలైంది.

భారత క్రికెటర్లే 'చోకర్స్‌'



న్యూఢిల్లీ: క్రికెట్‌లో విజయానికి చేరువగా వచ్చి చివరి, కీలక క్షణాల్లో అనూహ్యంగా చేజార్చుకునే 'చోకర్స్‌'గా దక్షిణాఫ్రికా జట్టుకు పెద్ద పేరే ఉంది. చాలా సార్లు గెలుపు వాకిట దక్షిణాఫ్రికా బోల్తాపడి ఇంటి దారి పట్టింది. అయితే ఇప్పుడు భారత్‌ను కూడా 'చోకర్స్‌' అనవచ్చని దిగ్గజ క్రికెటర్‌ కపిల్‌దేవ్‌ వ్యాఖ్యానించారు. టి20 ప్రపంచకప్‌ సెమీఫైనల్లో భారత్‌... ఇంగ్లండ్‌ చేతిలో చిత్తుగా ఓడటంపై ఆయన స్పందించారు. 'ఒక్క మ్యాచ్‌ ఫలితంతో ఆటగాళ్లను విమర్శించాల్సిన పనిలేదు. కానీ జట్టు ప్రదర్శనరీత్యా చోకర్స్‌ అని పిలవడంలో తప్పులేదు. సెమీస్‌లో టీమిండియా చెత్తగా ఆడింది. నిజమే కానీ అంత మాత్రాన క్రికెటర్లను లక్ష్యంగా చేసుకోవడం తగదు. ఎన్నో ఏళ్లుగా భారత క్రికెట్‌ విజయాల్లో వాళ్లంతా కృషి చేస్తున్నారు' అని కపిల్‌ అన్నారు.

వైద్య విద్య తుది మెరిట్ జాబితాల విడుదల

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 2022–23 విద్యా సంవత్సరానికి యాజమాన్య కోటా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తుది మెరిట్ జాబితాను శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. తుది మెరిట్ జాబితాలో 3,021 మందికి స్థానం దక్కింది. అదే విధంగా అనర్హులైన విద్యార్థుల జాబితాను ప్రకటించారు. శనివారం నుంచి యాజమాన్య కోటా సీట్ల భర్తీకి వెబ్ ఆప్షన్లు నమోదు ప్రక్రియ ప్రారంభిస్తారు. దీనికి ఈనెల 14 ఆఖరి గడువు. ఆర్మీ పిల్లల కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర యూజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తుది మెరిట్ జాబితాను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్లో ఉంచారు.

పాఠశాలల పరీక్షల షెడ్యూల్ ఖరారు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే వివిధ పరీక్షల తాత్కాలిక షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ ఖరారు చేసింది. ఇటీవల వివిధ జిల్లాల విద్యాశాఖ అధికారులు, జిల్లా కామన్ పరీక్షల బోర్డుల అధికారులతో నిర్వహించిన వెబ్ ఎక్స్ సమావేశంలో ఈ షెడ్యూల్‌పై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. వీటిలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్–3ని, సమ్మేటివ్ అసెస్‌మెంట్–2ను క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్‌గా నిర్వహించనున్నారు. డిసెంబర్ 2 నుంచి 6 వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్–2, జనవరి 2 నుంచి 10 వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్–1, ఫిబ్రవరి 7 నుంచి 10 వరకు (సీబీఏ–2) ఫార్మేటివ్ అసెస్‌మెంట్–3, మార్చి 9 నుంచి 14 వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్–4, మార్చి 20 నుంచి 28 వరకు పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు, ఏప్రిల్ 20 నుంచి 27 వరకు (సీబీఏ) సమ్మేటివ్ అసెస్‌మెంట్–2 పరీక్షలు నిర్వహిస్తారు.

ఈ నెల 20లోగా ఖాళీలను భర్తీ చేయండి

వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి నవీన్‌కుమార్

సాక్షి, అమరావతి: జిల్లా ఎయిడ్స్ నియంత్రణా సంస్థల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఏపీ శ్యాక్స్ పీడీ నవీన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 20వ తేదీలోగా జిల్లాల్లో నియామక ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని శ్యాక్స్ ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల అధికారులతో నవీన్‌కుమార్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే నియామకాలు చేపట్టామని, వీటిలో భర్తీ అవ్వకుండా మిగిలిన ఖాళీలను వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేయాలని చెప్పారు. ఉద్యోగ నియామకాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. న్యాకో తాజా ఆదేశాల మేరకు జిల్లాల్లో సెంట్రల్ నోడల్ ఏజెన్సీ బ్యాంక్ అకౌంట్(ఎస్ఎన్ఏ)ను తెరవాలన్నారు. శ్యాక్స్ నుంచి నిధులు పొందాలంటే ఎస్ఎన్ఏ తప్పనిసరి అన్నారు. ఏఆర్‌టీ మందులు మధ్యలో వాడడం మానేసిన రోగులను గుర్తించాలన్నారు. సమీక్షలో శ్యాక్స్ ఏపీడీ డాక్టర్ కామేశ్వరరావు, పెప్ ఫర్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రుషికొండ రక్షణ మీకెందుకు

- పర్యావరణ అధికారి పర్యవేక్షిస్తున్నారు కదా
- ప్రతి అంగుళం మేమే పరిరక్షించాలా?
- హైకోర్టు తీర్పు వరకు ఆగలేరా?
- ఎంపీ రఘురామకృష్ణరాజుపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- హైకోర్టు ఆర్డర్‌లో జోక్యం చేసుకోబోమని స్పష్టీకరణ
- పిటిషన్‌ను ఉపసంహరించుకున్న రఘురామ



సాక్షి, న్యూఢిల్లీ: 'రుషికొండ రక్షణ మీకెందుకు? పర్యావరణ అధికారి పర్యవేక్షణ చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వుల వరకు ఆగలేరా' అంటూ ఎంపీ రఘురామకృష్ణరాజుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. చూస్తుంటే ప్రతి అంగుళం స్థలాన్ని కోర్టే రక్షించాలన్నట్లుగా ఉందని అసహనం వ్యక్తం చేసింది. విశాఖలోని రుషికొండపై నిర్మాణాలకు సంబంధించి ఏపీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం విచారించింది. రఘురామ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రుషికొండపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. 'హైకోర్టు ఆర్డర్ ఇచ్చింది కదా. పర్యావరణ అధికారి పర్యవేక్షణ చేస్తున్నారు. అసలు ఇంతకీ మీరేం అడుగుతున్నారు' అని ప్రశ్నించింది. మధ్యంతర ఆదేశాల కోసం వచ్చామని న్యాయవాది తెలిపారు. హైకోర్టులో జరిగిన అంశాలను వివరించారు. కొండపై కొన్ని నిర్మాణాలు పడగొడుతున్నారన్నారు. దీనికి జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్ స్పందిస్తూ.. 'హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘించారని వచ్చారా? కొండ రక్షణ మీకెందుకు? ప్రతి అంగుళం స్థలాన్ని మేమే పరిరక్షించాలా? ప్రతి ఒక్కరూ సుప్రీంకోర్టుకు ఇలాగే వస్తున్నారు. హైకోర్టు ఆదేశాలు వచ్చే వరకూ ఆగలేకపోతున్నారా? హైకోర్టు ఆర్డర్‌లో మేం జోక్యం చేసుకోం' అని స్పష్టం చేశారు. హైకోర్టులో విచారణ జరుగుతున్న అంశంపై మధ్యంతర ఆదేశాల కోసం దాఖలైన ఈ పిటిషన్‌ను విచారించబోమని, పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని ధర్మాసనం తెలిపింది. పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని రఘురామకృష్ణరాజు న్యాయవాది కోరడంతో అంగీకరించిన ధర్మాసనం విచారణ ముగిస్తున్నట్లు పేర్కొంది.

ఇంజనీరింగ్‌లో 80శాతం సీట్లు భర్తీ

- ముగిసిన ఈఏపీ సెట్ కన్వీనర్ కోటా సీట్లకు కౌన్సెలింగ్
- 1,13,403 సీట్లలో 90,100 సీట్లు భర్తీ
- మిగిలిన సీట్లు మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీకి ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. సుమారు 80 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కన్వీనర్ కోటాలో 1,13,403 సీట్లు ఉండగా, వీటిలో మూడు విడతల కౌన్సెలింగ్‌లో 90,100 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 23,303 సీట్లు మిగిలి ఉన్నాయి. యూనివర్సిటీల కాలేజీలు 25 ఉండగా, వీటిలోని 6,618 సీట్లలో 5,111 భర్తీ కాగా, 219 ప్రైవేట్ కాలేజీల్లోని 1,02,918 సీట్లలో 81,411 సీట్లు విద్యార్థులకు కేటాయించారు. ఆరు ప్రైవేట్ యూనివర్సిటీల్లో 3,867 సీట్లు ఉండగా, 3,578 సీట్లు భర్తీ అయ్యాయి. ఈఏపీసెట్ అడ్మిషన్లను రెండు విడతల్లోనే ముగించాలని తొలుత భావించారు. అయితే ఐఐటీలు, ఎన్ఐటీలలో సీట్లు పొందిన విద్యార్థులు వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిని భర్తీ చేసేందుకు ఈ నెల 7వ తేదీ నుంచి ఉన్నత విద్యామండలి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించింది. ఈ కౌన్సెలింగ్‌కు 331 మంది కొత్త విద్యార్థులతోపాటు ఇంతకుముందే సీట్లు పొందిన 9,958 మంది (స్లైడింగ్) హాజరయ్యారు. వారిలో 3,458 మందికి కొత్తగా సీట్లు కేటాయించారు. మిగిలి ఉన్న 23,303 సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో ఆయా కాలేజీలు భర్తీ చేయనున్నాయి.

ఈ నెలాఖరులో లా అడ్మిషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి ఏపీ లాసెట్, పీజీ లాసెట్ అడ్మిషన్లను ఈనెలాఖరు వారంలో నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ వై.నజీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. బార్ కౌన్సిల్ నుంచి కాలేజీలకు అనుమతులు రాగానే అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

చిరకాలం మన్నికగా

- నాడు – నేడు స్కూళ్లలో నాణ్యమైన మౌలిక సదుపాయాలు
- పాఠశాలలు, టాయిలెట్ల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం
- పక్కాగా టీఎంఎఫ్, ఎస్ఎంఎఫ్ నిధుల వినియోగం
- పేరెంట్స్ కమిటీలకు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన బడి నాడు–నేడు' ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాలల్లోని మౌలిక సదుపాయాలు చిరకాలం మన్నేలా రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను దాదాపు రూ.16 వేల కోట్లతో తీర్చిదిద్దుతూ అదనపు తరగతి గదులతో పాటు పది రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 15,715 స్కూళ్లను రూ.3,669 కోట్లతో అభివృద్ధి చేశారు. రెండో దశ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ పనులన్నీ చిరకాల మన్నికతో ఉండాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఎప్పటికప్పుడు మరమ్మతులు

పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేలా నిత్యం పారిశుధ్య పనులను కొనసాగించడం, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ కింద రూ.444.88 కోట్లు, స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ కింద రూ.450 కోట్లను జమ చేశారు. ఇలా నిధులను కేటాయించడం దేశంలో మరెక్కడా లేదు. 44,968 ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో టాయిలెట్ల మెయింటెనెన్స్ కోసం 47 వేల మంది ఆయాలను ప్రభుత్వం నియమించి నెలకు రూ.6 వేల చొప్పున గౌరవ భృతి చెల్లిస్తోంది. పనులు సక్రమంగా జరిగేలా ఐఎంఎంఎస్ మొబైల్ అప్లికేషన్ కూడా తెచ్చింది. రోజూ మరుగుదొడ్ల నిర్వహణపై ఫొటోల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

నిధులపై మార్గదర్శకాలు

టీఎంఎఫ్, ఎస్ఎంఎఫ్ నిధుల దుర్వినియోగానికి ఆస్కారం లేకుండా హెడ్మాస్టర్, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో వినియోగించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది.పనుల పర్యవేక్షణకు కమిటీలను ఏర్పాటు చేసి పేరెంట్ కమిటీ నుంచి ఇద్దరు సభ్యులను నియమించాలి. హెడ్మాస్టర్, ప్రిన్సిపాళ్లతో కలిపి వీరు జాయింట్ అకౌంటుదారులుగా సంతకాలు చేయాలి. పేరెంట్స్ కమిటీ మొత్తం పనులను పర్యవేక్షించాలి. మరమ్మతుల పనులను గ్రామ, వార్డు ఇంజనీరింగ్ అసిస్టెంటు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, పేరెంట్స్ కమిటీ సభ్యులు గుర్తించి తీర్మానాలు చేయాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.